అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 26-05-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 146 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) | వెల : 8.00

ఉత్తమ నటిగా తొలి భారతీయ నటి అనసూయ సేన్‌గుప్తా

77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కొత్త చరిత్ర



పారిస్ : 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కొత్త చరిత్ర నమోదైంది. ఉత్తమ నటి అవార్డును గెలుచుకున్న తొలి భారతీయ నటిగా అనసూయ సేన్‌గుప్తా నిలిచారు. అన్ సెర్టెన్ రిగార్డ్ విభాగంలో ఆమె ఈ అవార్డును గెలుచుకున్నారు. బల్గేరియన్ దర్శకుడు కాన్‌స్టాంటిన్ బోచనోవ్ దర్శకత్వం వహించిన భారతీయ చిత్రం 'ది షేమ్‌లెస్'లో ఆమె నటనకు ఈ అవార్డు లభించింది. ఈ చిత్రాన్ని ఢిల్లీ వ్యభిచార గృహంలో...13లో

ఒకే గొడుగు కిందకు విపత్తుల నిర్వహణ

365 రోజులూ పని చేసేలా తీర్చిదిద్దాలి



జూన్ 4 లోగా పూర్తి ప్రణాళిక సిద్ధం చేయండి : సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ మహానగరానికి సంబంధించిన వివిధ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందించాలని సూచించారు. కేవలం వర్షాకాలంలో మాత్రమే కాకుండా 365 రోజులు పని చేసేలా ఆ వ్యవస్థను తీర్చిదిద్దాలని కోరారు. శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు విచ్చేసిన సీఎం......13లో

ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్‌కు సీపీఐ, సీపీఐ(ఎం), టీజేఎస్ మద్దతు

సీఎం రేవంత్‌రెడ్డితో లెఫ్ట్,టీజేఎస్ నేతల భేటీ 13లో

రైతులందరికీ బోనస్‌ను వర్తింపజేయాలి

జూన్ మొదటి వారంలోనే పెట్టుబడి సహాయమందించాలి

గుడిసెవాసులకు 120 గజాల స్థలం కేటాయించి పట్టాలివ్వాలి : సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) వినతి



5లో..

ఓ వారం ప్రయోగం చేద్దామా?

అనేక సమస్యలకు పరిష్కారం : మానసిక వైద్య నిపుణులు

చిల్ విత్ నో ఫోన్



డిజిటల్ డిటాక్స్ సురక్షితంగా చేయాలి. ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లపై ఆధారపడటం మానేయాలి. ఇది సవాలుతో కూడుకున్నదే. అయితే దశలవారీగా అమలుచేయవచ్చు. ఒక వారం పాటు డిజిటల్ డిటాక్స్‌పై వెళ్లడం వల్ల మీ చుట్టూ ఉన్న వారితో కొంత ప్రణాళిక వేసుకోవచ్చు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులు, మీరు డిజిటల్ డిటాక్స్‌పై వెళ్లాలని ఉద్దేశించిన వారంలో మిమ్మల్ని సంప్రదించాల్సిన అవసరం ఉన్న ఎవరికైనా తెలియజేయండి. మీరు ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో వారికి వివరించండి.



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఓ వారం ఫోన్ లేకుండా బ్రతికేద్దామా? ఇంటర్నెట్‌కు దూరంగా ఉందామా? ఈ ప్రశ్నే విచిత్రంగా అనిపిస్తుంది కదూ! మానవ జీవితాలతో సెల్‌ఫోన్, ఇంటర్నెట్ అంతలా పెనవేసుకుపోయింది. ఓరోజు తిండి లేకున్నా ఫర్వాలేదు...ఫోన్ ఉంటే చాలు అనే స్థితికి మానవ సమాజం బలహీనపడిపోయింది. అసలు సెల్‌ఫోన్ లేని జీవితాన్ని ఊహిస్తేనే 'అమ్మో...ఎలా? అనే ప్రశ్న మనల్ని మరింత ఆందోళనకు గురిచేస్తుంది. కానీ ఇప్పుడు చరిత్ర తిరగరాయబడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 'డిజిటల్ డిటాక్స్' పేరుతో ఎలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్ లేకుండా ఓ వారం బ్రతికేయడాన్ని సవాలు చేస్తున్నారు. సెల్‌ఫోన్ వ్యసనం నుంచి బయటపడాలనే కోరికతో ఇప్పుడు ఈ సవాల్‌ను స్వీకరించేవారు క్రమంగా పెరుగుతున్నారు. ఓ వారం పాటు నో ఫోన్, నో నోటిఫికేషన్స్, నో సోషల్ మీడియా అంటూ మనిషి...మనిషిగా బ్రతకడం ఎలాగో 'మానవ పరిణామ క్రమం' తరహాలో మళ్లీ చూపించాలనే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.

జీవితంలో ఎన్నో సమస్యలతో మనం అవస్థలు పడుతుంటాం. అవి కుటుంబపరమైనవో, ఆర్థిక పరమైనవో కావొచ్చు. లేదా ఇతర కారణాలు మనల్ని వెంటాడుతుండొచ్చు.. బంధాలు, బంధుత్వాలకు దూరమవుతున్నాం. మనిషి జీవితంలో సింహభాగం సమయాన్ని సెల్‌ఫోన్ మింగేస్తుంది. దాన్ని వదిలించుకుంటే జీవితం ఎలా ఉంటుందో చూడాలనే ఉత్సాహం యువతరంలో ఇప్పుడిప్పుడే ఉదయిస్తుంది. మరీ 2000 సంవత్సరం తర్వాత పుట్టిన వారికి గతంలో ఇలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు లేవనే విషయం కూడా తెలీకుండా, నిత్యావసరాలతో మమేకం అయిపోయాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో కూడా 'మీ కాలంలో సెల్‌ఫోన్ లేదా తాతా...మరి అప్పట్లో మీరెలా బ్రతికారు? అనే ప్రశ్నలు వైరల్‌గా మారుతున్న విషయాన్ని గమనించేఉంటాం. అభివృద్ధి ...6లో

ఇవీ ప్రయోజనాలు...

డిజిటల్ డిటాక్స్ అనేక మార్గాల్లో ఉపయోగపడుతుంది. శారీరక, మానసిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావాల్ని చూపిస్తుంది. దీనిపై ఢిల్లీలోని బీఎల్‌కే-మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ దినిక ఆనంద్ మాట్లాడుతూ... "డిజిటల్ డిటాక్స్‌తో చాలా ప్రయోజనాలుఉన్నాయి. వ్యక్తులు ఆన్‌లైన్‌లో ఎంత సమయం, శక్తిని వెచ్చిస్తున్నారనే దానిపై ఆధారపడి ఈ ప్రయోజనాలు ఉంటాయి. సదరు వ్యక్తులకు చాలా సమయాన్ని తిరిగి ఇచ్చేస్తుంది. ఇంటర్నెట్‌కు దూరంగా ఉండటం ప్రారంభంలో కొంత ఆందోళన, భయం కలిగించడం సహజం. కానీ ప్రయత్నపూర్వకంగా ఆస్వాదిస్తే, వ్యక్తిత్వ వికాసం పునరుత్తేజం కావడం తథ్యం" అని స్పష్టం చేశారు. ఇదే అంశంపై ఢిల్లీకి చెందిన పీడీ హిందూజా ఆస్పత్రికి చెందిన మనస్తత్వవేత్త డాక్టర్ షీనా సూద్ మాట్లాడుతూ డిజిటల్ డిటాక్స్‌తో సంయమనం పాటించడం వల్ల భావోద్వేగాలు, మానసిక ఉల్లాసాలు కచ్చితంగా పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.

ఆరో దశలో 59.06 శాతం పోలింగ్

పశ్చిమ బెంగాల్‌లో హింసాత్మకం

ఇక్కడే అత్యధికంగా 78 శాతం ఓటింగ్..బీహార్‌లో అత్యల్పం

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు





నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల ఆరో విడత పోలింగ్ శనివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7.45 గంటల వరకూ 59.06 శాతం పోలింగ్ నమోదైంది. శనివారం దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 58 లోక్‌సభ నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. అలాగే ఒడిశాలో అసెంబ్లీ స్థానాలకు కూడా పోలింగ్ జరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల ...3లో

ఈవీఎంలకు బీజేపీ ట్యాగ్..

స్పందించిన ఈసీ



13లో

ఎన్డీఎస్‌ఏ సిఫారసులు అమలు చేయలేం

సాగునీటి పారుదల శాఖ లేఖ

- సమయం మించిపోయింది
- ప్రస్తుతం డ్యామ్ భద్రతా చర్యలే
- ఆ తరువాతే పూర్తిస్థాయి మరమ్మతులు
- ఎంత ఖర్చయినా ఎల్అండ్‌టీదే బాధ్యత

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతుల విషయంలో ప్రస్తుతం డ్యామ్‌ల భద్రతా చర్యలకు మాత్రమే పరిమితం కావాలని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ నిర్ణయించింది. వర్షాకాలం తరువాతే పూర్తిస్థాయి మరమ్మతులకు పూనుకోవాలని భావిస్తున్నది. మరో రెండు వారాల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈమేరకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్‌ఏ)కి లేఖ రాసింది. జూన్ రెండో వారం నుంచి భారీ వర్షాలు కురవనున్నాయనీ, ఈ తరుణంలో ఎన్డీఎస్‌ఏ సిఫారసులు అమలుచేయ లేమని తెలియజేసింది. ఈ లేఖకు ఎన్డీఎస్‌ఏ ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది. గత రెండు రోజులుగా మేడిగడ్డ బ్యారేజీకి తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నా ఉత్సాహంగా జరగడం లేదు. ప్రస్తుతం శబ్దాలు రావడం, బుంగలు ఏర్పడటం తదితర పరిణామాలు చోటుచేసు కుంటున్నాయి. మరమ్మతులు చేసేముందు మేడిగడ్డ బ్యారేజీ ప్రాంతంలో పరీక్షలు చేయాలనీ, అవి కూడా కేంద్ర సంస్థలతో నిర్వహించాలని ఎన్డీఎస్‌ఏ సూచించిన సంగతి తెలిసిందే. సీడబ్ల్యూపీఆర్ఎస్, ఎన్‌జీఆర్ఐ, సీఎస్ఎంఆర్ఎస్ తదితర ...13లో

ఆరోగ్యమే మహా భాగ్యం

సుందరయ్య వర్ధంతి సందర్భంగా నవతెలంగాణ సాహితీ సంస్థ, సుప్రజా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మన ఆరోగ్యమే మనకు రక్షణనిస్తుందని నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్ అన్నారు. ఆరోగ్యంగా ఉండడం ద్వారా అన్ని పనుల్లో చురుగ్గా ఉంటామని తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా శనివారం శ్రీవిద్య ఫౌండేషన్, సుప్రజ హాస్పిటల్, నవతెలంగాణ ...13లో

పట్టం.. ప్రతిష్టాత్మకం

రేపు వరంగల్- ఖమ్మం- నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్



- ముగిసిన ఎన్నికల ప్రచారం
- సవాల్‌గా తీసుకున్న పార్టీలు
- సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

వివరాలు 6లో



గుజరాత్‌లో 25 మంది సజీవదహనం

గేమింగ్ జోన్‌లో చెలరేగిన మంటలు

మృతుల్లో 12 మంది చిన్నారులు

రాజ్‌కోట్: వేసవి సెలవులు.. అందులో శనివారం వీకెండ్ కావటంతో తమ చిన్నారులకు ఆటవిడుపు కోసం తల్లిదండ్రులు శనివారం సాయంత్రం స్థానిక గేమింగ్‌జోన్‌కు తీసుకెళ్లారు. పిల్లలంతా సరదాగా ఆడుకుంటుండగా తల్లిదండ్రులు దూరంగా ఉండి చూస్తున్నారు.. ఇంతలోనే ఉన్నట్టుండి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే వారి కండ్లముందే చిన్నారుల అరుపులు, హాహాకారాలు.. అంతలోనే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. ఆ ప్రాంతమంతా అరణ్య రోదనగా మారిపోయింది. పెద్దలు, ...13లో

రూ.10 కోట్లు దాటితే కరోడ్‌పతి ట్యాక్స్

40 శాతం సంపద ఒక్క శాతం వారివద్దే | వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ అధ్యయనంలో వెల్లడి

భారత్‌లోని ఆర్థిక అసమానతను తగ్గించడానికి సంపన్నులపై అదనంగా అత్యల్ప పన్ను వేస్తే చాలని వాల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఈ పదేండ్లలో దేశంలో భారీగా అసమానలు పెరిగాయని వెల్లడించింది. భారత్ అభివృద్ధి చెందుతున్న దేశమయినప్పటికీ.. ఆదాయ అసమానతలను తగ్గించడానికి, పరిష్కరించడానికి ప్రోగ్రెసివ్ వెల్త్ టాక్స్, సమగ్ర పన్ను (కంప్రహెన్సివ్ టాక్స్) విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని సూచించింది. "ఇన్‌కం అండ్ వెల్త్ ఇనీక్వాలిటీ ఇన్ ఇండియా 1922-2023" పేరుతో వాల్డ్ ఇనీక్వాలిటీ ఈల్యాబ్ రిపోర్ట్‌ను విడుదల చేసింది.

నవ తెలంగాణ - బిజినెస్ డెస్క్

దేశంలోని ఒక్క శాతం సంపన్నులపై అదనంగా వేసే పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని నేరుగా పేదల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయవచ్చని, సామాజిక వ్యయాన్ని పెంచడానికి ఉపయోగించవచ్చని రచయితలు, ఆర్థికవేత్తలు నితిన్ కుమార్ భర్తి, లూకస్ చాన్సెల్, థామస్ పికెట్టి, అన్మోల్ సోమంచి సూచించారు. అత్యంత సంపన్నుల కోసం సమగ్రమైన, ప్రగతిశీల సంపద పన్ను ప్యాకేజీని ప్రవేశపెట్టడం ద్వారా భారత్‌లో పెరుగుతున్న ఆదాయం, సంపద అసమానతలను పరిష్కరించవచ్చన్నారు.

రూ.100 కోట్ల ఆదాయంపై 4 శాతం పన్ను

ఆర్థిక సంవత్సరం 2022-23లో భారత జనాభాలో అత్యంత సంపన్నులైన ఒక్క శాతం మంది దేశ ఆదాయంలో 22.6 శాతం, సంపదలో 40.1 శాతం చొప్పున వాటాను కలిగి ఉన్నారు. 2014-15 నుంచి 2022-23 మధ్య దేశంలో భారీగా అసమానతలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే వాల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ నివేదికలో నిపుణులు 'కోటీశ్వరుల పన్ను'ను ప్రతిపాదించారు. 2022-23లో రూ.10 కోట్లు దాటిన వారు మాత్రమే





చెల్లించేలా చూడాలన్నారు. ఈ స్థాయి వారు దేశంలో కేవలం 0.04 శాతం పెద్దలు మాత్రమే ఉన్నారని అంచనా వేశారు. పన్ను ప్యాకేజీలో బేస్‌లైన్, మోడరేట్, యాంబీషస్ పేర్లతో మూడు రకాల పన్నులను ప్రతిపాదించారు. బేస్‌లైన్ వేరియంట్‌లో రూ.10 కోట్ల కంటే ఎక్కువ నికర విలువ కలిగిన వ్యక్తులపై వార్షిక పన్ను 2 శాతం విధించాలి. రూ.10 కోట్ల కంటే ఎక్కువ విలువ కలిగిన ఎస్టేట్‌లపై 33 శాతం వారసత్వ పన్ను (ఇన్‌హెరిటెన్స్ ...6లో

అగ్ర కులాలదే ఆధిపత్యం

భారత్‌లోని ఆర్థిక అసమానతలు కులాలతోనూ ఎలా సంబంధం కలిగి ఉన్నాయో ఈ రిపోర్ట్ విశ్లేషించింది. "దేశంలోని అగ్ర కులాలు జాతీయ సంపదలో గణనీయమైన అసమాన వాటాను కలిగి ఉన్నాయి. భారతీయ బిలియనీర్లు ఎక్కువగా ఉన్నత కులాల క్లబ్‌గా ఉన్నారు. ఒక ప్రగతిశీల సంపద పన్ను ప్యాకేజీ విధానం తక్కువ సంఖ్యలో ఉన్న అతి సంపన్న, ఉన్నత కుల కుటుంబాలపై మాత్రమే కొంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ప్రతిపాదిత పన్ను విధానంతో అట్టడుగు కులాలు, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం చేకూరనుంది. దీని ద్వారా విపరీతమైన సంపద అసమానతలను పరిష్కరించడమే కాకుండా.. భారత్‌లోని సామాజిక, ...6లో

జూన్ 1 నుంచి బడిబాట

రాష్ట్రవ్యాప్తంగా 11 వరకు నిర్వహణ

- 12 నుంచి పాఠశాలలు పున : ప్రారంభం
- బడులకు 229 పనిదినాలు
- వచ్చే ఏడాది ఏప్రిల్ 23 చివరి పనిదినం
- ప్రార్థన అనంతరం రోజూ ఐదు నిమిషాలు యోగా, ధ్యానం
- వచ్చే విద్యాసంవత్సరంలో బ్యాగ్‌లేని రోజులు పది
- అక్టోబర్ 21 నుంచి 28 వరకు ఎస్ఏ-1
- ఏప్రిల్ 9 నుంచి 19 వరకు ఎస్ఏ-2 పరీక్షలు
- పాఠశాలల అకడమిక్ క్యాలెండర్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరంలో వచ్చేనెల 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతాయని ప్రభుత్వం వెల్లడించింది. అదేనెల ఒకటి నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభమవుతుందని ప్రకటించింది. వచ్చేనెల 11 వరకు కొనసాగనుంది. వచ్చే విద్యాసంవత్సరంలో పాఠశాలలకు ...13లో

క్లీన్ ఎనర్జీ అత్యసవరం

- కర్బన ఉద్గారాలు తగ్గించాలి :మీడియా వర్క్‌షాప్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పర్యావరణ పరిరక్షణకు క్లీన్ ఎనర్జీ అత్యవసరమనీ, దాని అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 2070 నాటికి దేశంలో కర్బన ఉద్గారాలను పూర్తిగా తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దాని కార్యాచరణకు అవసరమైన విధాన రూపకల్పనపై చర్చలు, విశ్లేషణలు జరగాలని చెప్పారు. సిటిజన్ కన్స్యూమర్ అండ్ సివిక్ యాక్షన్ గ్రూప్ (కాగ్), పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ఆన్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ (పీఎమ్‌జీఈఆర్), ప్రెస్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్ ఇన్ ఇండియా-ఫోకస్ ఆన్ తెలంగాణ' అంశంపై శనివారంనాడిక్కడి హరిత ప్లాజాలో జరిగిన మీడియా వర్క్‌షాప్‌లె ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగంపై ఆలస్యంగా స్పందిస్తున్నామని అభిప్రాయపడ్డారు. సోలార్ విద్యుత్ ప్రారంభంలో యూనిట్ రేటు రూ.18కి పైగా ఉండేదని, ఇప్పుడది థర్మల్ విద్యుత్‌కంటే తక్కువ రేటుకి దిగివచ్చిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికీకరణ విస్తరిస్తున్నదనీ, దీనివల్ల భూతాపం పెరుగుతుందన్నారు. భూమిపై జీవవైవిధ్యాన్ని మనిషే విధ్వంసం చేస్తున్నాడని ఆక్షేపించారు. క్లీన్ ఎనర్జీపై ప్రభుత్వంలోని అన్ని స్థాయిల్లో చర్చిస్తామనీ, మెరుగైన విధానానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

బయోమాస్, సోలార్, విండ్, హైడల్ వంటి పునరుత్పాదక ఇంధనానికి ప్రాధాన్యత ఇచ్చి, బొగ్గు వినియోగాన్ని తగ్గించాల్సి అవసరం ఉందన్నారు. సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ వ్యవస్థాపకులు, విద్యుత్‌రంగ నిపుణులు ఎమ్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు విద్యుదుత్పత్తిలో బొగ్గు వినియోగాన్ని పూర్తిగా మానేసే పరిస్థితి లేదన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2070 నాటికి కర్బన ఉద్గారాలు తగ్గిస్తామని అంతర్జాతీయ వేదికలపై హామీలు ఇస్తున్నారనీ, దేశ పార్లమెంటులో మాత్రం దీనిపై చర్చే ఉండకపోవడం విచారకరమని అన్నారు. పునరుత్పాదక ఇంధనం కోసం థర్మల్ స్టేషన్లను బ్యాకింగ్‌డౌన్ చేసి, వాటికి ఫిక్సెడ్ చార్జీలు చెల్లిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వాలు తీసుకొనే నిర్ణయాలు, అమలు చేసే విధానాలు అంతిమంగా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలనీ, కేవలం కార్పొరేట్లకు దోచిపెట్టేలా ఉంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

దేశంలో బొగ్గు వినియోగం తగ్గించాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఓవైపు ఆదేశాలు ఇస్తూ, మరోవైపు విదేశీబొగ్గును దిగుమతి చేసుకోవాలని చెప్పడం ద్వంద్వ విధానం కాక ఇంకేంటని ప్రశ్నించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పబ్లిక్ పాలసీ నిపుణులు డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ సదస్సుల్లో కాలుష్య నివారణ చర్యలు తీసుకుంటామని మోడీ ప్రభుత్వం చెప్తున్నదనీ, కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా జరుగుతుందన్నారు.

ప్రత్యామ్నాయ ఇంధన వనరుల్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ భూతాపం పెరిగితే దేశంలో 23 నుంచి 26 రకాల ఆహారధాన్యాల ఉత్పత్తికి విఘాతం ఏర్పడుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైందన్నారు. 'కాగ్' సభ్యురాలు రిచామిశ్రా, సీనియర్ రీసెర్చర్ విష్ణుమోహన్‌రావు, జర్నలిస్టులు దిలీప్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ కే బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అవసరాలను గుర్తించి బోధించాలి

- జేఎన్టీయూహెచ్ సందర్శనలో ఇన్‌చార్జీ వీసీ బుర్రా వెంకటేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జేఎన్టీయూ హైదరాబాద్ ఇన్‌చార్జీ వీసీ, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ఆ వర్సిటీని సందర్శించారు. రెక్టార్ కె విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె వెంకటేశ్వరరావు సమక్షంలో వర్సిటీలోని డైరెక్టర్లు, కాలేజీ ప్రిన్సిపాల్, పలు విభాగాల ప్రొఫసర్లు, హెచ్‌వోడీలను వీసీకి రిజిస్ట్రార్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థుల అవసరాన్ని గుర్తించి విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థులకు సంతృప్తినిచ్చేలా చదువు చెప్పాలని కోరారు. వారు ఉన్నత స్థితిలో ఉంటే ఆ ఉపాధ్యాయుల సంతోషమే వేరని అన్నారు. వచ్చే వారం తాను ప్రతి విభాగాన్ని సందర్శిస్తానని చెప్పారు. దేశంలోనే మంచి పేరు గల జేఎన్టీయూ హైదరాబాద్ ప్రతిష్టను కాపాడుకోవాలని సూచించారు. మరింత మెరుగైన సేవలను విద్యార్థులకు అందించాలని కోరారు. ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తేవాలని అధ్యాపకులకు సూచించారు. ఆలస్యం చేయకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

తీన్మార్ మల్లన్నకు టీఎస్‌పీటీఏ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీటీఏ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టీఎస్‌పీటీఏ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, ప్రధాన కార్యదర్శి పిట్ల రాజయ్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి మూడు జిల్లాల్లోని ప్రాథమిక ఉపాధ్యాయులు మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. శాసనమండలిలో ప్రాథమిక ఉపాధ్యాయుల సమస్యలపై గొంతుకగా ఆయన పనిచేస్తారనీ, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని పేర్కొన్నారు.

తీన్మార్ మల్లన్నకు గెస్ట్ లెక్చరర్ల మద్దతు

ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్)కు ప్రభుత్వ జూనియర్ కాలేజీల గెస్ట్ లెక్చరర్ల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గెస్ట్ లెక్చరర్లు చాలీచాలని వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా సకాలంలో రెన్యూవల్ కాకుండా జాప్యం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ కారణాలతో తొలగించిన గెస్ట్ లెక్చరర్లను తిరిగి నియమించడం, అదనపు పోస్టులను మంజూరు చేయడం, సకాలంలో జీతాల చెల్లింపునకు బడ్జెట్ కేటాయించడం వంటి అంశాలను తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించి,వేతనాలను పెంచేలా, ఏటా ఆటో రెన్యూవల్ అయ్యేలాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామంటూ ఆయన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇతర మంత్రుల సహకారంతో సమస్యలను పరిష్కారమయ్యేలా చూస్తామన్నారని తెలిపారు. ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో తీర్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఇన్సూరెన్స్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఇన్సూరెన్స్ చెక్కులను ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పంపిణీ చేశారు. ప్రమాదాల్లో మృతి చెందిన 200 మంది కార్యకర్తల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మీరంతా కేసీఆర్ కుటుంబ సభ్యులే'నన్నారు. కేసీఆర్ మదిలో నుంచి పుట్టిన ఆలోచనే ఇదన్నారు.

బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకునే వారందరికీ ప్రమాద బీమా కల్పిస్తున్నామన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారికుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున బీమా మొత్తాన్ని అందిస్తున్నామని చెప్పారు. రూ.118 కోట్లకు పైగా మొత్తాన్ని ఇప్పటి వరకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల బీమా కోసం వెచ్చించామని తెలిపారు. ఇప్పటివరకు 5,522 మందికి రూ.110 కోట్ల మేర లబ్ది జరిగిందన్నారు. ..అధికారంలో లేనంత మాత్రాన ఇది ఆగిపోదని చెప్పారు. కార్యకర్తల సంక్షేమం కోసం బీఆర్ఎస్ కట్టుబడి ఉందన్నారు.

అన్యాయాలకు వ్యతిరేకంగా స్వరం పెంచింది ఇప్టానే..

- తెలంగాణ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అన్యాయాలకు వ్యతిరేకంగా స్వరం పెంచింది ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా)నే అని తెలంగాణ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని అనుముల సత్యనారాయణ రెడ్డి భవన్‌లో తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఇప్టా 81వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ భారతదేశ సాంస్కృతిక చరిత్రలో ఇప్టాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అణగారిన వర్గాల వాణిగా నేటికీ అది పని చేస్తున్నదని చెప్పారు. డప్పు, పాటలు, నాటకాలు, జానపదాల ద్వారా ప్రజల్లో సాంస్కృతిక చైతన్యం తీసుకొచ్చిందన్నారు. స్వాతంత్రోద్యమంలో, చారిత్రిక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొనేలా పౌరులను ప్రోత్సహించిందని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రజా నాట్యమండలి పైన ప్రభుత్వం విపరీతమైన నిర్బంధకాండను సాగించిందన్నారు. 'మాభూమి' నాటకాన్నీ, పాటలను, జానపద కార్యక్రమాలను నిజాం ప్రభుత్వం అణచివేసిందని అయన గుర్తు చేసారు. 1943 సంవత్సరంలో ఆనాటి నాటక, చలన చిత్ర దిగ్గజాలు బాలరాజ్ సహానీ, సలీల్ చౌదరి, పృథ్వీరాజ్ కపూర్, కె.ఎ. అబ్బాస్, శంభో మిత్ర, పండిట్ రవి శంకర్, ఆనంద్ శంకర్, కైఫీ అజ్మి, ఏ.కె. హంగల్ లాంటి మహానుబాహుల సారథ్యంలో ఇప్టా ఆవిర్భవించిందని వివరించారు. నాటి నుంచి దేశంలో సాహిత్యం, చరిత్ర, సినిమా, సంగీతం, సంస్కృతి, రాజకీయ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తువస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్య మండలి అధ్యక్షులు కె. శ్రీనివాస్‌తో పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ నేతృత్వంలో పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

6,7 తరగతుల విద్యార్థులకు మరో ప్యాంట్‌కు బట్ట ఇవ్వాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి టీఎస్‌జీహెచ్‌ఎంఏ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు మరో ప్యాంటు కుట్టడానికి అవసరమయ్యే అదనపు బట్టను ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి, కోశాధికారి బి తుకారాం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థులు 11, 12 ఆపైన ఏండ్ల వయస్సులో ఉంటారని తెలిపారు.బాలురు తోటి విద్యార్థినీ, విద్యార్థుల ముందు నిక్కర్లు వేసుకుని బడికి వచ్చి తిరగడానికి, కూర్చోవడానికి ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఏటా ఇచ్చే రెండు నిక్కర్లకు బదులుగా ఒక ప్యాంటు కుట్టివ్వమంటూ వారి తల్లిదండ్రులు టైలర్లను అడుగుతున్నారని తెలిపారు. తద్వారా ఆ విద్యార్థులు ఏడాది మొత్తానికి రెండు చొక్కాలు, ఒక ప్యాంటుతో గడపాల్సి వస్తున్నదని వివరించారు. అతి తక్కువ వ్యయంతో సుమారు నాలుగు లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా మరో ప్యాంటు కుట్టడానికి అవసరమయ్యే అదనపు బట్టను ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఏఆర్‌హెచ్‌సీ స్కీమ్ ఫ్లాప్

నాలుగేండ్లలో సిద్ధంగా ఉన్న ఇండ్లు 7 శాతం కంటే తక్కువే

- అవి కూడా ఐదు రాష్ట్రాలు, యూటీలలోనే
- పట్టణ పేదలకు నెరవేరని 'గూడు' లక్ష్యం
- రాష్ట్రాలతో కేంద్రానికి సమన్వయం లోపం
- మోడీ సర్కారు తీరుపై పట్టణ పేదల ఆగ్రహం



న్యూఢిల్లీ : పట్టణ పేదల కోసం 2020 జులైలో మోడీ ప్రభుత్వం తక్కువ అద్దె గృహ సముదాయాల(ఏఆర్‌హెచ్‌సీ) పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే, ఈ పథకం మాత్రం పేదల ఆశలను తీర్చటం లేదు. వారికి నివాసం ఉండటానికి గూడును కల్పించటం లేదు. మోడీ సర్కారు వైఫల్యంతోనే ఏఆర్‌హెచ్‌సీ స్కీమ్ విజయవంతం కావటంలేదని దేశవ్యాప్తంగా ఉన్న పట్టణ పేదలు ఆగ్రహంతో ఉన్నారు. ఈ పథకం అమలులోకి వచ్చినప్పటి నుంచి నాలుగేండ్ల తర్వాత 83 వేలకు పైగా ప్రభుత్వం నిర్మించిన ఫ్లాట్లలో ఏడు శాతం కంటే తక్కువ.. పట్టణ ప్రజలకు తక్కువ అద్దె గృహాలుగా మార్చబడ్డాయి. అవి కూడా ఐదు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోనే కావటం గమనార్హం.

నగరాల నుంచి వలస కార్మికులు పెద్ద ఎత్తున తిరిగి గ్రామాలకు వెళ్లడానికి దారితీసిన కోవిడ్ -19 మహమ్మారి సమయంలో ప్రారంభించబడిన ఈ పథకం లక్ష్యం పట్టణ పేదలకు అద్దె ప్రాతిపదికన గృహాలను అందించటం. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న 83,534 ఫ్లాట్లను అద్దె వసతిగా మార్చాల్సి ఉన్నది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్(జేఎన్ఎన్‌యూఆర్ఎం), రాజీవ్ ఆవాస్ యోజన కింద ఈ ఫ్లాట్‌లు నిర్మించబడ్డాయి. ఏఆర్‌హెచ్‌సీ పథకం కింద.. ఈ ఫ్లాట్‌లను పట్టణ పేదలకు అద్దె గృహాలుగా మార్చాలి. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఇప్పటి వరకు ఐదు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 5,648 ఫ్లాట్లు మాత్రమే అద్దె ప్రాతిపదికన పట్టణ పేదలకు అందుబాటులోకి వచ్చాయి. 83,534 ఫ్లాట్లలో, మెజారిటీ మహారాష్ట్ర (32,245), ఢిల్లీ (29,112)లో ఉన్నాయి. 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో.. గత నాలుగేండ్లలో 13,061 ఫ్లాట్లను అద్దె గృహాలుగా మార్చటానికి గుర్తించారు. వీటిలో 5,648 గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, చండీగఢ్, జమ్మూ కాశ్మీర్‌లలో అద్దె గృహాలుగా మార్చబడ్డాయి. మంత్రిత్వ శాఖ వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఐదు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని ప్రభుత్వ ఏజెన్సీలు మరో 7,413 గృహాలను అద్దెకు మార్చే ప్రక్రియలో ఉన్నాయి.



పట్టణ పేదలకు ఇళ్ల స్థలాలు అందించడం మోదీ ప్రభుత్వ ప్రధాన హామీలలో ఒకటి. ఏఆర్‌హెచ్‌సీ లాగానే 2015, జూన్‌లో ప్రారంభించబడిన ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పీఎంఏవై-యూ) పట్టణ ప్రాంతాల్లోని మురికివాడలలో నివసించే పట్టణ పేదలకు గృహాలను అందించడానికి ఉద్దేశించిన ఇన్-సిటు స్లమ్ రీడెవలప్‌మెంట్(ఐఎస్ఎస్ఆర్) భాగాన్ని కలిగి ఉన్నది. అయితే, చాలా మంది పేదలు దీనితో ప్రయోజనం పొందలేదని పట్టణాభివృద్ధి, గృహ నిపుణులు తెలిపారు.

హౌసింగ్, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారుల వద్ద అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. ఐఎస్ఎస్ఆర్ కాంపోనెంట్ కింద 2.96 లక్షల గృహాలు మంజూరయ్యాయి. వాటిలో 1.56 లక్షలు మార్చి 11 వరకు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్‌లో ఈ పథకం ముగియనున్నది. దేశవ్యాప్తంగా నగరాల్లోని మురికివాడల్లో నివసించే ప్రజలను ప్రభుత్వ సంస్థలు పెద్ద ఎత్తున ఖాళీ చేయించినప్పటికీ.. వారికి గృహాలను అందించడానికి చాలా తక్కువ చర్యలు తీసుకున్నారని ఢిల్లీలోని ఒక ఎన్జీఓ హౌసింగ్ అండ్ ల్యాండ్ రైట్స్ నెట్‌వర్క్(హెచ్ఎల్ఆర్ఎన్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎనాక్షి గంగూలీ అన్నారు.

గంగూలీ ప్రకారం.. దేశవ్యాప్తంగా 2022, 2023లో దాదాపు 7.4 లక్షల మంది మురికివాడల నివాసితులు తొలగించబడ్డారు. ఈ నెల ప్రారంభంలో, భూమి హక్కుల సంఘం భారతదేశంలోని మురికివాడల నివాసితుల తొలగింపుపై నివేదికను విడుదల చేసింది. "ఢిల్లీ వంటి నగరాల్లో, చాలా తక్కువ ఇన్-సిటు రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు చేపట్టబడ్డాయి. ఢిల్లీలో అద్దె గృహాల పరిస్థితి ఏమిటో కూడా మాకు తెలియదు. పట్టణ పేదలకు గృహాలను అందించడానికి బాగా ఆలోచించదగిన విధానాన్ని కలిగి ఉండాల్సిన అవసరం ఉన్నది "అని గంగూలీ అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ప్రకారం, ఏఆర్‌హెచ్‌సీ పథకం కింద నిర్మించిన ఫ్లాట్‌లు చాలా కాలం క్రితం నిర్మించబడ్డాయి.

వాటికి మరమ్మతులు చేయాల్సి ఉండగా, కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. ఢిల్లీలో కూడా జేఎన్ఎన్‌యూఆర్ఎం, రాజీవ్ ఆవాస్ యోజన కింద నిర్మించిన ఫ్లాట్‌లలో కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. ఢిల్లీలోని 29,000కు పైగా ఫ్లాట్ల విషయంలో.. కేంద్రం మరియు ఢిల్లీ ప్రభుత్వం ఈ అంశంపై ఇంకా ఒక అంగీకారానికి రాలేదు. మహారాష్ట్రలో ఏఆర్‌హెచ్‌సీ ప్రతిపాదనలను దాదాపు 40కి పైగా నగరాల్లో మున్సిపల్ కార్పొరేషన్లు అమలు చేస్తున్నాయి. "ప్రస్తుతానికి, అద్దె గృహాల పథకం కింద ఎటువంటి ప్రతిపాదనను తీసుకోలేదు" అని మహారాష్ట్ర ప్రభుత్వ హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లోని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

అగ్నివీర్స్ పథకంపై
ఆర్మీ సర్వే

రాబోయే ప్రభుత్వానికి సిఫారసులు రూపొందించే అవకాశం



న్యూఢిల్లీ : ఆర్మీ అగ్నిపథ్ పథకంపై అంతర్గత సర్వేను నిర్వహిస్తున్నది. ఇప్పటివరకు దాని రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై దాని ప్రభావాన్ని ఇది అంచనా వేస్తుంది. దీని ఆధారంగా స్కీమ్‌లో సాధ్యమయ్యే మార్పులపై రాబోయే ప్రభుత్వానికి సిఫారసులను రూపొందించే అవకాశం ఉన్నది. 2022 జూన్‌లో ప్రారంభించబడిన అగ్నిపథ్ పథకం అగ్నివీర్లను(సైనికులు, ఎయిర్‌మెన్, నావికులు) నాలుగు సంవత్సరాల పాటు సాయుధ దళాలలో నియమిస్తుంది. నాలుగు సంవత్సరాల పదవీకాలం ముగిసే సమయానికి, వారిలో 25 శాతం మంది మెరిట్, సంస్థాగత అవసరాలకు లోబడి రెగ్యులర్ ప్రాతిపదికన సేవల్లో చేరటానికి స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ వివాదాస్పద పథకంపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ప్రతిపక్షాలతో పాటు దేశ యువత ఈ పథకాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రతిపక్ష కాంగ్రెస్ ఈ పథకానికి ముగింపు పలికి.. మునుపటి సైనిక నియామక ప్రక్రియకు తిరిగి తీసుకొస్తామని ప్రతిజ్ఞ చేసింది. కొన్ని వారాల క్రితం.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ అవసరమైతే అగ్నిపథ్ పథకాన్ని మార్చటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదనీ, అగ్నివీరులుగా చేరిన యువకుల భవిష్యత్తుపై ప్రభావం ఉండదని అన్నారు.

అధికారుల ప్రకారం.. ఆర్మీ సర్వే అగ్నివీర్స్‌తో సహా అన్ని వాటాదారుల (సైన్యంలోని వివిధ రెజిమెంటల్ సెంటర్‌లలోని రిక్రూటింగ్, శిక్షణ సిబ్బంది మరియు అగ్నివీర్స్ పనిచేసే యూనిట్ మరియు సబ్-యూనిట్ కమాండర్‌లు) నుంచి స్పందనలు కోరింది. ప్రతి గ్రూప్‌నకు సంబంధించిన నిర్దిష్ట ప్రశ్నలకు సమాధానాలు ఏకీకృతం చేయబడి.. తదుపరి అంచనా కోసం ఈ నెలాఖరులోగా ఒకదానితో ఒకటి ఉంచబడుతుందని అధికారులు తెలిపారు. దాదాపు 10 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళికి సమాధానాలు ఉంటాయని అధికారులు చెప్పారు. ఉదాహరణకు, రిక్రూటర్‌లు అగ్నివీర్స్ సైన్యంలో చేరటానికి గల ప్రాథమిక కారణాలపై ఇన్‌పుట్‌లను అందించాలి. వారు దళంలో చేరటానికి ఎంత ఆసక్తిగా ఉన్నారు, అలాగే, వారి సాధారణ అవగాహన స్థాయిలు, దరఖాస్తుదారుల నాణ్యత, దేశంలోని పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల నుంచి దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షకు ఎలా స్పందించారు అనే ప్రశ్నలకు వారు ప్రతిస్పందించాలి. సైనిక కార్యకలాపాలలో అగ్నివీర్‌లు బాధ్యతగా ఉన్నారా? వారి ఇండక్షన్‌తో వారు ఎదుర్కొంటున్న ఇతర మానవ వనరుల సమస్యలపై వివిధ యూనిట్, సబ్-యూనిట్ కమాండర్‌ల నుంచి వచ్చిన ఇన్‌పుట్‌లను కూడా సర్వే పరిగణనలోకి తీసుకుంటుంది.

కాగా, ఆర్మీలో 40,000 మంది అగ్నివీరులతో కూడిన రెండు బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకుని పోస్టింగ్‌లో ఉన్నారు. 20,000 మందితో కూడిన మూడో బ్యాచ్ గతేడాది నవంబర్‌లో శిక్షణను ప్రారంభించింది. నేవీలో మూడు బ్యాచ్‌ల 7,385 అగ్నివీర్‌లు శిక్షణను పూర్తి చేశారు. ఐఏఎఫ్‌లో 4,955 మంది అగ్నివీర్ వాయు ట్రైనీలు శిక్షణను పూర్తి చేసుకున్నారు.

ఓటరు 'ఆలోచన'

- పలు అంశాలు ప్రాధాన్యంగా ఓటు
- ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఆధారంగా పలువురు ప్రజల చర్చ
- అలా అయితే.. మోడీ సర్కారుకు ఈసారి ఎదురుదెబ్బ తప్పదు
- రాజకీయ విశ్లేషకుల అంచనా

న్యూఢిల్లీ : భారత్‌లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో పలు వర్గాల ఓటర్లు తమ ప్రాధాన్యత అంశాల ఆధారంగా ఓటు వేసినట్టు నిపుణులు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దేశంలో ఉన్నత స్థాయి ప్రాంతాలకు చెందిన ఓటర్లు జాతీయవాదం, జాతీయ భద్రత, భారతదేశ గ్లోబల్ ఇమేజ్, ఆర్థిక వృద్ధిపై ఓటు వేశారని చెప్పారు. అయితే, పేద, మురికి వాడ ప్రాంతాల్లో నివసించేవారు మాత్రం.. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మెరుగైన విద్య వంటి సమకాలీన సమస్యలను పరిగణించారని తెలిపారు. తూర్పు ఢిల్లీలోని పట్‌పర్‌గంజ్‌లో నివసిస్తున్న కుందన్ సింగ్ వోహ్రా(48) మాట్లాడుతూ.. తాను దేశాభివృద్ధికి ఓటు వేసినట్టు చెప్పారు.

పంచశీల్ పార్క్‌కు చెందిన పియాలీ దేబ్(23) వృత్తిరీత్యా టెక్స్‌టైల్ డిజైనర్. అయితే, తాను రిజర్వేషన్‌కి వ్యతిరేకమనీ, అది తనకు కీలకాంశమని చెప్పారు. ఓఖ్లాలోని మురికి వాడలో నివసిస్తున్న దీపికా(19).. ఉపాధి అవకాశాలపై ఆందోళనను వ్యక్తం చేసింది. దాని ఆధారంగానే ఓటు వేసినట్టు చెప్పింది. "నేను ఈ సంవత్సరం కాలేజీకి వెళతాను. నా భవిష్యత్ అవకాశాల గురించి నేను ఆందోళన చెందుతున్నాను. ప్రజలు మతపరమైన సమస్యలపై ఎక్కువ శ్రద్ధ వహిస్తారు. అయితే పేదల అవసరాలను తీర్చడంపై దృష్టి పెట్టాలని నేను భావిస్తున్నాను" అని ఆమె చెప్పింది. "నాకు ద్రవ్యోల్బణం చాలా ఆందోళన కలిగిస్తుంది. ఎందుకంటే దేశంలో ధరలు పెరుగుతూనే ఉన్నాయి. విద్యా స్థాయిలు పెరుగుతున్నప్పటికీ, యువతకు ఉపాధి దొరకడం లేదు" అని సంగం విహార్‌కు చెందిన షానవాజ్ ఆలం అన్నారు. తుగ్లకాబాద్ గ్రామంలోని ఓటరు శ్యామ్‌రాయ్ మాట్లాడుతూ దేశ ప్రగతికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. మాకు మంచి పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, రోడ్లు కావాలన్నారు. అయితే, ప్రస్తుత పరిస్థితిని చూస్తే.. పేద, మధ్య తరగతి ప్రజల నుంచి మాత్రం మోడీ సర్కారుకు ఎదురుదెబ్బ తప్పదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.



ఆరో దశలో 59.06 శాతం పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

చేసిన వివరాల ప్రకారం, రాత్రి 7.45 గంటల వరకు పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 78 శాతం పోలింగ్ నమోదుకాగా, అత్యల్పంగా బీహార్‌లో 53.19 శాతం నమోదు అయింది. జార్ఖండ్‌లో 62.66 శాతం, ఒడిశాలో 59.92 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 54.03 శాతం పోలింగ్ నమోదైంది. ఢిల్లీలో 54.37 శాతం, హర్యానాలో 58.24 శాతం పోలింగ్ నమోదు అయింది. జమ్మూకాశ్మీర్ లోని అనంత్‌నాగ్-రాజౌరీ లోక్‌సభ నియోజకవర్గంలో 51 శాతం పోలింగ్ నమోదైంది. 1989లో కాశ్మీర్‌లో మిలిటెన్సీ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే అత్యధికం.

అయితే ఇవి తాత్కాలిక గణాంకాలే అని, తుది ఓటింగ్ శాతం స్వల్పంగా పెరుగుతుందని ఈసీ పేర్కొంది. "దేశంలోని కొన్ని ప్రాంతాలలో వేడి వాతావరణం ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా ఓటు వేయడానికి ఓపికగా క్యూలో నిల్చున్నందున ఓటర్లు తమ ఉత్సాహాన్ని చూపించారని" అని ఎన్నికల సంఘం తెలిపింది.

సమైక్యత, సామరస్య పరిరక్షణకే ఓటు : ఏచూరి - ఢిల్లీలో ఓటు హక్కు వినియోగించుకున్న కరత్ దంపతులు

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి శనివారం ఢిల్లీలో తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఏచూరి మాట్లాడుతూ, దేశం కోసం,రాజ్యాంగ పరిరక్షణ కోసం, భారత దేశ ఐక్యత, సామరస్యాన్ని కాపాడడం కోసం ఓటు వేశాను అని చెప్పారు. సీతారాం ఏచూరితోబాటు ప్రకాశ్ కరత్, బృందాకరత్ కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆ బూత్‌లో ఓటింగ్ మెషిన్ మొరాయించడంతో కొద్ది సేపు పోలింగ్‌కు అంతరాయమేర్పడింది. ఉదయం 9.15 గంటలకే ఓటింగ్ మెషిన్ బ్యాటరీ డౌన్ అవడం వల్ల 30 నిమిషాలసేపు పనిచేయలేదు. దీనిపై బృందా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలకు శనివారం పోలింగ్ జరిగింది.

కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరీ దంపతులు, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ కుటుంబం ఓటు హక్కు వినియోగించుకుంది.

తూర్పు ఢిల్లీ ఎంపీ, మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్, బీజేపీ అభ్యర్థి బన్సూరీ స్వరాజ్, ఆమె తండ్రి కౌశల్ స్వరాజ్, ఢిల్లీ మంత్రులు సౌరభ్ భరద్వాజ్, ఆతిశీ, రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ్ సింగ్ తదితరులు తొలి గంటల్లో ఓటేశారు.

నియంతృత్వం, నిరుద్యోగానికి వ్యతిరేకంగా ఓటు వేశా : కేజ్రీవాల్

చాందినీ చౌక్ లోక్‌సభ నియోజకవర్గంలో సివిల్ లైన్స్ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి కేజ్రీవాల్ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'నా తండ్రి, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి వచ్చి ఓటు వేశాను. అనారోగ్యం కారణంగా మా అమ్మ పోలింగ్ కేంద్రానికి రాలేకపోయారు. నేను నియంతృత్వానికి, ద్రవ్యోల్బణం, నిరుద్యోగానికి వ్యతిరేకంగా ఓటు వేశాను. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ (బీజేడీ) పార్టీ చీఫ్ నవీన్ పట్నాయక్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ఓ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు వేశారు. హర్యానా సిఎం నాయబ్ సింగ్ సైనీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ శనివారం ఢిల్లీలో ఓటు వేశారు.

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ అన్నారు. లోక్‌సభ ఆరో విడత ఎన్నికల్లో భాగంగా హర్యానాలో తన సతీమణితో కలిపి ఓటు హక్కు వినియోగించుకున్నారు. జార్ఖండ్‌లోని రాంచీలో ఇండియన్ క్రికెటర్ ఎంఎస్ ధోని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న రాజకీయ ప్రముఖులు



ఆరో దశ పోలింగ్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ లతో పాటు పారిశ్రామిక, క్రీడాకారులు, రాజకీయ ప్రముఖులు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్ కాంప్లెక్స్‌లోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ కేంద్రీయ విద్యాలయంలోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ఆయన సతీమణి సుదేశ్ క్యూలైన్లో నిల్చుని ఓటు వేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఉదయం 9.30 గంటలకు నిర్మాణ్ భవన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు వేశారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తొలి గంటల్లో ఓటేశారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ కుమార్తె మిరియా, కుమారుడు రేహాన్ వాద్రా క్యూలైన్లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సందేహాల వాతావరణాన్ని సృష్టించే యత్నం..

పోలింగ్ డేటా వివాదంపై సీఈసీ రాజీవ్ కుమార్



న్యూఢిల్లీ: "వారు (న్యాయమూర్తులు) నిజాన్ని అంగీకరించారు. సందేహాస్పద వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం జరిగింది. మేం ఏదో ఒక రోజు ఖచ్చితంగా దీని గురించి అందరితో చర్చిస్తాం' అని కోర్టు నిర్ణయంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ స్పందించారు. శనివారం ఆయన ఢిల్లీలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పోలింగ్ డేటా వివాదంపై మాట్లాడారు. సందేహాల వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నంగా ఆయన ఆరోపించారు. మరోపక్క బూత్‌ల వారీగా పోలింగ్ శాతంపై ఎలాంటి ఆదేశాలు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. కాగా, దేశ ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం కావడం పట్ల సీఈసీ రాజీవ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడేందుకు, ఆందోళనలను పరిష్కరించేందుకు ఈసీ నిబద్ధతతో ఉందని తెలిపారు.

బహుశా ఈవీఎంలు సరిగ్గా పని చేయకపోవడం, ఓటింగ్ లిస్ట్ తప్పుగా ఉండటం లేదా ఓటర్ల జాబితా తారుమారు కావడం వంటి పలు సందేహాలు ప్రజల్లో తలెత్తుతున్నాయని చెప్పారు. సుప్రీంకోర్టు కూడా దీని గురించి ప్రస్తావించిందని అన్నారు. 'ఇలాంటి సందేహాలు ఎందుకు సృష్టిస్తున్నారు? ఎందుకు అనుమానాలు తలెత్తుతున్నాయి? ఏం నాటకం జరుగుతోంది? ఇవన్నీ ఒక రోజు బయటపెడతాం. ప్రజలను ఎలా తప్పుదోవ పట్టిస్తున్నారో అందరికీ చూపుతాం' అని అన్నారు.

డేటా మార్చడం అసాధ్యం : ఈసీ

ఐదు దశల సంపూర్ణ పోలింగ్ వివరాలు వెల్లడి..



న్యూఢిల్లీ: పోలింగ్ డేటాను మార్చడం అసాధ్యమని ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. పోలింగ్ శాతాలపై తప్పుడు కథనాలు రూపొందిస్తున్నారని ఆరోపించింది. లోక్‌సభ ఎన్నికల ఐదు దశలకు సంబంధించిన సంపూర్ణ పోలింగ్ వివరాలు, ఓటు వేసిన వారి పూర్తి శాతాలను శనివారం విడుదల చేసింది. పోలింగ్ ముగిసిన 48 గంటల్లోపు ప్రతి బూత్‌లో పోలైన, తిరస్కరించిన ఓట్లతో సహా పోలింగ్ డేటాను విడుదల చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో శుక్రవారం పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రతి దశ పోలింగ్ తర్వాత డేటాను సంకలనం చేసి వెబ్‌సైట్‌లో ప్రచురించేలా ఈసీని ఆదేశించాలని ఆ పిటిషన్లలో కోరారు. ఈ పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

కాగా, పోలింగ్ ముగిసిన తర్వాత ఓటింగ్ శాతాలు పెరుగుతున్నట్టు వస్తున్న ఆరోపణలపై ఈసీ స్పందించింది. ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసేందుకు ఇలాంటి తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. సుప్రీంకోర్టు పరిశీలనలు, తీర్పుతో ఓటింగ్ శాతం డేటా విడుదల ప్రక్రియ మరింత బలపడుతుందని పేర్కొంది. అయితే డేటా విడుదల కసరత్తు మొత్తం కూడా ఎలాంటి తేడా లేకుండా కచ్చితమైన, స్థిరమైన, ఎన్నికల చట్టాలకు అనుగుణంగా జరుగుతుందని ఈసీ తెలిపింది. ఎన్నికల ప్రజాస్వామ్యం కోసం నిరాటంకంగా సేవ చేయాల్సిన ఉన్నతమైన బాధ్యత కమిషన్‌పై ఉందని గుర్తు చేసింది.

మరోవైపు ఏప్రిల్ 19 నుంచి ముగిసిన ఐదు దశల సంపూర్ణ పోలింగ్ వివరాలను విడుదల చేసిన ఈసీ ప్రతి దశలో పోలింగ్ రోజున ఉదయం 9.30 గంటల నుంచి 'ఓటర్ టర్నింగ్ యాప్'లో డేటా 24/7 అందుబాటులో ఉంటుందని తెలిపింది. ప్రతి దశ పోలింగ్ అనంతరం సాయంత్రం 7 గంటల తర్వాత నుంచి డేటాను నిరంతరం అప్‌డేట్ చేస్తామని తెలిపింది. పోలింగ్ రోజు అర్ధరాత్రి నాటికి, ఓటరు సంఖ్య యాప్ ద్వారా 'క్లోజ్ ఆఫ్ పోల్ డేటా శాతాన్ని ఉత్తమంగా అంచనా వేయొచ్చని వెల్లడించింది. పోలింగ్ ప్రాంతాల్లోని భూగోళ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పోలింగ్ సిబ్బంది తిరిగి చేరిన తర్వాత సంపూర్ణ పోలింగ్ శాతాలు, రీ పోలింగ్ అవసరం గురించి పూర్తి స్పష్టత వస్తుందని వివరించింది.

విధానాలే ప్రధానంగా ఎన్నికల పోరాటం



తెలకపల్లి రవి

తీవ్రస్థాయిలో జరిగిన ఎన్నికల పోరాటం ముగింపు దశకు చేరుకుంది.వచ్చే ఆదివారంలోగానే ఎగ్జిట్‌పోల్స్ వచ్చేస్తాయి. స్థూలంగా రాజకీయ చిత్రం గోచరమవు తుంది. ఎందుకంటే 2024 ఎన్నికల పోరాటం వివిధ పక్షాలకు పెద్ద సవాలుగానే మారింది. లౌకికతత్వం,కేంద్ర పెత్తనం, మోడీ నిరంకుశ పోకడలు పెద్దచర్చకే దారితీశాయి. తెలుగు రాష్ట్రాలలో ఏపీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత నేత జగన్ మలి విజయమా లేక చంద్రబాబునాయుడు ఎన్డీయే పునరాగమనమా అన్నది దేశవ్యాపిత ఆసక్తి నెలకొంది. తెలంగాణలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తొలి కాంగ్రెస్ ప్రభుత్వం లోక్‌సభ స్థానాలలో ఆధిక్యత సాధించి స్థిరపడుతుందా, బీఆర్ఎస్ భవిష్యత్ ఎలా వుంటుంది, బీజేపీ పెరుగుతుందా? అన్న అంశం కూడా ఉత్కంఠ కలిగించింది.జాతీయ స్థాయిలో బీజేపీ ఎన్డీయే కూటమి, కాంగ్రెస్ 'ఇండియా' కూటమి,ప్రాంతీయ పార్టీలూ వామపక్షాలూ హోరాహోరీగా తలపడిన ఈ పోరాటంలో ప్రజల తీర్పు ఎలా వుంటుందనేది జూన్ నాలుగుతో తేలిపోతుంది. దీనిపై పలురకాల విశ్లేషణలు సర్వేలు, అంచనాలు, వాదోప వాదాలు, తిట్లూ శాసనార్థాలూ సాగిపోతున్నాయి. బహుశా ఫలితాల తర్వాతా ఈ వాతావరణం కొంతకాలం కొనసాగు తుంటుంది. ఈ నేపథ్యంలో మౌలికంగా మీడియా సంస్థల, సంఘాల, నేతల పాత్ర ఏంటి అన్నది ఇప్పుడు మనం తేరిపారచూసే అవకాశమేర్పడింది. ఫలితాలతో నిమిత్తం లేకుండా ఈ పోరాటంలో ఈ ఎన్నికల పోరాటం నేర్పిన పాఠమేంటి అన్నది చెప్పుకునే సందర్భం ఇది.

వ్యవస్థలు, విధానాల చర్చ

ఈ ఎన్నికల పోరాటం వివాదాల నుంచి విధానాల వైపు, వ్యక్తుల నుంచి వ్యవస్థల వైపు మరలించడం సైద్ధాంతిక శక్తుల తొలి విజయం. ఓసారి వెనక్కు తిరిగి చూస్తే విశ్వగురు మోడీ విజయయాత్రలా మార్చి అబ్‌కా పార్ చారౌసౌ పార్(ఈ సారి నాలుగు వందల సీట్లు)అంటూ హంగామాగా మొదలైంది.ఇప్పుడెవరూ ఆ మాట అనడం లేదు. అసలు ఆ మాటే మాది కాదు ప్రజల నుంచి తీసుకున్నామని మోడీనే చెప్పుకోవలసిన స్థితి. బీజేపీకి బాగా అనుకూలంగా మాట్లాడే సంస్థలూ వ్యక్తులూ కూడా ఏదో విధంగా మెజార్టీ వస్తుందని సరిపెడుతున్నారు. ప్రశాంత్ కిశోర్,సి ఓటర్ యోగేంద్ర దేశ్‌ముఖ్, యోగీంద్ర యాదవ్ ఇలా రకరకాల వ్యక్తులను తీసుకుంటే 300కు దగ్గరగా సరిపెడుతున్నారు. తాజాగా అంచనాలు విడుదల చేసిన యోగేంద్రయాదవ్ కూడా బీజేపీకి మెజార్టీ రాదంటూనే మిత్రపక్షాలతో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేయొచ్చని చెబుతున్నారు. అమెరికా నుంచి కూడా కొందరు మేధావులు తరలివచ్చి మోడీ విజయం అంటూ అంచనాలు ప్రకటించి వెళ్లారు. ఆరెస్సెస్‌తో బంధమే దెబ్బతీస్తుందన్న భయంతో బీజేపీతో దానిపై ఆధారపడి లేదని నడ్డాతో అనిపించి మరో నాటకం నడిపించారు. మరో వంక బీజేపీయేతర ప్రభుత్వమే వస్తుందని ఇండియా నాయకులం టున్నారు. కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, జైరాం రమేష్, చిదంబరం వంటివారు ఆ మేరకు వివరంగా ప్రకటనలు చేశారు.

బీజేపీకి పోటీ కాంగ్రెస్ మాత్రమేనన్న వాదనలూ తగ్గి 100-125 దాటవని చెబుతున్నారు. మరో వంక మమతాబెనర్జీ వంటి అవకాశవాదులు తాము ఇండియాను బయటనుంచే బలపరుస్తామంటూ తదుపరి ఎత్తులకు అవకాశం అట్టిపెట్టుకుంటున్నారు.చంద్రబాబు నేరుగా పొత్తు పెట్టుకోగా జగన్ వంటివారు తమపై ఆధారపడి మోడీ రావాలని కలలు కంటున్నారు. ఏతావాతా వీరంతా కూడా బీజేపీ ప్రత్యక్ష పరోక్ష దోస్తులే గనక ఎలాగో సర్కారులోకి వస్తామని మోడీ, అమిత్ షా వంటివారు ఆశలు పెట్టుకున్నారు. యూపీలో సమాజ్‌వాదీ పార్టీ బాగా పుంజుకోవడం, బీహార్‌లో తేజస్వియాదవ్ నాయకత్వంలో ఇండియాకు మెరుగైన అవకాశాలు, కర్నాటకలో తెలంగాణ లో కాంగ్రెస్ అధికారంలో వుండటం సానుకూల అంశాలుగా



భావిస్తున్నా రెండు ప్రధాన పార్టీలూ పోటీ పడే హిందీ రాష్ట్రాలలో ఏం జరుగుతుందనేది తేలని అంశమే. మహారాష్ట్రలో వివిధ ప్రాంతీయ పార్టీలలో చీలిక వర్గాలు సృష్టించి బీజేపీ కొంచెం అనుకూలత తెచ్చుకున్నట్టు కనిపిసున్నది.తమిళనాడు, కేరళ కూడా స్పష్టంగా ఎన్డీయేకు అవకాశమే లేని రాష్ట్రాలుగా వున్నాయి. ఈ విధంగా చూస్తే మోడీ మోతకు చిల్లు పడిందనేది స్పష్టమే.అంతేగాక ఆయన విశ్వగురు ముసుగు తీసేసి నేరుగా విద్వేష వాక్కులలోకి దిగవలసి వచ్చింది. ముస్లింలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలపై చివరకు ఎంతోకొంత ఎన్నికల సంఘమే స్పందించవలసి వచ్చింది.అయితే ఎన్నికల సంఘం పాత్రపై ఇప్పటికీ నీలినీడలు అలుముకునే వున్నాయి. 17సి ఫారం ప్రకారం పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్లు వేసిన వారి సంఖ్యను బహిర్గతం చేయడానికి ఎన్నికల సంఘం నిరాకరి స్తున్నది. బీజేపీ, ఆరెస్సెస్ నేతల మతతత్వ ప్రచారాన్ని ఇతర పార్టీల నేతల ప్రతి విమర్శనూ ఒకేగాట కడుతున్నది. ఏపీలో మాచర్ల ఘటనలతో సహా అనేక సందర్భాల్లో ఎన్నికల సంఘ వ్యవ హార శైలి విమర్శల పాలైంది. తెలంగాణ క్యాబినెట్ సమావేశానికి కూడా అనుమతిం చకుండా వివక్షకు పాల్పడింది. రేపటి ఫలితాల తర్వాత ఈ అంశాలన్నీ కూడా ముందుకు రానున్నాయి.

ఏపీ, తెలంగాణల దృశ్యం

ఆంధ్రప్రదేశ్‌లోనైతే కేవలం టీడీపీ, వైసీపీ మధ్య యుద్ధంగా ఇంకా చెప్పాలంటే జగన్, చంద్రబాబు పోరాటంగా మొదలైంది, చంద్రబాబు అరెస్టు కేసుల తర్వాత ఇది పరాకాష్టకు చేరింది. ఈ మధ్యలో బీజేపీ ఎన్డీయేలో భాగమైన జనసేన పవన్ కళ్యాణ్ అసలు కేంద్రం వూసేలేకుండా కేవలం వైసీపీ వ్యతిరేక ఓట్లు చీలనివ్వకపోవడం అంటూ కొత్తపాట తెచ్చారు. బీజేపీతో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నా విడిగా లౌకిక పార్టీలూ ఆయనతో కలవచ్చనే పల్లవీ కొన్ని వైపుల నుంచి వినిపించింది. జగన్‌తో ఆస్తి వివాదాల కారణంగా దూరమైన షర్మిల తెలంగాణ నుంచి ఏపీ కాంగ్రెస్‌లో ప్రవేశించిన తర్వాత ఇది మరీ కుటుంబ సమస్యగానూ మారింది. ఈ పరిస్థితుల్లోనే సీపీఐ(ఎం) ఇతర లౌకిక ప్రజాస్వామిక వాద శక్తులతో కలసి బీజేపీతో జట్టుకట్టిన టీడీపీ కూటమి, నిరంతరం బలపర్చే వైసీపీ రెంటినీ ఓడించాలనే విధానంతో ఇండియా ఆవిర్భావానికి కృషి చేసింది. ఈ క్రమంలోనే వామపక్షాలూ కాంగ్రెస్ కలసి పోరాడాయి. రాజధానికి సహాయం ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పోలవరం, విభజన హామీలు లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి అంశాలు తెరమీదకు వచ్చాయి. ఆఖరుకు షర్మిల కూడా చంద్రబాబు, జగన్ బీజేపీకి లోబడిపోయారనే అంశం నొక్కి చెప్పారు. పోలింగ్ చివరి దశలో మల్లికార్జున ఖర్గే, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వంటివారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో ఎన్నికల పోరాట స్వరూపం మారింది.ముస్లిం రిజర్వేషన్లపై మోడీ బీజేపీ వైఖరిని చంద్రబాబు జగన్ ఉభయులూ తోసిపుచ్చవలసి వచ్చింది. విశాఖ ఉక్కుపై ఎన్నికల ఫోకస్ మారిందని 'హిందూ' వంటి పత్రిక రాసింది. ఇదంతా మొదట బయిలుదేరిన నాటి తీరుకు భిన్నమైన సన్నివేశమే.

తెలంగాణలోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకే పరిమితమైన రాజకీయ రణం కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం) కలసికట్టుగా కదలడంతో కొత్తరూపు తీసుకున్నది. ఇండియా వేదిక బీజేపీ, బీఆర్ఎస్ త్రిముఖ సమరంగా మారింది. ఇదే ఇప్పుడు శాసనమండలి ఉప ఎన్నికలలోనూ కొనసాగు తున్నది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్గాలు సీపీఐ(ఎం)కు ఆత్మగౌరవం లేదని తిట్టిపోస్తే గట్టి సమాధానం ఇవ్వవలసి వచ్చింది. గతంలో ఎవరు ఏం మాట్లాడారనే మీమాంస కన్నా లౌకిక శక్తులు దేశవ్యాపితంగా చేస్తున్న పోరాటంలో తెలంగాణ భాగం కావడం, బీజేపీని ఓడించడం కీలకమనే వాస్తవికత సీపీఐ(ఎం) ప్రదర్శించింది. ముఖ్యమంత్రి రేవంత్‌ది బీజేపీపై మెతకవైఖరి అంటూ వచ్చిన అభిప్రా యాలను స్వయంగా తోసిపుచ్చవలసి వచ్చింది. విచిత్రమే మంటే లోక్‌సభ ఎన్నికల తర్వాత రాజకీయ పునఃసమీకరణ జరుగుతుందని రేవంత్ బీజేపీలోకి వెళతారని, బీఆర్ఎస్ ఇప్పటికీ ప్రచారం చేస్తున్నది. మరోవైపున బీఆర్ఎస్‌లోంచి 25 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వెళతారని కిషన్‌రెడ్డి అంటున్నారు.రాజకీయ దుమారం ఏ స్థాయిలో వుందో తెలుసుకోవడానికి ఈ ఉదాహరణలు చాలు. ఏపీలో ఎవరు అధికారంలోకి వస్తారనే దానిపైనా తెలంగాణలో ఎవరికి ఎక్కువ స్థానాలు వస్తాయనే దానిపైనా ఇప్పటికీ రెండు రకాల అంచనాలు హోరాహోరీగా సాగుతూనే వున్నాయి. ఆ జోస్యాలతో నిమిత్తం లేకుండా ఒక రాజకీయ వాతావరణం తేవడమే వామపక్షాలు సాధించిన సత్ఫలితం.ఇందుకు ఇతర లౌకిక ప్రజానుకూల శక్తుల సహకారం లభించింది.

మీడియా ద్వంద్వత్వం

తెలుగు మీడియాలో మొదటి నుంచి పాలకవర్గాల ప్రాబల్యం ఏదో ఒక వర్గాన్ని భుజాన మోయడం పరిపాటి. వర్తమాన ఘట్టంలో మరీ బాహాటంగా రెండుగా చీలిన మీడియా వైసీపీ, టీడీపీ, బీజేపీ మధ్య మొగ్గును చూపించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మీడియాపై ఆగ్రహానుగ్రహాలు బాహాటంగానే ప్రదర్శించారు. ప్రాంతీయ అధికారం తప్ప జాతీయ రాజకీయాల స్పృహ కూడా వదలిపెట్టి వారినో వీరినో గెలిపించడమే లక్ష్యంగా పాక్షిక చిత్రం ఇచ్చింది. వచ్చిన చూపిన అంశాల విశ్వసనీయతనే ప్రశ్నార్థకం చేసింది, రాజ్యాంగ అంశాలను కూడా స్థానిక రాజకీయ కోణంతోనే చిత్రిస్తూ ప్రజల దృష్టిని దారిమళ్లిం చింది. ఉద్యమాలనూ, బహిరంగ విషయాలను కూడా తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఇటో అటో ఇస్తూ వచ్చింది. కులమత ధోరణులు, అసభ్య దూషణలు అమానుష దాడులూ నిత్యకృత్యంగా మారాయి. అక్రమధనం వికటాట్టహాసం చేసింది.

సైద్ధాంతిక నిబద్ధత లేకుండా బీజేపీని మోసిన జనసేన అధినేత సినిమా అభిమానాల నేపథ్యం కూడా చర్చను పక్కదోవ పట్టించడానికి కారణ మైంది. విస్తారంగా పెరిగిన సోషల్ మీడియా సోపానంగా అప్రధాన వివాదాలే సమయాన్ని బుర్రలనూ ఆక్రమించి వాతావరణాన్ని కలుషితం చేశాయి, ఇంతటి పరిస్థితిలోనూ ఎంతోకొంత చర్చ పట్టాలపై వుందంటే దానికి కారణం 'ప్రజాశక్తి', 'నవతెలంగాణ' వంటి నిబద్ధ పత్రికలు, ప్రజాపక్ష ఉద్యమాలు, శక్తులూ నిర్వహించిన విస్పష్టమైన పాత్ర మాత్రమే.ఎన్నికల పోరాటంలోనూ పోలింగ్ అనంతరం కూడా ఉద్రిక్తతలు పెంచడానికి రకరకాల పాచికలు వేసినా ప్రజలు ప్రశాంతత కాపాడు కున్నారు. రేపు తుదితీర్పు వెలువడేవరకూ ఇదే చైతన్యంతో అప్రమత్తతతో వుండాలని కోరుకుందాం. పాలకవర్గాలు రాజకీయ ప్రయోజనాల కోసం పదవులకోసం రగిలించిన వివాదాలు, సృష్టించిన వైరాలూ, వివాద విద్వేషాలు పక్కకునెట్టి ప్రజల ఐక్యత కాపాడు కోవాలి. పదేండ్లు పూర్తి చేసుకుంటున్న విభజిత రాష్ట్రాల సమస్యల పరిష్కరించు కుంటూ మత రాజకీయాలను ఆమడదూరం కొట్టడానికి మరింత జాగ్రత్తగా వ్యవహరిం చాల్సిన అవసరముంది. అందుకు విరుద్ధమైన సంకుచిత పోకడలూ, అల్పిష్టి తగాదాలను దూరం కొడదాం. ప్రజాశక్తుల ఐక్యతే ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షణ. ■

గతంలో ఎవరు ఏం మాట్లాడారనే మీమాంస కన్నా లౌకిక శక్తులు దేశవ్యాపితంగా చేస్తున్న పోరాటంలో తెలంగాణ భాగం కావడం, బీజేపీని ఓడించడం కీలకమనే వాస్తవికత సీపీఐ(ఎం) ప్రదర్శించింది. ముఖ్యమంత్రి రేవంత్‌ది బీజేపీపై మెతకవైఖరి అంటూ వచ్చిన అభిప్రాయాలను స్వయంగా తోసిపుచ్చవలసి వచ్చింది. విచిత్రమేమంటే లోక్‌సభ ఎన్నికల తర్వాత రాజకీయ పునఃసమీకరణ జరుగుతుందని రేవంత్ బీజేపీలోకి వెళతారని, బీఆర్ఎస్ ఇప్పటికీ ప్రచారం చేస్తున్నది.మరోవైపున బీఆర్ఎస్‌లోంచి 25 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వెళతారని కిషన్‌రెడ్డి అంటున్నారు.రాజకీయ దుమారం ఏ స్థాయిలో వుందో తెలుసుకోవడానికి ఈ ఉదాహరణలు చాలు.

ఈ ఎన్నికల పోరాటం వివాదాల నుంచి విధానాల వైపు, వ్యక్తుల నుంచి వ్యవస్థల వైపు మరలించడం సైద్ధాంతిక శక్తుల తొలి విజయం. ఓసారి వెనక్కు తిరిగి చూస్తే విశ్వగురు మోడీ విజయయాత్రలా మార్చి అబ్‌కా పార్ చారౌసౌ పార్(ఈ సారి నాలుగు వందల సీట్లు)అంటూ హంగామాగా మొదలైంది.ఇప్పుడెవరూ ఆ మాట అనడం లేదు. అసలు ఆ మాటే మాది కాదు ప్రజల నుంచి తీసుకున్నామని మోడీనే చెప్పుకోవలసిన స్థితి. బీజేపీకి బాగా అనుకూలంగా మాట్లాడే సంస్థలూ వ్యక్తులూ కూడా ఏదో విధంగా మెజార్టీ వస్తుందని సరిపెడుతున్నారు. ప్రశాంత్ కిశోర్,సి ఓటర్ యోగేంద్ర దేశ్‌ముఖ్, యోగీంద్ర యాదవ్ ఇలా రకరకాల వ్యక్తులను తీసుకుంటే 300కు దగ్గరగా సరిపెడుతున్నారు.

సంపాదకీయం

ఆదినుంచీ, ఆధిపత్యము ఉన్న చోటల్లా దేవుడి భ్రమాత్మక ఆటలూ, అవినీతి అక్రమ బాటలూ రెండు కలిసే రంగస్థలాన్ని రక్తి కట్టించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. బొమ్మలనే వాస్తవ పాత్రలుగా భావించాము నాడు తోలుబొమ్మ లాటలో. ఇప్పుడు మనుషులనూ, నాయకులనే బొమ్మలు చేసి ఆడిస్తున్నారు వ్యాపారులూ ఈ ఎన్నికల ఆటలో. ప్రజలు తమ భవిష్యత్తును గురించి తీవ్రంగా ఆలోచించి ఎన్నికల రణరంగంలో పాల్గొనాల్సిన సందర్భంగా ముఖ్యంగా యువత దృష్టిని, రెండు గంటల్లో అయిపోయే టీ ట్వంటీ వైపునకు తిప్పేందుకు బహుశ ఉపయో గించారేమో అనిపిస్తోంది.పట్టణాల్లోని యువత కూడా అసలు జీవితపు ఆటలో జరుగుతున్న అన్యాయాలేమిటో తెలుసుకోవటం తథ్యం.

ఆట

ఆట మనందరికీ తెలిసిన పదం. గేమ్, ఖేల్, ఆట ఇలా ఏ భాషలో పలికినా అందరికీ ఇట్టే అర్థమయిపోతుంది. ఆట అంటేనే ఒక పోటీ వుంటుంది. గెలుపు, ఓటములూ ఉంటాయి. ఆదిమంలో ఆహారం కోసం వేట కూడా ఆటలా సాగేది. ఆహారం దొరికితే మనిషి గెలిచినట్లు. దొరక్కపోతే తప్పించుకుపోయిన జంతువు గెలిచి బతికి బట్టకట్టినట్లు. ఆట అంటేనే కొంత సరదా ఉంటుంది. కొందరికి ఆట కూడా ప్రాణ సంకటంగా ఉండేది. బానిస సమాజాల్లో బానిసల మధ్య యుద్ధం పెట్టి ఎవరో ఒకరు చస్తే ఆనందించే ఆటను వినోదంగా చూసేవారు బానిస యజమానులు. ఇదంతా అప్పుడెప్పుడో జరిగినవి. ఇప్పటి ఆటలు వేరు. ఆధ్యాత్మికులు మాత్రం ఈ ప్రపంచం, ఇందులోని మనుషులు ప్రవర్తనలు అన్నీ దేవుడు ఆడించే ఆటలో భాగమే అంటారు. అంతవరకు ఫర్వాలేదు. ఇప్పుడు దేవుడి ఆటనూ మనుషులే ఆడటం చూస్తున్నాము. అకస్మాత్తుగా నాయకుడు దేవుడైపోయి ఆట నాదే అంటాడు. ఆడించే వాడినీ నేనేనని కొత్త అవతారమెత్తిన ఆట భలే హాస్యరసాన్ని పండిస్తుంది. రామాయణంలో పిడకల వేటలాగా, ఆటలో అరటిపండు లాగా ఇలా కొన్ని జరిగిపోతుంటాయి. వీటిని గురించి పెద్దగా చెప్పుకుని చరిత్ర జ్ఞానం పొందేదేమీ ఉండదు.



మన దేశానికే చెందిన ఆట కబడ్డీ. చిన్నతనంలో ఆటలో ఉండే మజా ఏమిటో ఆ ఆటలో కనపడేది. హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, షటిల్, బ్యాట్‌మెంటన్ ఇలా ఎన్నయినా చెప్పుకోవచ్చు. ఏ ఆటయినా ఆడటంలోనే ఒక స్ఫూర్తి, చైతన్యం ఉండేవి. శారీరక, మానసిక ఆనందానికి దోహదపడేవి. గెలుపోటములను సమంగా చూడగలిగే మానసిక స్థిరత్వాన్ని, బలాన్ని ఆటలు ఇస్తాయి. ఇప్పుడీ ఆటల ప్రాధాన్యతా లేదు, ఆ స్ఫూర్తీ కనిపించడం లేదు. ఇప్పుడు ఆటంటే క్రికెట్టే! క్రికెట్‌కున్న క్రేజీ మరే ఆటకూ లేకుండా పోయింది. పోనీ ఆట ఆటలాగానే ఉందా అంటే అదీ లేదు. ఆటకూ, ఆట వెనకాలకూ ఆర్థిక కోణాలే ఎక్కువైపోయాయి. ఆటల ప్రాధాన్యత ఆటగాడికి పలికిన డబ్బుతో గుర్తించబడుతోంది. టెస్టులు,వన్‌డేలు అయిపోయాక ఇరువై ఓవర్లకొచ్చిన, టీట్వంటీలు కోట్ల రూపాయల్ని కుమ్మరిస్తున్నాయి. ఇప్పుడు ఆటకు దేశము, దేశీయుడు అనే గీతలనూ చెరిపేసింది. అన్ని దేశాల ఆటగాళ్లూ, తాము వేలంలో అమ్ముడుపోయిన వారి పక్షాన ఆడతారు. మన దేశంలో ఇప్పుడీ పొట్టి టీ ట్వంటీ క్రికెట్ పెద్ద వ్యాపారాంశంగా మారింది. ఇక బెట్టింగ్ ప్రహసనమూ ఇందులో భాగమే. ఆటలో వ్యాపారం మొదలయ్యాక, ఆట స్ఫూర్తిపోయి లాభాలు నష్టాలు మాత్రమే మిగులుతాయి. అప్పుడు లాభం కోసం వ్యాపారం ఎంత అవినీతిమయమవుతుందో ఆటలు కూడా అవినీతిలో కూరుకుపోతాయి. ఇంతటి వ్యాపారాత్మకమైన ఆటను ఓ నెలన్నర పాటు సమయాన్ని వెచ్చించి ఉద్రిక్త భరితంగా వీక్షించిన లక్షలాది ప్రజల ఆక్రమణ కొనసాగింది. ఉల్లాస భరితమవ్వాల్సిన ఆటలు ఉద్రిక్తమవ్వడమే నేటి వైచిత్రి.

ఈ ఆటతో పాటే మన దేశంలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల ఆటకూ మొదలేశారు. ఇది నూట నలభై కోట్ల మంది ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన ప్రక్రియ. ఈ ఆటనూ వ్యాపారమయం చేసేశారు. ఓటుకు నోటు భేరాలూ పెట్టారు. ఓటర్లనూ గంపగుత్తగా కొనుగోళ్లు చేయటమూ జరుగుతున్నవి. అంతేకాదు ఓటరు మనోభావాలను ఉద్వేగభరితం, ఉద్రిక్త భరితం చేసే ఆటా ఆడుతున్నారు. ఆనాడు శకుని మామ పాచికల ఆటలో రాజ్యాలనే సంపాదించి పెట్టాడు కౌరవులకు. అలాంటి జూదమే ప్రజాస్వామ్య మనబడే దేశాలలోనూ ఏదో విధంగా నడుస్తూ వున్నది. ఆదినుంచీ, ఆధిపత్యము ఉన్న చోటల్లా దేవుడి భ్రమాత్మక ఆటలూ, అవినీతి అక్రమ బాటలూ రెండు కలిసే రంగస్థలాన్ని రక్తి కట్టించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. బొమ్మలనే వాస్తవ పాత్రలుగా భావించాము నాడు తోలుబొమ్మ లాటలో. ఇప్పుడు మనుషులనూ, నాయకులనే బొమ్మలు చేసి ఆడిస్తున్నారు వ్యాపారులూ ఈ ఎన్నికల ఆటలో. ప్రజలు తమ భవిష్యత్తును గురించి తీవ్రంగా ఆలోచించి ఎన్నికల రణరంగంలో పాల్గొనాల్సిన సందర్భంగా ముఖ్యంగా యువత దృష్టిని, రెండు గంటల్లో అయిపోయే టీ ట్వంటీ వైపునకు తిప్పేందుకు బహుశ ఉపయో గించారేమో అనిపిస్తోంది. పట్టణాల్లోని యువత కూడా అసలు జీవితపు ఆటలో జరుగుతున్న అన్యాయాలేమిటో తెలుసుకోవటం తథ్యం.

ఎందుకంటే, దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఐఐటీ చదివిన విద్యార్థులకు కూడా ఉద్యోగాలు దొరకటం కష్టంగా మారిందంటే, నిరుద్యోగం ఎంత తీవ్రంగా పెరుగుతోందో అర్థమవుతుంది. ఈ ఏడాదిలోనే ఐఐటి చదివిన విద్యార్థుల్లో 38 శాతం మందికి ఉద్యోగాలు దొరకనేలేదు. పీజీ చేసిన వారిలో 61 శాతం మందికి ఉద్యోగాలు లేవు. ఇంతకు మునుపెన్నడూ లేని విధంగా ఉద్యోగాల లేమి నేడు ఎదురౌతున్నది. గ్రామీణ ప్రజలయితే వాళ్లకెదురౌతున్న ఇబ్బందులకు సమాధానాన్ని ఈ ఎన్నికల ఆటలో చూపెట్టబోతున్నారన్నది విధితమవుతూనే ఉంది. ఏ ఆటలైనా తమ ఇష్టమైనట్లు ఆడటం ఎక్కువకాలం సాగదు. అవినీతికర, భ్రమాత్మక ఆటలు ముగిసిపోకా మానదు.

వాళ్లు శాసిస్తారు.. ఈయన పాటిస్తారు...

లోక్‌సభ ఎన్నికల పుణ్యమానీ... ఇటీవల రాజకీయ నాయకుల అసలు రంగు బయటపడుతోంది. వాళ్లలో ఇన్నాళ్లూ దాగున్న 'అపరిచితులు...' మాటల రూపంలో బయటికొస్తున్నారు. వీరిలో అందరికంటే అగ్రగణ్యుడిగా ఉన్నది మన ప్రధాని మోడీ గారు. వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చేసిన వ్యాఖ్యలు దేశంలో పెద్ద దుమారాన్నే లేపాయి. అంతర్జాతీయ మీడియా సైతం ముక్కున వేలేసుకునేలా ఉన్నాయి పీఎం గారి కామెంట్లు. ఎలక్షన్ ప్రక్రియ చివరి అంకంలో ఉన్న ప్రస్తుత తరుణంలో ఆయన తాజాగా తనను తాను పొగుడుకున్న తీరును చూసిన జనాలు..'వార్నాయనో...' అనుకుంటున్న పరిస్థితి. '2047 వరకూ క్రియాశీల రాజకీయాల్లో ఉంటా. దేవుడు ఆ మేరకు నన్ను ఆజ్ఞాపించాడు. అప్పటి వరకూ ఆయన నన్ను వెనక్కి పిలవబోడు...' అంటూ తనను తాను దేవుడి బిడ్డగా చెప్పుకున్నారు మన మోడీజీ. ఇది చూసిన మేధావులు, నెటిజన్లు 'ఔరా...' అనుకుంటున్నారు. ఇప్పటిదాకా ఏ దేశానికి వెళితే ఆ దేశ దుస్తులు, ఏ రాష్ట్రానికి వెళితే ఆ రాష్ట్రంలో వాడే టోపీలు ధరించిన ప్రధాని... ఇప్పుడు ఏకంగా తాను దేవుడు పంపితే భూమ్మీదకు వచ్చిన వాడినని చెప్పుకోవటం కొసమెరుపు. ఈ సందర్భంగా అరుణాచలం సినిమాలో సూపర్ స్టార్ రజనీకాంత్ చెప్పిన డైలాగ్ గుర్తొస్తోంది. 'దేవుడు శాసిస్తాడు.. అరుణాచలం పాటిస్తాడు...' అంటూ రజనీ చెప్పిన డైలాగ్‌కు అప్పట్లో థియేటర్లు దద్దరిల్లాయి. ఇప్పుడు అదే కోవలో డైలాగులు కొట్టేందుకు ప్రధాని ప్రయత్నిస్తు న్నారు. గమ్మత్తేమిటంటే... దేవుడు శాసించటం, మోడీ పాటించటం అటుంచితే, 'పెట్టుబడిదారులు, ముఖ్యం గా అంబానీ, ఆదానీలు ఆర్థికాంశాలు, ధరల పెరుగుదలలో కేంద్రాన్ని శాసించటం, మోడీ వాటిని అమలు చేసి చూపటం గత పదేండ్లుగా నడుస్తున్న స్టోరీనే...' అవునా..? కాదా...?

-బి.వి.యన్.పద్మరాజు

స్లాట్ దొరికితే.. దంచుడే..

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏ చిన్న ప్రెస్‌మీట్ పెట్టాలన్నా అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఉండాల్సిందే. సదరు నేత మాట్లాడే అంశానికి ఆమోదముద్ర పడాల్సిందే. ఈ మధ్య బీజేపీఎల్పీ నేతగా ఎన్నికైన తర్వాత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దూకుడు పెంచాడు. ఆర్ ట్యాక్స్..యూ ట్యాక్స్ అంటూ రోజుకో వార్త పట్టుకొచ్చి మీడియాలో చర్చ నీయాంశమవుతున్నాడు. ఓ రోజు ప్రెస్‌మీట్ అనంతరం 'ఏం సార్ వరుసగా బాంబులు పేలుస్తున్నారు. నెక్ట్స్ మీడియా సమావేశం ఎప్పుడు' అని రిపోర్టర్లు సరదగా అడగ్గా.. మహేశ్వర్‌రెడ్డి కూడా అంతే జోష్‌లో 'ఈడ స్లాట్ దొరకడమే కష్టంగ ఉందయ్యా. లేకుంటే రోజుకో ప్రెస్‌మీట్ పెడతా. రోజుకో బాంబు పేలుస్తా' అని నవ్వుకుంట అనేశాడు. ఆ తర్వాత ఏమైందో ఏమోగానీ రెండురోజుల కోసారి మహేశ్వర్‌రెడ్డి ప్రెస్మీట్ పెట్టేస్తున్నాడు. మీడియా సమావేశంలో 'ఏందన్నా వరుసగా ప్రెస్‌మీట్లు పెడుతు న్నాడు' అని తోటి రిపోర్టర్‌ను అడిగితే 'ఏముంది తమ్మీ రోజూ స్లాటు దొరుకుతున్నట్టుంది. అవకాశమొచ్చిందని దంచేస్తున్నడు' అంటూ నవ్వులు పూయించాడు.

- అచ్చిన ప్రశాంత్

జగ్గన్నకు దిమ్మదిరిగే ప్రశ్న

కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడం, ముక్కు సూటిగా ఉండటం...రాజకీయ నాయకుల్లో చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటివారు ఎప్పుడూ వార్తల్లో ఉంటారు. అప్పుడప్పుడు వారి మాటలే వారికి యమపాశాలౌ తుంటాయి. కాంగ్రెస్‌లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వి.హనుమంతరావు, జగ్గారెడ్డి ఆ కోవలోకి వస్తారు. ఉన్నది ఉన్నట్టు మాట్లాడిన తీరుకు చీవాట్లు తిన్న సందర్భాలెన్నో. తాజాగా గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి (జగ్గన్న) మాట్లాడిన తీరు కూడా ఆయనకే రివర్స్ అయింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైస్‌మిల్లర్ల నుంచి 'యూ ట్యాక్స్' (ఉత్తమ్‌ట్యాక్స్) వసూలు చేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి విమర్శలు గుప్పించారు. దీనిపై పార్టీ తరుపున కౌంటర్ ఇవ్వాలంటూ జగ్గన్నను ఉత్తమ్ పురమాయించారు. ఈ విషయా న్ని ఆయనే స్వయంగా చెప్పారు. ఉత్తమ్ ఆదేశాను సారం ఏలేటిపై జగ్గన్న ఫైర్ అయ్యారు. ఇంతలోనే విలేకర్ల నుంచి జగ్గన్నకు దిమ్మదిరిగే ప్రశ్న దూసు కొచ్చింది. ఆయన కూడా ఉహించి ఉండరు. గతంలో ఏలేటి 'ట్రిబుల్ ఆర్' ట్యాక్స్, (రేవంత్ రెడ్డి,రాహుల్ ట్యాక్స్) బీ ట్యాక్స్ (భట్టి ట్యాక్స్) అంటూ ఆరోపించిన విషయం తెలిసిందే. అప్పుడు మాట్లాడని జగ్గన్న యూ ట్యాక్స్ అనగానే ఆగమేఘాల మీద స్పందిస్తున్నారు.. ఎందుకు? దానికి అనుబంధంగా ట్రిబుల్ ట్యాక్స్, బీ ట్యాక్స్ నిజమే కానీ యూ ట్యాక్స్ నిజం కాదని చెప్పదలిచారా? రేవంత్‌రెడ్డి, భట్టి విక్ర మార్క ట్యాక్స్ వసూలు చేస్తున్నారు కానీ ఉత్తమ్ అలాంటోడు కాదూ.. ఆయనో తెల్లకాగితం వంటి వారనడంలో మీ ఉద్దేశమేంటని మరో బుల్లెట్ లాంటి ప్రశ్న దిగింది. ఎన్ని ప్రశ్నలు వేసినా ఆయన మాత్రం ఉత్తమ్‌ను వెనకేసుకొచ్చారు. 'ఆయన సైన్యంలో పని చేశారు. ఏలేటి మహేశ్వర రెడ్డి వెంటనే ఉత్తమ్‌కు క్షమాపణ చెప్పాలంటూ' ముగిం చారు. ఎప్పుడు విలేకర్ల సమావేశం నిర్వహి ంచినా అరగంట, గంట మాట్లాడే జగ్గన్న... ఇంత తొందరగా ముగిస్తారను కోలేదు అని మరో విలేకరి ప్రశ్న.. సమాధానం చెప్పకుండానే నవ్వుతూ ప్రెస్ కాన్ఫరెన్స్ గది నుంచి వెళ్లిపోయారు. దీని వెనకే ముందోనని విలేకర్లు గుసగుసలాడు కున్నారు.

- గుడిగ రఘు

నమో X మోన



నజర్

పెద్దాయన నిద్రలో నుంచి దిగ్గున లేచాడు. అర్ధరాత్రి దాటిపోయి చాలాసేపయ్యింది. దాదాపు తెల్లవారు ఝాము అవుతోంది. పెద్దాయన నిద్రాభంగం కావటానికి ఏదో శబ్దం కావటమే కారణం! మళ్లీ పెద్దాయన నిద్రకు ఉపక్రమించాడు! కాని లాభం లేదు! ఈ సారి ఎవరో పగలబడి నవ్వుతున్నట్లై నిద్రభంగం అయ్యింది! పెద్దాయనకు పట్టరాని ఆగ్రహం కలిగింది "ఇదేమిటి? నేను నిద్రించేదే నాలుగు గంటలు! అందులో కూడా నిద్రాభంగమా?"

"ఎవరది?" అన్నాడు పెద్దయన కోపంగా.

ఎవరూ మాట్లాడలేదు. కాని మరోసారి పగలబడి నవ్వారు!

"ఎవరు అంటే పలకరేం? పైగా నవ్వుతారేం?" అన్నాడు పెద్దాయన మరింత కోపంగా.

"నేను ఎవరో కాసేపటికి నీకే అర్థమైతుంది కాని, ఇంత పెద్ద హోదాలో ఉండి ఇన్ని అబద్దాలు. క్రమం తప్పకుండా పలుకవచ్చునా?" అన్నది ఆ స్వరం.

పెద్దాయనకు ఆస్వరం పరిచయమున్నట్లే అనిపించింది. పోల్చుకునే ప్రయత్నం చేశాడు.

"అబద్దాలా నేనా?" అన్నాడు.

"నీవే అబద్దాలు అడుతున్నావు! అది కూడా అంతులేని అబద్ధాలు అడుతూనే ఉన్నావు!" అన్నది ఆ స్వరం.

"అబద్దాలు అంటే ఏమిటో నాకు తెలియదు! నిజాలు మాత్రమే మాట్లాడుతాను! సరిగ్గా చెప్పాలంటే నేను మాట్లాడింది మాత్రమే నిజం!" అన్నాడు పెద్దాయన.

మరోసారి పెద్దగా నవ్వింది ఆ స్వరం.

"ఎందుకు మళ్లీ మళ్లీ నవుతావు?" అన్నాడు పెద్దాయన మరింత కోపంగా.

"నవ్వకేం చేయను? శిశుపాలుడి తప్పులు లెక్కించినట్లు, నీ అబద్దాలు కూడా లెక్కిస్తే ఈపాటికి లక్ష దాటిపోయేవి!" అన్నది ఆ స్వరం.

"నేను ఒక్క అబద్ధం ఆడినా నన్ను ఉరి తీయొచ్చు!" అన్నాడు పెద్దాయన గంభీరంగా.

"అదే నిజమైతే ఉరి మీద ఇప్పటికే రెండుసార్లు అబద్ధమాడావు కదా!" అన్నది ఆ స్వరం.

"ఉరి తీయమని రెండుసార్లు అబద్ధమాడానా చెప్పు!" అన్నాడు పెద్దాయన.

"పెద్దనోట్లు రద్దు చేసినపుడు, నల్లధనం వందరోజుల్లో బయటకు వస్తుందని, అట్లా బయటకు రాకపోతే ఉరితీయమని అన్నావు. కాని ఈ రోజు వరకు ఒక్క రూపాయి నల్లధనం బయటకు రాలేదు. పైగా ఆదానీ, అంబానీల వద్ద నల్లధనం ఉందని అన్నావు! పుల్వామాలో 39 మంది సైనికుల దుర్మరణానికి నీవు హెలికాప్టర్ ఇవ్వక పోవడమే కారణమని నీ మాజీ విశ్వాస పాత్రుడే ప్రకటించాడు! పెద్దనోట్ల రద్దులో ఒకసారి, పుల్వామా సైనికుల మరణంలో రెండవ సారి తప్పులు చేసినా నిన్ను ఎవరూ ఉరి తీయలేదు కదా!" అన్నది ఆ స్వరం.

పెద్దాయన మౌనంగా వింటున్నాడు.

"ప్రతిపక్ష పార్టీలకు ఓట్లేస్తే బుల్డోజర్లతో గుళ్లు కూల్చేస్తారు! అని అన్నావు కదా! గుళ్లు, గోపురాలు కూల్చటం, అందుకు బుల్డోజర్లు వాడే సంప్రదాయం మీ పార్టీదే! అపుడెపుడో కరసేన పేరిట రాములవారి గుడో లేక బాబ్రీ మసీదో, ఎవరో ఒకరి ప్రార్థనా మందిరాన్ని కూలగొట్టిన చరిత్ర మీదే! అప్పట్లో బుల్డోజర్లు లేవు అందుకే కరసేవ చేశారు. మారిన టెక్నాలజీని అందిపుచ్చుకున్న మీ పార్టీ వారణాసిలో వందల సంఖ్యలో, చిన్న గుళ్లు, అదే సంఖ్యలో ఇండ్లూ కూల్చే శారు! ఆ రోజు నీవేమీ మాట్లాడలేదు! ఇప్పుడు మాత్రం ప్రతిపక్షం మీదికి నెడుతున్నావు!" అన్నది ఆ స్వరం.

పెద్దాయన పక్కనున్న గ్లాసులో నీళ్లు తాగాడు.

"ముస్లిం పెట్టిన భోజనం తిన్నాను! వారిని నేనెప్పుడు విమర్శించలేదు! విభజన రాజకీయాలతో ప్రతిపక్షాలు కుట్ర చేస్తాయని అన్నావు కదూ! చొరబాటుదారులు, అధిక సంతానం గలవాళ్లు, అన్నది కూడా నీవే కదా! మరి ఏది నిజం! అకస్మాత్తుగా ముస్లింలు పెట్టిన బిర్యాని గుర్తుకు వచ్చిందేం? నీవు చెప్పినట్లే హిందూ, ముస్లింలు కలిసి పీర్ల పండుగ జరుపుకునే పరిస్థితి ఇప్పుడుందా? ఆ సోదర భావాన్ని ధ్వంసం చేసిందీ, విద్వేషాన్ని రెచ్చగొట్టిందీ నీవు, నీ పార్టే కదా! ఇప్పుడు ఇంతపెద్ద అబద్దాన్ని సిగ్గు, ఎగ్గూ లేకుండా మాట్లాడవచ్చునా?" నిలదీసింది ఆ స్వరం.

"అన్నిటికన్నా పెద్ద అబద్ధం ఏం చెప్పావో తెలుసా?" అడిగింది ఆ స్వరం.

ఏమిటన్నట్లు చూశాడు పెద్దాయన.

"నీవు అందరిలా పుట్టలేదని, ఆ దేవుడే నిన్ను పంపిం చాడని, అన్ని విషయాల్లో నీకు ఆ దేవుడే ప్రేరణ కల్గిస్తున్నాడని. ఒక ఇంటర్వ్యూలో ప్రవచించావు!" అడిగింది ఆ స్వరం.

అవునన్నట్లు తలూపాడు. అపుడు పెద్దాయన మొఖం వెలిగిపోతున్నది.

"నీవు అందరి మనుషుల్లా జీవ ప్రక్రియ ద్వారా జన్మించలేదని మీ అమ్మగారు బతికి ఉన్నపుడు ప్రవచించలేదేమి! నీవు చెప్పింది ఎంత ఆ మాతృమూర్తి నిర్ధారించేది! అయితే ఒకందుకు ఇప్పుడు చెప్పడం వల్ల మీ తల్లిగారు బతికి పోయారు! నీ, నిర్ణయాలన్నింటికీ దైవమే ప్రేరణ కల్గిస్తున్నదా? కరోనా వచ్చినపుడు రాత్రికి రాత్రే లాక్‌డౌన్ ప్రకటించి వలస కార్మికుల ఉసుర్లు తీసినదానికి దైవమా ప్రేరణ? రాత్రికి, రాత్రి నోట్లరద్దు ప్రకటించి ఏటీఎం లైన్లలో అమాయక మధ్య తరగతి ప్రాణాలు పోతుంటే పట్టించుకోని నీ రాతి గుండెకు ప్రేరణ కలిగించలేదని దేవుని మీదికి నెడుతున్నావా? దేశంలోని సహజవనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ, అంబానీలకు ధారపోయమని నీకు దేవుడే చెప్పాడా? అడిగింది ఆ స్వరం.

పెద్దాయనకు ఏం మాట్లాడాలో తెలియటం లేదు!

"ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని అధికారంలోకి వచ్చిన నీకు ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టమని దేవుడు చెప్పాడా? నీ గుళ్లోనే అభం శుభం తెలియని చిన్నారిపై అత్యాచారం చేస్తుంటే అడ్డుకోమని, నీకు దేవుడు ఎందుకు చెప్పలేదు? అబద్ధాలు ఆడేది నీవు! తప్పులు చేసేది నీవు! దేవుడి పేరు మీద విధ్వంసం సృష్టించేది నీవు! దేవుడి పేరు మీద ఓట్లడిగి, అధికారంలోకి వచ్చేది కూడా నీవే! వీటన్నింటికి ఆ దేవుడిని వాడుకుంటున్నావు? ఇంతకన్నా దైవద్రోహం ఉందా!" నిలదీసింది ఆ స్వరం.

పెద్దాయనకు గుర్తుకు వచ్చింది ఆ స్వరం తనదే! ఏదో చెప్పబోయాడు!

నీవు నోరు తెరవకు! తెరిస్తే మరో అబద్ధం ఆడతావు! నేను మోన! అంటే నీ అంతరాత్మను!" అన్నది ఆ స్వరం.

- ఉషాకిరణ్

హార్డ్‌వేర్ పార్క్ కంపెనీలో అగ్ని ప్రమాదం

- తుక్కుగూడలో ఘటన



నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలోని హార్డ్‌వేర్ పార్క్ కంపెనీలో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో అందులో పనిచేస్తున్న సిబ్బంది బయటకు పరిగెత్తారు. పహాడీ షరీఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హార్డ్‌వేర్ పార్క్ కంపెనీలోని ఒకటో నెంబర్ యూనిట్‌లో అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భారీగా మంటలు వ్యాపించడంతో దట్టమైన పొగ అలుముకుంది. దాంతో కంపెనీలో పనిచేస్తున్న సిబ్బంది ఉక్కిరిబిక్కిరయ్యారు. వెంటనే సెక్యూరిటీ గార్డ్స్ అప్రమత్తమై సిబ్బందిని బయటకు పంపించారు. పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఐదు ఫైర్ ఇంజిన్లు మంటలను అదుపు చేశాయి. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు. భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. పెద్దమొత్తంలో పొగ అలుముకోవడంతో చుట్టుపక్కల ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

ఆదివాసీ యువకుడికి ప్రాణం పోసిన నిమ్స్

- గుండెకు ఆనుకొని దిగిన బాణం
- శస్త్ర చికిత్స ద్వారా తొలగించిన కార్డియోథొరాసిక్ వైద్యుల బృందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ యువకుడికి నిమ్స్ వైద్యులు ప్రాణం పోశారు. అతనికి ప్రమాదవశాత్తూ గుండెకు దగ్గరగా బాణం దిగడంతో నరకయాతన అనుభవించాడు. విషమ పరిస్థితిలో ఎంజీఎం నుంచి నిమ్స్‌కు రాగా వైద్యులు ఆపరేషన్ చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ ప్రాంతంలోని గొత్తికోయ తెగకు చెందిన 17 ఏండ్ల సోదినంద వారం రోజుల కిందట అడవికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు శరీరంలోకి బాణం దిగింది. కుటుంబీకులు వెంటనే భద్రాచలం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో శుక్రవారం సాయంత్రం నిమ్స్ ఎమర్జెన్సీకి తీసుకొచ్చారు. ఇక్కడ కార్డియోథొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు, డాక్టర్ గోపాల్ పరీక్షించారు. గుండె, ఊపిరితిత్తుల మధ్య బాణం చొచ్చుకుపోయినట్టు గుర్తించారు. నందను కాపాడేందుకు అమరేశ్వరరావు, గోపాల్ వైద్య బృందం ఆపరేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. నాలుగు గంటలపాటు శ్రమించి శరీరం నుంచి బాణాన్ని పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం ఆ యువకుడు ఆరోగ్యంగా ఉన్నాడని, ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు వెల్లడించారు.

స్పెషల్ కేసుగా పరిగణించి ఉచితంగా చికిత్స

పక్క రాష్ట్రానికి చెందిన యువకుడి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. స్పెషల్ కేసుగా పరిగణించి ఉచితంగా శస్త్ర చికిత్స చేసినట్టు నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప చెప్పారు. ఎంతో శ్రమించి వైద్యం అందించిన కార్డియోథొరాసిక్ వైద్య బృందాన్ని డైరెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

సెల్‌ఫోన్ పేలి రైతు మృతి



నవతెలంగాణ-మక్తల్

వర్షంతో పాటు పెద్ద శబ్దాలతో ఉరుములు.. మెరుపులు రాగా అదే సమయంలో పిడుగు పడటంతో సెల్‌ఫోన్ పేలి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండల పరిధిలోని మంథన్‌గౌడ్ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. చాకలి కురుమయ్య(40) వ్యవసాయ పనుల నిమిత్తం పొలం దగ్గర ఉన్నాడు. ఆ సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం, పిడుగు పడింది. దాంతో కుర్మయ్య వద్ద ఉన్న సెల్‌ఫోన్ పేలి ఆయన ఛాతిపై తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. చీకటి పడినా కుర్మయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రి సమయంలో పొలానికెళ్లగా.. విగతజీవిగా కనిపించాడు. రైతుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మక్తల్ పోలీసులు, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు మృత్యువాత



గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని కుర్తిరావుల చెరువు గ్రామంలో, నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో పిడుగుపాటుకు రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి.

రైతులందరికీ బోనస్‌ను వర్తింపజేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రజలు, రైతులు, ఇండ్లు లేని పేదలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగయ్య, జూలకంటి రంగారెడ్డి, ఎస్ వీరయ్య కలిసి వినతిపత్రం సమర్పించారు. రైతులకు బోనస్ చెల్లిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ సన్న బియ్యానికి మాత్రమే చెల్లిస్తామనటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అత్యధికమంది రైతులు దొడ్డు బియ్యం పండిస్తున్న విషయం ముఖ్యమంత్రికి తెలిసిందే. అందువల్ల బోనస్ చెల్లింపు రైతులందరికీ వర్తింపజేయాలని కోరారు. వర్షాకాలం రాబోతున్నది. రైతులకు పెట్టుబడి సహాయం సకాలంలో అందించాలనీ, ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన మేరకు రైతుభరోసా జూన్ మొదటి వారంలోనే రైతుల అకౌంట్‌లో పడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

బీఆర్ఎస్ పాలనలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు, సాగుభూమి తదితర సమస్యలపై ఆందోళనల సందర్భంగా పెట్టిన కేసులు ఉపసంహరించుకుంటామంటూ సీఎం వాగ్దానం చేశారు. ఎన్నికల సందడి అయిపోయిన నేపథ్యంలో వెంటనే ఆ కేసులను ఉపసంహరించాలని కోరారు. ఇండ్ల స్థలాలకు పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటూ ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న కాలంలోనే ఇండ్లు లేని పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారనీ, రెండున్నరేండ్లుగా వారు అక్కడే నివాసముంటున్నారనీ, వారికి పట్టాలిస్తామంటూ గతంలో సీపీఐ(ఎం) ప్రతినిధివర్గానికి సీఎం వాగ్దానం చేసిన మేరకు పేదలు గుడిసెలు వేసుకున్నచోట, ప్రతి కుటుంబానికి 120 గజాల స్థలం కేటాయించి పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

నకిలీ విత్తు.. అన్నదాత చిత్తు..!



- గుట్టుచప్పుడు కాకుండా మార్కెట్‌లోకి..
- వివిధ రకాల కంపెనీల పేర్లతో విక్రయాలు
- ధర తక్కువ.. అధిక దిగుబడి పేరుతో అంటగడుతున్న వైనం
- అలస్యంగా మేల్కొన్న అధికార యంత్రాంగం
- టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు.. విస్తృత తనిఖీలు

అనేక ఆశలతో ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమైన అన్నదాతలకు ఆదిలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి. బలమైన విత్తనాలు నాటితేనే పంట దిగుబడి వస్తుంది. కానీ నకిలీ విత్తనాలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రైతులకు ఆశచూపి టార్గెట్‌గా చేసుకుని అక్రమార్కులు ఆటలు మొదలెట్టారు. ప్రతి సీజన్‌లో వివిధ ప్రాంతాల నుంచి ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు సరఫరా చేస్తూ అన్నదాతలకు అంటగడుతున్నారు. వివిధ రకాల కంపెనీల పేర్లతో స్థానిక డీలర్ల ద్వారా మారుమూల ప్రాంతాల రైతులకు విక్రయిస్తున్నారు. తక్కువ ధరతోపాటు అధిక దిగుబడి వస్తుందని నమ్మబలుకుతూ విక్రయిస్తున్నారు. ఏవి మంచివో, ఏవి చెడ్డవో తెలియక నమ్మకం మీద రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తూ మోసపోతున్నారు. కొందరు ఏండ్లుగా ఈ దందాను కొనసాగిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రతి ఏటా ఈ తంతంగం కొనసాగుతూనే ఉంది. అరెస్టులు, జరిమానాలు జరుగుతున్నా అవి ఏమాత్రం నకిలీ విత్తనాల అమ్మకాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నాయి. కఠిన చర్యలు (పీడీ యాక్ట్) తీసుకుంటామని గత ప్రభుత్వం హెచ్చరికలు చేసినా.. ఎవరి మీదా తీసుకోలేదు. తూతూమంత్రంగానే ముగిశాయి. దీంతో నకిలీ విత్తనాల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తాజాగా ఆదిలాబాద్ పట్టణంలోని ఓ గోదాంలో రూ.19.39లక్షల విలువ చేసే నకిలీ విత్తన ప్యాకెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా ఎక్కడో ఒక చోట పోలీసులు పట్టుకుంటూనే ఉన్నారు. ఇటీవల రంగారెడ్డి జిల్లాలో రూ.36లక్షల విలువైన నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. నకిలీ విత్తనాల అమ్మకాలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలనూ రాయితీపై అందజేయబోతున్నట్టు తెలియజేశారు. జీలుగు, జనుము, పిల్లిపెసర, పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు మోసపోవద్దని సూచించారు. గతేడాదికంటే ఈసారి అదనంగా 15.75 లక్షల క్వింటాళ్ల పత్తి విత్తనాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో అధికార యంత్రాంగం విస్తృత తనిఖీలకు రంగం సిద్ధం చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అమాయక రైతులే లక్ష్యంగా నకిలీ విత్తన ముఠాలు చెలరేగిపోతున్నాయి. వర్షాలు రాగానే.. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి విత్తుతున్న రైతులకు ఆదిలోనే అవరోధాలు ఏర్పడుతున్నాయి. విత్తనం మొలకెత్తకపోవడం.. ఒకవేళ మొలకెత్తినా కాత, పూత లేకపోవడం.. దిగుబడి రాకపోవడంతో పంట చేతికొచ్చే సమయంలో తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఇలాంటి వాటిని ముందస్తుగానే నివారించాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో రైతులు భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. మూడేండ్ల నుంచి వరుసగా తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వందల క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తన సంచులను స్వాధీనం చేసుకున్న సందర్భాలున్నాయి. కానీ ఈ ఏడాది మాత్రం మరో ఇరవై రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండగా.. వారం రోజుల కిందటే టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే నకిలీ విత్తనాలు చేరాల్సిన చోటకు చేరిపోయాయనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క వివిధ దుకాణాల్లో నకిలీ విత్తనాలు పట్టుకుంటున్న అధికార యంత్రాంగం కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు తప్పితే వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే వాదన వినిపిస్తోంది.

కంపెనీల పేరిట విక్రయాలు..!

ప్రతి ఏటా ఈ నకిలీ విత్తనాలు బయటపడుతున్నాయి. ఆంధ్రా, మహారాష్ట్ర, పంజాబ్, గుజరాత్ తదితర రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు నకిలీ విత్తనాల సంచులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చేరవేస్తున్నారు. జిల్లాకు చెందిన కొందరు విత్తన డీలర్లను మచ్చిక చేసుకొని దందాను కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. వేసవి ప్రారంభంలోనే జిల్లాలోకి తీసుకొచ్చి రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచుతున్నారు. పెద్ద మొత్తంలో సంచుల్లో తీసుకొచ్చి వాటిని వివిధ కంపెనీల పేరిట ఆకర్షణీయమైన బ్రాండెడ్ ప్యాకెట్లలో నింపి ఆయా దుకాణాల ద్వారా విక్రయాలు జరుపుతున్నారు. ఈ నకిలీ విత్తనాల వ్యవహారం కొందరు అధికారులకు తెలిసినా లోపాయికారి ఒప్పందం మేరకు మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా మీనాక్షి, పుడమి కంపెనీల పేరిట లూజ్ విత్తనాలను పెద్ద మొత్తంలో తీసుకొచ్చి ఆకర్షణీయమైన ప్యాకెట్లలో నింపి విక్రయాలు చేపడుతున్నారు. ఈ కంపెనీలకు చెందిన విత్తనాలు ఇక్కడ విక్రయించేందుకు అనుమతి లేకపోయినా స్థానిక కొందరు డీలర్ల సాయంతో విక్రయాలు చేపడుతున్నట్టు తెలిసింది. మూడేండ్ల కిందట జిల్లా కేంద్రంలోని ఓ విత్తన దుకాణంలో తనిఖీలు చేపట్టిన అధికారులకు నకిలీ విత్తనాలు లభించినా కేవలం కేసు నమోదుతోనే సరిపెట్టినట్టు తెలుస్తోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. లేదంటే ఎక్కడో చోట నకిలీ విత్తనాలు బయటపడితేనే తనిఖీలు చేపడుతున్నారనే వాదన వినిపిస్తోంది. స్వతహాగా తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి.

తనిఖీలు చేపడుతున్నాం

ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నకిలీ విత్తనాలు గుర్తించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశాం. తాజాగా రూ.29.35లక్షల విలువైన విత్తనాలు పట్టుకున్నాం. వివిధ ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు పర్యటిస్తూ తనిఖీలు చేపడుతున్నాయి. నకిలీ విత్తనాలను పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటాం.

పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఆదిలాబాద్

హామీలన్నింటినీ అమలు చేస్తాం

- బీఆర్ఎస్ హయాంలో అన్ని వ్యవస్థలూ ధ్వంసం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి.. : వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణ- నల్లగొండ టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసే దిశగా పాలన సాగిస్తుందని, ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ శనివారం నల్లగొండ పట్టణంలోని ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గ పట్టభద్రుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో జరిగే ప్రతి ఎన్నికలలోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో అన్ని వ్యవస్థలనూ విధ్వంసం చేసిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల న్నింటినీ నిలబెట్టుకుంటామని చెప్పారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ అమలు చేసి తీరుతామని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గ్రాడ్యుయేట్ ఓటర్లంతా తీన్మార్ మల్లన్నకు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్న పోటీలో ఉండడంతో బీఆర్ఎస్ నాయకులు జంకుతున్నారన్నారు. ఆయనను ఓడించేందుకు అనేక కుట్రలు పన్నుతూ దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే రాజకీయాల్లో సమూల మార్పులు తీసుకొస్తానని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే తాను గెలిచినా ఆ తర్వాత రాజీనామా చేస్తానని ప్రకటించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లంతా ఆలోచించి ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓట్లతో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఓటర్లంతా మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్ గౌడ్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్దే సుమన్, మార్కెట్ కమిటీ చైర్మెన్ జూకూరి రమేష్, సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఎండీ సలీం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాషం, మైనార్టీ నాయకులు బషీర్, ఎంఏ ఖాన్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజ్ బ్రిడ్జిపై రాకపోకలు నిషేధం

- సరిహద్దు గ్రామాల ప్రజల ఆందోళన
- ద్విచక్రవాహనం వెళ్లేలా గేట్ ఓపెన్



నవతెలంగాణ-మహదేవపూర్

భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజ్ వద్ద బ్రిడ్జి కుంగుబాటుతో తెలంగాణ-మహారాష్ట్ర రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుంత ఏర్పడటంతో శనివారం అధికారులు గేట్లను మూసేసి రాకపోకలను నిషేధించారు. దాంతో సరిహద్దు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగడంతో ద్విచక్ర వాహనాలు వెళ్లేలా గేటు తెరిచి ఉంచారు. అంతర్రాష్ట్ర వంతెన కావడంతో ఇరు రాష్ట్రాల ప్రజలు అత్యవసరాల నిమిత్తం పనులకు ఈ బ్రిడ్జి ద్వారా రాకపోకలు సాగిస్తారు. గతంలో గోదావరిలో పడవల ద్వారా ప్రయాణించేవారు. బ్రిడ్జి నిర్మాణం తర్వాత చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ప్రయాణం సులభతరంగా మారింది. మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ప్రజలు తెలంగాణలోని పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య వ్యాపారాలు నిర్వహించడానికి, అత్యవసర పరిస్థితులు, ఆస్పత్రులకు వెళ్లేందుకు ఈ వంతెన ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి అవతలి ప్రాంతంలో తెలుగువారే కావడంతో తెలంగాణ ప్రజలు ఇచ్చిపుచ్చుకునే ఆనవాయితీ ఉంది. కొద్దిరోజుల కిందట మేడిగడ్డ బ్యారేజీ బ్రిడ్జి కుంగిపోవడంతో మరమ్మతులో భాగంగా శుక్రవారం గేట్లు ఎత్తే సమయంలో భారీ శబ్దంతోపాటు గుంత ఏర్పడింది. అధికారులు శనివారం ఉదయం నుంచి రాకపోకలను నిషేధించారు. దీంతో చుట్టూ గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. వెంటనే స్పందించిన నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ కాంట్రాక్టర్లు, అధికారులు ద్విచక్ర వాహనం వెళ్లేలా గేటు తెరిచి ఉంచారు.

వేధింపుల వల్లే.. 104 డ్రైవర్ మృతి

- డీఎంహెచ్‌ఓను సస్పెండ్ చేయాలి
- జగిత్యాల ప్రభుత్వాస్పత్రి ఎదుట ఉద్యోగుల ఆందోళన

నవతెలంగాణ- జగిత్యాల

జగిత్యాల డీఎంహెచ్‌ఓ పుప్పాల శ్రీధర్ వేధింపుల కారణంగానే 104 డ్రైవర్ రాజ్‌కుమార్ మృతి చెందాడని ఆరోపిస్తూ 104 ఉద్యోగులు శనివారం జగిత్యాల జిల్లా ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. 104 అంబులెన్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న కొప్పుల రాజ్‌కుమార్ మరణానికి కారణమైన డీఎంహెచ్‌వోను వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్‌కుమార్‌తో డ్రైవర్ పని కాకుండా.. టాయిలెట్లు క్లీన్ చేయిస్తూ అతడిని తీవ్ర ఒత్తిడికి గురి చేశారన్నారు. మూడ్రోజుల నుంచి కంటిన్యూగా డ్యూటీ చేయించడంతోనే అస్వస్థతతో గుండెపోటుకు గురయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం జగిత్యాలలోనే కాకుండా ఇతర జిల్లాల్లోనూ 104 సిబ్బంది వివక్షకు గురవుతున్నారన్నారు. దళిత ఉద్యోగి చావుకు కారణమైన జగిత్యాల డీఎంహెచ్‌ఓ పుప్పాల శ్రీధర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ విషయమై జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్‌ను వివరణ కోరగా, తాను ఎటువంటి పనులూ చేయించుకోలేదని, తనపై ఆరోపణలు నిజం కాదని అన్నారు. తనపై విచారణ చేయించొచ్చని చెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కాయితి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి మెట్టు దాస్, ప్రధాన కార్యదర్శి ఎనుగంటి రాజేష్, 104 అంబులెన్స్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు యాష్వాల ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు నక్క శేఖర్ పాల్గొన్నారు.





బీడీ కార్మికులకు కొత్త వేతన ఒప్పందం

- వెయ్యి బీడీలకు రూ.4.25 పెంపు
- ప్యాకర్లకు రూ.3650, నెలసరి ఉద్యోగులకు రూ.1700 పెరుగుదల : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీడీ పరిశ్రమల యాజమాన్యం, యూనియన్ నాయకుల మధ్య కార్మికుల వేతన ఒప్పందం కుదిరిందనీ, వెయ్యి బీడీలకు రూ.4.25 పెంచుతూ నిర్ణయం జరిగిందని తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు గోపాల స్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ తెలిపారు. నెలసరి ఉద్యోగులకు రూ.1700, ప్యాకర్లకు రూ.3,650 పెరిగిందని చెప్పారు. వేతనాల పెంపు జరిగిందనీ ఊరుకోవద్దనీ, అమలు కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో బీడీ పరిశ్రమల యాజమాన్యాలు, యూనియన్ల నాయకుల మధ్య చర్చలు జరిగాయి. యజమానుల అసోసియేషన్ నుంచి అధ్యక్షులు హితేంద్ర ఉపాధ్యాయ, కార్యదర్శి ధర్మేంద్ర గాంధీ, రష్మీకాంత్ పటేల్, సీఐటీయూ, ఇతర యూనియన్ల నాయకులు పాల్గొన్నారు. అందులో కొత్త వేతన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా రమ, గోపాలస్వామి మాట్లాడుతూ.. పెరిగిన వేతనాలను మే నెల నుంచే అమలు చేయాలని కోరారు.

మత రాజకీయాలే బీజేపీ ఎజెండా

- మోడీ ఓ అబద్ధాలకోరు
- ఇండియా బ్లాక్‌దే అధికారం : ఫరీద్‌కోట్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హిందూ, ముస్లింల పేరిట మత రాజకీయాలు చేయడం తప్ప బీజేపీకి మరో ఎజెండా లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. శనివారం పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మొగ, ధరంకోట్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పలు సమావేశాల్లో పాల్గొన్న ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా స్వామ్యాన్ని, దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఇండియా బ్లాక్ ఏర్పడిందని పునరుద్ఘాటించారు. దానికి అనుగుణంగానే బ్లాక్ పోరాడుతున్నదని చెప్పారు. దేశంలో కొద్దిమంది తన మిత్రులను ధనికులుగా మార్చారని ఆరోపించారు. దేశంలో మరోవైపు లక్షల మంది పేదలుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ అబద్ధాల కోరు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మరోసారి గెలిస్తే రాజ్యాంగం అంతమవుతుందని హెచ్చరించారు. ఆ తర్వాత దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు కనిపించబోవని తెలిపారు. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, రిజర్వేషన్లు రద్దు వంటి పరిణామాలు వేగంగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ ముందంజలో ఉందని చెప్పారు. గత పదేండ్లలో మోడీ ఎన్నో హామీలిచ్చారనీ, కానీ వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. అందుకే ఈసారి ప్రజలు ఇండియా బ్లాక్‌కు మద్దతుగా నిలిచారని తెలిపారు. మోడీ పెద్ద అబద్ధాలకోరు అని ఎద్దేవా చేశారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలిస్తాననీ, ప్రతి ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు జమ చేస్తాననీ, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానంటూ ఆయన ఎన్నో అబద్ధాలు చెప్పారని గుర్తు చేశారు. అందులో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు.





నిరుద్యోగులకూ 'చెయ్యి'చ్చిన కాంగ్రెస్..

- 'జాబ్ క్యాలెండర్' పెద్ద మోసం...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మా అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించండి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజలను అనేక రకాలుగా మోసం చేస్తున్న కాంగ్రెస్... ఆఖరికి నిరుద్యోగులకూ 'చెయ్యి'చ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ చెబుతున్న జాబ్ క్యాలెండర్ అనే మాటే పెద్ద అబద్ధమని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ సీనియర్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ తదితరులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాదికి 19 వేల ఉద్యోగాలనిచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతకు ముందు 2004 నుంచి 2014 వరకూ ఆనాటి కాంగ్రెస్ సర్కారు ఏడాదికి కేవలం వెయ్యి ఉద్యోగాలను మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఈ రకంగా చూస్తే ఉద్యోగాల కల్పనలో తమ ప్రభుత్వానికి, కాంగ్రెస్ సర్కార్‌కు నక్కకూ, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని విమర్శించారు. సంబంధిత గణాంకాలను ఆయన మీడియాకు విడుదల చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డీఎస్సీని వేస్తామంటూ నమ్మబలికిన సీఎం రేవంత్... ఇప్పుడు ఆ ఊసే ఎత్తటం లేదన్నారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తామన్నారు.. ఇప్పటి వరకూ ఎన్ని కొలువులు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్ సర్కారు గ్రూప్-1 కింద 500 పోస్టులతో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తే, దాన్ని రద్దు చేసిన రేవంత్ ప్రభుత్వం, కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా కేవలం 60 పోస్టులను అదనంగా చేర్చి కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేసిందని విమర్శించారు. ఐదు వేల పోస్టులతో తమ ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేశారని వాపోయారు. గత ఆర్నెళ్ల కాంగ్రెస్ హయాంలో ఒక్కటంటే ఒక్క నోటిఫికేషన్‌నూ జారీ చేయలేదని విమర్శించారు.

నిరుద్యోగ భృతిపై కూడా మాట తప్పిన ఘనత కాంగ్రెస్ నేతలకే దక్కుతుందని దుయ్యబట్టారు. ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలకు ఒక్క రూపాయి కూడా ఫీజు తీసుకోబోమంటూ చెప్పిన సీఎం రేవంత్... రూ.400గా ఉన్న టెట్ ఫీజును ఏకంగా రూ.2 వేలకు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ దివాళాకోరు విధానాల వల్ల తెలంగాణకు వచ్చిన కంపెనీలు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 12 వేల ఎకరాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఫార్మాసిటీని తమ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే దాన్ని రద్దు చేసేందుకు సీఎం కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ మాఫియాను పెంచి పోషించేందుకు పావులు కదుపుతున్నారని విమర్శించారు. ఈ రకంగా నిరుద్యోగుల ఆశలపై నీళ్లు జల్లుతున్న కాంగ్రెస్‌ను నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఉన్నత విద్యావంతుడు, సమస్యలపట్ల అవగాహన ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మోడీ బస చేశారు... బిల్లు కట్టండి



ప్రభుత్వానికి మైసూర్ హోటల్ నోటీసు

మైసూర్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తమ హోటల్‌లో బస చేసి.. 80 లక్షల రూపాయల బిల్లు చెల్లించనందుకుగాను చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు మైసూర్ రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్ యాజమాన్యం ప్రభుత్వాన్ని హెచ్చరించింది. వివరాల్లోకి వెళితే.. ప్రధాని మోడీ గతేడాది ఏప్రిల్ నెలలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ), పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ (ఎంఓఈఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 50 సంవత్సరాల 'ప్రాజెక్టు టైగర్' ఈవెంట్ మైసూర్‌లో జరిగింది. ఈ కార్యక్రమం ఏప్రిల్ 9 నుంచి 11 వరకు జరిగింది. ఈ ఈవెంట్‌ని ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్రమోడీ మైసూర్‌కి వచ్చి అక్కడ ఉన్న రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో బస చేశారు. దీనికి గానూ రూ. 80.6 లక్షల రూపాయల బిల్ అయింది. కాని, ఈ బిల్లుని హోటల్‌కి చెల్లించలేదు. ఈ బకాయిలను చెల్లించాలని కర్నాటక ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (వైల్డ్ లైఫ్).. న్యూఢిల్లీ ఎన్‌టీసీఏ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కి లేఖ రాసింది. అయితే ఈ హోటల్ బకాయిలను కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని ఎన్‌టీసీఏ తిరిగి ఈ ఏడాది ఫిబ్రవరి 12న లేఖ రాసింది. బకాయిలు చెల్లించకపోవడంతో మరోసారి మార్చి 22 2024వ తేదీన ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ (పీసీసీఎఫ్) ప్రిన్సిపల్ సుభాష్ కె. మల్ఖేడే ఎన్‌టీసీఏ లేఖ రాశారు. సుభాష్ రాసిన లేఖకు సంబంధించి ఎన్‌టిసిఎ సమాధానం ఇవ్వలేదు. ఆ తర్వాత 'ఏడాది గడిచినా హోటల్‌లో బస చేసినందుకు బిల్లు చెల్లించలేదు' అని మే 21న ఈ హోటల్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చీఫ్ బసవరాజుకు లేఖ రాశారు. బకాయిలు సరైన సమయంలో చెల్లించనందుగాను 12.09 లక్షలు, మొత్తం డబ్బు సంవత్సరానికి 18 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని బ్లూ ప్లాజా యాజమాన్యం లేఖలో పేర్కొంది. ఈ బకాయిల్ని ఈ ఏడాది జూన్ 1వ తేదీ లోపు చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోటల్ యాజమాన్యం హెచ్చరించింది. అయితే ఈ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిందన్న కారణంతో.. రాష్ట్ర ప్రభుత్వం ఈ హోటల్‌కి చెల్లించే బకాయిల్ని చెల్లించేందుకు తిరస్కరించిందని ఫారెస్ట్ చీఫ్ బసవరాజు అన్నారు.

తీన్మార్ మల్లన్నకు వికలాంగుల జేఏసీ మద్దతు

- ముత్తినేని వీరయ్య

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నకు వికలాంగుల జేఏసీ, పట్టభద్రుల వికలాంగులు సంఘాలు, పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈమేరకు శనివారం కాంగ్రెస్ వికలాంగుల రాష్ట్ర చైర్మెన్ ముత్తినేని వీరయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే కోర్టు ఉద్యోగాలలో వికలాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్లు, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే విధంగా సదరం స్లాట్, పారా క్రీడల్లో ప్రత్యేక వింగ్‌తోపాటు మరెన్నో చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. వికలాంగులకు ఆర్థికంగా సహకారం అందించడం కోసం కార్పొరేషన్ చైర్మెన్‌ను నియమించిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే వికలాంగ సోదరి రజనికి ఉద్యోగం ఇచ్చిన విషయాన్ని ముత్తినేని గుర్తు చేశారు.

ఎట్టకేలకు పోలింగ్ డేటా బహిర్గతం

- నిర్దిష్ట గణాంకాలతో విడుదల చేసిన ఈసీ
- లోక్‌సభ నియోజకవర్గాల వారీగా వివరాలు
- తొలి 5 విడతల్లో పోలింగ్ డేటా విడుదల



న్యూఢిల్లీ : సార్వత్రిక సమరానికి సంబంధించి ప్రత్యేకించి నియోజకవర్గాల వారీగా పోలింగ్ నమోదు గురించి అనేక సందేహాలతో కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శనివారం నాడు కీలక సమాచారాన్ని బహిర్గతం చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఇప్పటివరకు జరిగిన ఐదు విడతల పోలింగ్‌లో ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలైన నిర్దిష్ట ఓట్ల సంఖ్యను ఇసి ప్రకటించింది. ఐదు దశలకు సంబంధించి తుది పోలింగ్ శాతాలను గతంలోనే ఈసీ విడుదల చేసింది. కానీ, ప్రతి నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్ల వాస్తవ సంఖ్యను నిర్దిష్టంగా వెల్లడించలేదు. అత్యంత ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నందున పోలింగ్ కేంద్రాల వారీగా ఓటు హక్కు వినియోగించుకున్న నిర్దిష్ట ఓటర్ల సంఖ్య శాతాలను ఎన్నికల సంఘం ఎందుకు ప్రకటించడం లేదంటూ వివిధ స్వచ్ఛంద సంస్థలు సందేహాలను వ్యక్తం చేశాయి. దీనిపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వంటి సంస్థలు కోర్టును కూడా ఆశ్రయించాయి. అయితే పోలింగ్ కేంద్రాల వారీగా డేటా విడుదల చేయడం గందరగోళానికి దారితీస్తుందంటూ ఇసి వాదించింది. ఈ దశలో తాము కూడా డేటా విడుదల చేయాల్సిందిగా ఈసీని ఆదేశించలేమని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం డేటా విడుదల చేయడం గమనార్హం.

తొలి విడతలో ఓటేసిన 11 కోట్ల మంది

ఏప్రిల్ 19న జరిగిన మొదటి విడత పోలింగ్‌లో 21 రాష్ట్రాల్లో 11కోట్ల (11,00,52,103) మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ఈసీ పేర్కొంది. ఏప్రిల్ 26న 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జరిగిన రెండో విడతలో 10.58 కోట్ల (10,58,30,572) మంది ఓటు వేశారు. 11.32 కోట్ల (11,32,34,676) మంది పౌరులు మే 7న 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో విడత జరిగిన పోలింగ్‌లో ఓటు వేశారు. నాల్గవ దశలో, 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 12.24 కోట్ల (12,24,69,319) మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ఈసీ పేర్కొంది. ఇక ఐదవ విడతపోలింగ్‌లో భాగంగా 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 5.57 కోట్ల (5,57,10,618) మంది ఓటు వేశారు.

ప్రజాస్వామ్య ప్రయోజనాలను నెరవేర్చేందుకు దోహదం : ఈసీ

పోలింగ్ కేంద్రాల వారీగా డేటా అప్‌లోడ్‌కు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తమకు మరింత స్థైర్యాన్ని ఇచ్చిందని లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఓట్ల డేటా విడుదల సందర్భంగా ఎన్నికల సంఘం వ్యాఖ్యానించింది. చెక్కుచెదరని కృతనిశ్చయంతో ఎన్నికల ప్రజాస్వామ్య ప్రయోజనాలను నెరవేర్చేందుకు ఇది, కమిషన్‌కు మరింత ఉన్నతమైన బాధ్యతను అప్పగించిందని ఈసీ తెలిపింది. ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసేందుకు కొందరు తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారని ఆరోపించింది. పోలైన ఓట్ల డేటాను ఎవరూ మార్చలేరని స్పష్టం చేసింది. ఓటింగ్ రోజునే ఫారమ్ 17సి ద్వారా అందరి అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లకు ఈ సమాచారం అందచేస్తామని తెలిపింది. ఓటర్ టర్నవుట్ డేటా అభ్యర్థులకు ఎప్పుడూ అందుబాటులోనే వుంటుందని,అలాగే పౌరులకు ఓటర్ టర్నవుట్ యాప్ ద్వారా నిరంతరం అందుబాటులో వుంటుందని తెలిపింది.

వివాదం ఎందుకు తెరపైకి వచ్చిందంటే..

సాధారణంగా నూటికి నూరు శాతం పోలింగ్ నమోదు కావడం గొప్ప విశేషం. పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో నూరు శాతానికి మించి ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం గణాంకాల్లోనే పేర్కొనడంతో సర్వత్రా విస్మయానికి గురి చేసింది. ఈ నేపథ్యంలోనే అసలు పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల నిర్దిష్ట సంఖ్యను ఎందుకు తెలియజేయడం లేదంటూ ఎన్నికల సంఘాన్ని పలు స్వచ్ఛంద సంస్థలు నిలదీస్తూ వస్తున్నాయి. ఈసీ నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఈ మేరకు ఈసీని ఆదేశించాలని కోరుతూ స్వచ్ఛంద సంస్థ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే సార్వత్రిక ఎన్నికలు కీలక దశలో ఉన్నందున పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల వివరాలను బహిరంగంగా విడుదల చేయాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయలేమని సుప్రీంకోర్టు శుక్రవారం ఏడీఆర్ పిటిషన్‌ను తిరస్కరించింది. ఆ వెంటనే శనివారం ఈసీ ఈ డేటాను విడుదల చేయడం విశేషం.

ఫారమ్ 17సి ప్రాముఖ్యత

పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన సమాచారానికి సంబంధించి ఫారమ్ 17సి చాలా కీలకమైనది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)లో నమోదైన ఓట్ల రికార్డును ఫారమ్ 17సిలోనే పొందుపరుస్తారు. ఈ డేటాను తక్షణమే విడుదల చేయాలనే ఏడీఆర్ సుప్రీంను కోరింది. మొదటి రెండు దశల పోలింగ్ ముగిసిన తర్వాత ఈ డేటాను ప్రచురించడంలో జాప్యం జరగడంతో ఈ పిటిషన్ దాఖలైంది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి దశ పోలింగ్ తర్వాత అన్ని పోలింగ్ కేంద్రాల ఫారమ్ 17సి స్కాన్ చేసిన స్పష్టమైన కాపీలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా ఓటర్ టర్నవుట్‌కు సంబంధించిన విశ్వసనీయమైన రికార్డులను ఇసి వెల్లడించాలని ఏడీఆర్ విన్నవించింది. అయితే, ఫారమ్17సిని ప్రచురించేందుకు ఎలాంటి చట్టబద్ధమైన ఆదేశాలు లేవని బుధవారం ఈసీ కోర్టుకు తెలియచేసింది. ఆ పత్రాన్ని కేవలం అభ్యర్థులకు లేదా వారి ఏజెంట్లకు మాత్రమే ఇవ్వగలమని తెలిపింది. కాగా ఓటర్ టర్నవుట్ డేటా విడుదల చేసే ప్రక్రియపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన తీర్పుపై తాము మరింత బలోపేతమైనట్లు ఎన్నికల కమిషన్ శనివారం అభిప్రాయపడింది.

విద్యార్థులు పిట్టల్లా రాలిపోవడానికి కేటీఆరే కారణం

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులు పిట్టల్లా రాలిపోవడానికి మాజీ మంత్రి కేటీఆరే కారణమని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మనసులు బాధపెట్టేలా వ్యంగ్యంగా, హేళనగా కేటీఆర్ మాట్లాడలేదా? అని ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో విద్యార్థి నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ విద్యార్థులకు సమస్యలు సృష్టించిందే కేటీఆర్ అని ఆరోపించారు. తాను విద్యారంగం నుంచి వచ్చాననీ, వారి సమస్యలన్నీ తనకు తెలుసునని చెప్పారు. పదేండ్ల కాలంలో విద్యార్థులను ఇబ్బంది పెట్టేలా కేటీఆర్ అనేక నిర్ణయాలను తీసుకున్నారని విమర్శించారు. వారి మధ్య కొట్లాట పెట్టి తమాషా చూశారని ఎద్దేవా చేశారు. జీవో నెంబర్ 46పై పచ్చి అబద్ధాలు చెబుతున్నారని తెలిపారు. తాము జీవో 46, 317పై ప్రభుత్వం నిపుణులతో చర్చించి క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎన్నికల కోడ్ అయిపోగానే ఆయన బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ విద్యార్థులకు, నిరుద్యోగులకు ఏం చేశాయో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి రాగానే టీఎస్పీఎస్సీ ప్రక్షాళన చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియగానే జాబ్ క్యాలెండర్ తప్పకుండా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు.

'పట్టం'.. ప్రతిష్టాత్మకం

- రేపు వరంగల్- ఖమ్మం- నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్
- ముగిసిన ఎన్నికల ప్రచారం
- 2021తో పోల్చితే తగ్గిన ఓటర్లు, అభ్యర్థులు
- అయినా సవాల్‌గా తీసుకున్న పార్టీలు
- సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- 4,63,839 మంది ఓటర్లు.. 52 మంది అభ్యర్థులు.. 605 పీఎస్‌లు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్- ఖమ్మం- నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఉప ఎన్నిక ప్రచార పర్వం ముగిసింది. ఈ ఎన్నికలను అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. 2021 మార్చిలో ఈ స్థానానికి ఎన్నిక నిర్వహించగా బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వరరెడ్డి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు. ఆయన 2023 నవంబర్ అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా నెగ్గడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటికే మూడేండ్ల పదవీకాలం పూర్తవగా.. మరో మూడేండ్ల కాలం ఉంది. నాడు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండగా, నేడు కాంగ్రెస్ పాలన ఉంది. ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం 12 జిల్లాల్లో 34 అసెంబ్లీ స్థానాల్లో విస్తరించి ఉండటం, పైగా ఇదీ విద్యావంతులు.. అది కూడా పట్టభద్రులు మాత్రమే వేసే ఓటు కావడంతో ఈ ఎన్నిక ఫలితం ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల ఈ ఉప ఎన్నికను అధికారపార్టీతో పాటు విపక్షాలూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.13వ తేదీన పార్లమెంట్ ఎన్నికలు ముగిసిందే తడవు మంత్రులు, మాజీ మంత్రులు, కేంద్ర మంత్రులు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలోకి దిగారు. హోరాహోరీ ప్రచారం నిర్వహించారు. మొత్తమ్మీద ఈ ఎన్నిక ప్రచారం శనివారంతో ముగిసింది. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది.

ఇండియా కూటమి అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న..

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐతో కూడిన ఇండియా కూటమి అభ్యర్థిగా చింతపండు నవీన్‌కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్నను బరిలో దింపాయి. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మల్లన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ముచ్చెమటలు పట్టించారు. మల్లన్నతో పాటు అప్పటి తెలంగాణ జనసమితి అభ్యర్థి ప్రొఫెసర్ కోదండరామ్ గట్టి పోటీనిచ్చారు. ఫలితంగా నాలుగు రోజుల పాటు కౌంటింగ్ సాగింది. చివరకు ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో రాజేశ్వర్‌రెడ్డి బయటపడ్డారు. గత ఎన్నికల్లో వామపక్షాల అభ్యర్థిగా జయసారథిరెడ్డి పోటీ చేశారు. నాడు కాంగ్రెస్ అభ్యర్థి రాములునాయక్ ఐదో స్థానంలో ఉండగా.. ఆరో స్థానంలో జయసారథిరెడ్డి నిలిచారు. ఇప్పుడు కమ్యూనిస్టులు, టీజేఎస్ మద్దతు కూడా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం కలిసి వచ్చే అంశం. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి నాల్గో స్థానంలో నిలిచిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ప్రస్తుతమూ బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డికి ఇదే మొదటి ఎన్నిక.

హోరాహోరీ ప్రచారం

దాదాపు 20 రోజుల పాటు ఈ ఉప ఎన్నిక ప్రచారం కొనసాగగా.. 12 రోజులు మాత్రం ముమ్మరంగా సభలు, సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ తరఫున మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ ప్రచార బాధ్యతలు నిర్వహించారు. బీఆర్ఎస్ నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ క్యాంపెయినర్లుగా వ్యవహరించారు. బీజేపీ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, లక్ష్మణ్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారం చేసిన మంత్రులు బీజేపీ, బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రధానంగా ప్రస్తావించారు. బీజేపీ మతతత్వ విధానాలను ఎండగట్టారు. మద్దతిచ్చిన పార్టీలూ ప్రచారం నిర్వహించి కూటమి అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాయి. నాడు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ తనను ఎంతగా ఇబ్బంది పెట్టాయో.. తనపై ఎన్ని అక్రమ కేసులు బనాయించి జైలు పాలు చేశాయో అభ్యర్థి మల్లన్న ప్రజల ముందు ఉంచారు. బీఆర్ఎస్, బీజేపీ మాత్రం మల్లన్నను ఓ బ్లాక్‌మెయిలర్‌గా చిత్రీకరించి లబ్ధిపొందాలనే ప్రయత్నాన్ని తీవ్రంగా చేశాయి.

పోలింగ్ శాతం పెంపుదల దొటే..!

వరుసగా ఎన్నికలు వస్తుండటంతో ఓటర్లు ఒకింత ఇబ్బంది పడుతున్నారు. పైగా పట్టభద్రుల ఓట్లు.. అవి కూడా బ్యాలెట్ ఎన్నికలు కావడం, ప్రాధాన్యత క్రమం ప్రకారం కావడంతో ఓటింగ్ జాప్యం జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పట్టభద్రులు ఏ మేరకు కదిలి వచ్చి పోలింగ్‌లో పాల్గొంటారనేది అనుమానంగానే ఉంది. ఇదే స్థానానికి 2021లో జరిగిన ఎన్నికల్లో 5,05,565 మంది ఓటర్లుండగా 3,74,117 (73.86%) మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2015లో 49.61% మందే ఓటు వేశారు. 2021లో 5.05 లక్షల మంది ఓటర్లకు 703 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయగా, ఈసారి 4.63 లక్షల మందికి 605 కేంద్రాలను నెలకొల్పారు. 27వ తేదీన ఎంతమంది ఓటు హక్కు వినియోగించుకుంటారో చూడాలి. జూన్ 5న ఈ ఎన్నికల కౌంటింగ్ మొదలవుతుంది.

బడా కార్పొరేట్లకు దోచిపెట్టడమే బీజేపీ లక్ష్యం..

- అదే దారిలో బీఆర్ఎస్
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్నను గెలిపించాలి : గ్రాడ్యుయేట్లకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో బడా కార్పొరేట్లకు దోచిపెట్టడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని.. దాని దారిలోనే బీఆర్ఎస్ పోతున్నట్టు కనిపిస్తోందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేటు ఎమ్మెల్సీగా కాంగ్రెసు పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌ను గెలిపించాలని కోరారు. ఖమ్మంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న నిర్వహించనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నవీన్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీల్లో కాంగ్రెసు మాత్రమే రాజ్యాంగాన్ని రక్షించడం, లౌకిక విధానాన్ని కొనసాగించడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న పార్టీగా ఉందన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడే పార్టీగా ఉన్న కాంగ్రెసు అభ్యర్థినే శాసన మండలి సభ్యునిగా గెలిపించుకోవడం మంచిదని సూచించారు.

బీజేపీ ప్రజల మధ్య మతం పేరిట చిచ్చుపెడుతోందన్నారు. బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఆ పార్టీ పని చేస్తున్నదని విమర్శించారు. నూతన విద్యావిధానం పేరిట విద్యారంగాన్ని పూర్తిగా ప్రయివేటీకరించేందుకు పూనుకుందన్నారు. ఇటువంటి పార్టీ అభ్యర్థిని గెలిపించడమంటే.. ప్రజలు తమ కంట్లో తామే పొడుచుకున్నట్టేనని హెచ్చరించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కొత్త బడులను పెట్టి, పాతబడులను మూసేందుకు యత్నించిందన్నారు. అభివృద్ధి పేరిట నిర్మాణాల్లో అధిక దుబారా చేసిందన్నారు. ఈ ఎన్నికల్లో వ్యక్తుల గుణగణాలను పెద్దఎత్తున చర్చకు తీసుకొస్తున్నారని, పార్టీల విధానాలు బాగా లేనప్పుడు వ్యక్తులుగా చేసేదేముండదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సూచించారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు జీవీ నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి షేక్ ఉద్దండు షరీఫ్ పాల్గొన్నారు.

రూ.10 కోట్లు దాటితే కరోడ్‌పతి ట్యాక్స్

(మొదటి పేజీ తరువాయి)

టాక్స్) వేయాలి. ఇది ఒక్కటే జీడీపీలో 2.7 శాతం రాబడిని పెంచుతుంది. మోడరేట్ వేరియంట్ కింద రూ.10 కోట్ల నుంచి రూ.100 కోట్ల మధ్య నికర విలువ కలిగిన వ్యక్తులపై పన్నును 4 శాతానికి పెంచాలి. ఈ విలువ కలిగిన ఎస్టేట్‌లపై 33 శాతం వారసత్వ పన్ను వేయాలి. రూ.100 కోట్ల కంటే ఎక్కువ విలువ కలిగిన ఎస్టేట్‌లకు, వారసత్వ పన్నును 45 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. ఈ పన్ను విధానం భారత జీడీపీలో 4.6 శాతానికి సమానమైన ఆదాయాన్ని ఆర్జించగలదు.యాంబీషస్ పన్ను విధానంలో వ్యక్తులపై పన్ను రేట్లను 3 శాతం నుంచి 5 శాతం మధ్య, ఎస్టేట్‌లపై వారసత్వాలకు 45 శాతం నుంచి 55 శాతం మధ్య పన్ను పెంచాలని ప్రతిపాదించింది. దీంతో స్థూల జీడీపీలో పన్ను రాబడులు 6.1 శాతానికి పెరగవచ్చని అంచనా వేసింది.

విద్యా, వైద్యం కోసం ఖర్చు..

"సంపన్నులపై వేసే పన్నులతో వచ్చే ఆదాయాన్ని పేదలకు ప్రత్యక్ష నగదు బదిలీలు, విద్యా, వైద్యం, ఇతర సామాజిక రంగాలలో ఖర్చు చేయాలి. తద్వారా పున్ల పంపిణీ విధానాలలో పెట్టుబడి పెట్టవచ్చు. తమ ప్రతిపాదిత సంపద పన్ను ప్యాకేజీలు సామాజిక రంగ వ్యయాన్ని విస్తరించడానికి, విత్త అవకాశాలను సృష్టించడానికి దోహదం చేస్తాయి. బేస్‌లైన్ వేరియంట్ సంపద, వారసత్వ పన్నుల ద్వారానే ప్రస్తుత ప్రభుత్వ విద్యా వ్యయాన్ని దాదాపు రెట్టింపు చేయడానికి వీలుంది. అదే విధంగా మోడరేట్ వేరియంట్ టాక్స్ ద్వారా ఉమ్మడి ఆరోగ్యం, విద్యా బడ్జెట్‌ను దాదాపు రెట్టింపు చేయవచ్చు." అని రిపోర్ట్ పేర్కొంది. అంబీషస్ వేరియంట్ పన్నుల ద్వారా ఆరోగ్యం, విద్యా ప్రభుత్వ సంయుక్త బడ్జెట్‌ను రెట్టింపు చేయడానికి వీలుంది. పైగా అదనంగా మిగులు కూడా ఉంటుంది. ఈ పన్నుల విధానం దేశంలోని కేవలం 0.04 శాతం మంది పైనే ప్రభావం చూపుతుంది.

అగ్ర కులాలదే ఆధిపత్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక అసమానతల మధ్య దృఢమైన సంబంధాన్ని బలహీనపరచడంలో ఇటువంటి పన్నులు కీలక పాత్ర పోషించనున్నాయి." అని వాల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ తన రిపోర్టులో స్పష్టం చేసింది.

చిల్ విత్ నో ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

నమూనాలో సాంకేతికత అవసరమే. కానీ అది మనిషిని వ్యసనం స్థాయికి దిగజార్చితేనే ప్రమాదం. సెల్‌ఫోన్లలో 'పబ్జీ' గేమ్‌లు ఆడుతూ ప్రపంచవ్యాప్తంగా అనేకమంది యువతీ యువకులు ప్రాణాలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ జాడ్యం భారతదేశానికి పాకి, అప్పట్లో ఆందోళన కలిగించింది. చివరకు కేంద్ర ప్రభుత్వం ఆ గేమ్‌ను నిషేధించింది. 'మద్య పానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరం' అనే ప్రకటనలు లిక్కర్ బాటిళ్లు, సిగరెట్ ప్యాకెట్ల మీద ఉన్నట్టే...సెల్‌ఫోన్ కూడా ఆరోగ్యానికి హానికరం అని ప్రకటించే రోజులు ఎంతో దూరంలో లేవనిపిస్తుంది.

ఏమిటీ డిజిటల్ డిటాక్స్?

నిర్దిష్ట సమయం వరకు డిజిటల్ గాడ్జెట్‌లు, స్క్రీన్‌లు, ఇంటర్నెట్ ప్లాట్‌ఫారాలను ఉపయోగించకుండా ఉద్దేశపూర్వకంగా చేసే అభ్యాసమే డిజిటల్ డిటాక్స్. ఆఫ్‌లైన్ ప్రపంచంతో విశ్రాంతి తీసుకోవడానికి, రీసెట్ చేసుకోవడానికి, మళ్లీ ఉత్సాహంగా కనెక్ట్ చేయడానికి ఈ ప్రయోగాత్మక ప్రక్రియ ఉపయోగపడుతుందని గేట్‌వే ఆఫ్ హీలింగ్ వ్యవస్థాపక డైరెక్టర్, సైకో థెరపిస్ట్ డాక్టర్ చాందినీ తుగ్నైట్ చెప్తున్నారు. సెల్‌ఫోన్ వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో మానసిక రుగ్మతలు గణనీయంగా పెరుగుతున్నాయని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. దీన్నుంచి బయటపడటం ఎలా అనేది ఇప్పుడున్న వేల కోట్ల డాలర్ల ప్రశ్న. భూతాపం పెరుగుతున్నదని సంవత్సరంలో ఎర్త్ అవర్ పేరుతో (ఏటా మార్చి నెల చివరి శనివారం) ఒక రోజులో ఒక్క గంట లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు సహా సమస్త విద్యుత్ పరికరాలను ఆఫ్ చేసేస్తున్నాం. ఈ ఏడాది మార్చి 23వ తేదీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎర్త్ అవర్‌ను పాటించాయి. ఇదే తరహాలో భవిష్యత్‌లో ప్రపంచవ్యాప్తంగా 'నో సెల్‌ఫోన్' అనే ప్రయోగం పుట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు. 'డిజిటల్ డిటాక్స్'ను దానికి ఆరంభంగానే భావించాల్సి ఉంటుంది.

ఇవి పాటిద్దాం...

- సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, ఇంటర్నెట్‌ను ప్రయోగాత్మకంగా పక్కన పెట్టి, మనకిష్టమైన ఆహారం, వ్యాయామం, సకాలంలో నిద్రపోదాం. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది.
- ఎలక్ట్రానిక్ ఇంటర్నెట్ గ్యాడ్జెట్‌లు మనుషుల్ని వ్యసనపరులను చేస్తుంది. దీనివల్ల రివార్డ్ హార్మోన్ డోపమైన్లు విడుదలవుతాయి. వీటివల్లే మనకు మంచి అనుభూతి కలిగినట్టు ఫీల్ అవుతాం. రివార్డ్ హార్మోన్ డోపమైన్ హిట్‌ని ఎక్కువగా కోరుకుంటుంది. సెల్‌ఫోన్ లేదా గాడ్జెట్లను స్క్రోల్ చేసేటప్పుడు మెదడు హానికరమైన డోపమైన్ విడుదలను ప్రేరేపిస్తుంది. డిజిటల్ డిటాక్స్‌తో మనం ఈ వ్యసనం ఉచ్చులో పడకుండా ఉంటాం.
- సాధారణంగా సోషల్ మీడియా మన శరీరం ఎలా ఉండాలి...ఎలాంటి ఉద్యోగం చేయాలి...అనే విషయాలను మన ప్రమేయం లేకుండానే మనల్లో ఆలోచనలు రేకెత్తిస్తాయి. డిజిటల్ డిటాక్స్‌తో ఈ లింకులు తెగిపోయి, మన స్వీయ ఇమేజ్‌ను పునరుద్ధరించుకోగలుగుతాం. మనల్ని మనం అంచనా వేసుకొని నిర్ణయాలు తీసుకునే అవకాశం లభిస్తుంది.
- డిజిటల్ పరికరాలు నీలిరంగు కాంతిని విడుదల చేస్తాయి, ఇది శరీరం యొక్క సహజ నిద్ర-మేల్కొనే చక్రానికి అంతరాయం కలిగిస్తుంది. దీనివల్ల అనేక శారీరక, మానసిక రుగ్మతలు ఏర్పడతాయి. డిజిటల్ డిటాక్స్‌తో బైంకి ప్రశాంతంగా కునుకుతీసే అవకాశం కలుగుతుంది.
- ఆఫ్‌లైన్ హాబీలు, యాక్టివిటీలను పునరుద్ధరించుకుంటాం. దీనితో జీవితంలో మరింత సమతుల్యత, సంతృప్తి కలుగుతాయి.

అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నిందితులు అరెస్ట్

● ఒకరు పరారీ.. 3 కేజీల గంజాయి స్వాధీనం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నిందితులను మంగళ్ హాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రవి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్ జాలి హనుమాన్ ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి అలియాస్ బిజయ భాయ్ (48), అభిషేక్ సింగ్(19)లు తల్లి కొడుకులు గంజాయి విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. వారి వద్ద మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శివలాల్ నగర్ ప్రాంతానికి చెందిన టింకు సింగ్ పరారి లో ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు దొంగలు అరెస్ట్..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సులభంగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సుల్తాన్ బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస చారి తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్ షాన్వాజ్ (29), సిద్దు దంగర్(25) నాగరాజు ముగ్గురు నాంపల్లి, సీబీఎస్ వద్ద ఫుట్ పాత్ పై చిన్న చిన్న వ్యాపారులు చేసుకుంటూ వచ్చిన డబ్బులు సరిపోక సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో దొంగతనాలు చేసేందుకు పథకం వేశారు. ఈనెల 19న మహమ్మద్ ఫిరోజ్ (27) టీబీ పేషెంట్ మందులు కొనేందుకు రూ.8,500 నగదును తీసుకొని కోఠిలోని రంగ మహల్ రోడ్డు సంఘీత్ ట్రావెల్స్ వద్ద నడుచుకుంటూ వెళుతున్నాడు. నిందితులు మద్యం సేవించి సంగీత్ ట్రావెల్స్ వద్ద నడుచుకుంటూ ఫిరోజ్ వెళ్తుండగా ఇద్దరు నిందితులు అతనిపై దాడి చేసి రూ. 8,500ల నగదును, ఒక సెల్ ఫోన్ లాక్కున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని షాన్వాస్, సిద్దును అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. ఒక్కరు పరారి ఉన్నారని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

మా కుటుంబాలకు న్యాయం చేయాలి

సాహితి ఇన్ ఫ్రా కంపెనీ బాధితుల ఆందోళన



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

హైదరాబాద్ బషీర్ బాగ్ లోని సీసీఎస్ ఎదుట సాహితీ ఇన్‌ఫ్రా కంపెనీ బాధితులు ఆందోళనకు దిగారు. ప్రీ లాంచ్ పేరిట 2,500 మంది ఈ మోసానికి పాల్పడ్డారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అమీన్‌పూర్‌లో సాహితీ శర్వాణి ఎలైట్ పేరుతో 25 ఎకరాల్లో 32 అంతస్తులతో 10 టవర్లు నిర్మిస్తామంటూ సుమారు రూ.1,500 కోట్లు మోసానికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. చాలా మంది తమ కష్టార్జితంతో డబ్బులు పెట్టామని, తమకు స్థలమైన, డబ్బులైన ఇప్పించాలని కోరారు. తక్షణమే ఫాస్ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి తక్షణమే న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ కేసును చూస్తున్న సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్ రావును అరెస్టు చేయడంతో కేసు నీరుగారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని తమ కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరారు.

సామాజిక సేవాకర్త వెన్న ఈశ్వరప్పకు డాక్టరేట్ ప్రదానం

● ఆస్ట్రేలియా మధర్ థెరిస్సా యూనివర్సిటీ వారిచే..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్రంలో ఉన్న పలు గ్రామాలలో నిరుపేదలకు విద్యా మౌలిక వసతులు, వారి సమష్యాలను పరిష్కరించి వారికి అండగా నిలుస్తున్న సేవా రత్న అవార్డు గ్రహీత వెన్న ఈశ్వరప్ప సేవలు గుర్తించి మధర్ థెరిస్సా యూనివర్సిటీ (ఆస్ట్రేలియా)వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.విజయ సరస్వతి, డీన్ ఆఫ్ ఎంబిటియూ సీఈఓ డాక్టర్ జాన్ ఎం స్టోర్మ్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డీఆర్డిఓ సైంటిస్ట్ డాక్టర్. ఎస్. ప్రభాకరన్, ఐఎస్టీఎంపి ఇండియా డైరెక్టర్ సారా రేవుబెన్ హుమనిటేరియన్, సిండికేట్ మెంబెర్ సౌత్ ఇండియా డైరెక్టర్ డాక్టర్. కె.ఆర్ రవికుమార్ చేతుల మీదుగా ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈసందర్భంగా నగరానికి చేరుకున్న వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ.. గత20 సంవత్సరాలుగా రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, డీగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరపడే మౌలిక వసతులు అందించామన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులపై మంచినీటి ఆర్వో ప్లాన్టను, మరుగుదొడ్లను నిర్మించామని తెలిపారు. తాను చేస్తున్న ప్రజా సేవలను గుర్తించి ఈ డాక్టరేట్ రావడం ప్రజాసేవాపై మరింత బాధ్యత పెంచిందని వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు.

తెలంగాణ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్, అన్మెన్ కార్మికులు, పీస్ట్ సెక్యూరిటీ గార్డు సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం బేగంబజార్ డివిజన్ కార్యాలయంలో జేఏఓకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, 'టీజీ యూఇఇయూ-సీఐటీయూ' బేగం బజార్ డివిజన్ ప్రధాన కార్యదర్శి యం.మునిలాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కనకయ్య, సిద్ధార్థ, లక్ష్మణ్ రావు, శ్రవణ్, మొహమ్మద్, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న రెగ్యులర్, ఆర్టిసన్, అన్ మెన్ పీస్ రేట్, సెక్యూరిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత ఫిబ్రవరి 26న యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చామన్నారు. కానీ ఇంతవరకు అవి పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

● ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా పకడ్బందీగా జరగాలి
● ఏ చిన్న పొరపాటుకు తావివ్వరాదు
● కౌంటింగ్ హాల్‌లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు
● జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్ సభ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పారదర్శకంగా జరిగేలా కౌంటింగ్ సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. లోక్ సభ ఎన్నికల్లో భాగంగా శనివారం బంజారా హిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసి భవనంలో మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, ఏఆర్ఓలకు కౌంటింగ్ ప్రక్రియ పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపును సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. జిల్లాలో ఓట్ల లెక్కింపునకు మొత్తం 16 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ ఉంటుందని, కౌంటింగ్ ఉదయం 8:00 గంటలకు ప్రారంభమవుతుందని, నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు అందుబాటులో ఉండి సరి చేస్తారని తెలిపారు.

ప్రతి హాల్‌లో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు

ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా అన్ని సెగ్మెంట్లలో ఓట్ల లెక్కింపుకు ప్రతి హాల్‌లో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నామని, రౌండ్ల వారీగా కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. ప్రతి టేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ ఉంటారని ఆయన వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శకంగా కౌంటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమైనదని, మైక్రో అబ్జర్వర్లు రౌండ్ వారీగా ప్రతి రిపోర్ట్ ను ఎన్నికల అబ్జర్వర్లకు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏ సమస్య ఉన్న ఏఆర్ఓ కు తెలుపాలని సూచించారు. కౌంటింగ్ హాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతించబడవని స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ కు సంబంధించి అన్ని విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబంధనలను పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. కౌంటింగ్ హాల్ లో ఉండే ఏర్పాట్లు, కౌంటింగ్ ప్రక్రియలో పాటించాల్సిన ఆయా విషయాలపై రోనాల్డ్ రోస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎలక్ట్రానిక్ మెషిన్ కౌంటింగ్ కి సంబంధించిన సందేహాలను నివత్తి చేశారు. అనంతరం హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఈ సందర్భంగా వీవీ ప్యాట్ స్లిప్పుల కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కు సంబంధించిన ఆయా ప్రక్రియను ఆయన వివరించారు. కౌంటింగ్ సిబ్బంది ప్రతి ఒక్కరు జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జాయింట్ సిఈఓ, అడిషనల్ కమిషనర్ (యుబిడి) జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సునంద రాణి, ఏఆర్ఓ లు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్వైజర్‌లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం..



నవతెలంగాణ-ధూల్ పేట్

యువతి అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్ ఇంద్రనగర్ ప్రాంతానికి బి స్వామి కూతురు తేజస్విని విద్యార్థిని ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో నుండి బయటకు ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు స్థానికంగా రక్త సంబంధికులు, బంధు మిత్రులతో వాకాబు చేశారు. ఫలితం లేకపోవటంతో పోలీసులకు పిర్యాదు చేశారు. పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

షటిల్ కిట్స్ అందజేత

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట



లాల్ దర్వాజా ఫుల్ బాగ్ చమన్ ఛత్రపతి శివాజీ బ్యాడ్మింటన్ టీమ్‌కు కాంటెస్ట్ చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే బోయ నగేష్ శనివారం షటిల్ కిట్స్ అందజేశారు. షటిల్ ఆడడం ఎక్సర్‌సైజ్‌లో ఒక ముఖ్య భాగమని షటిల్ ఆడడం వల్ల మనిషి జీవన స్థాయి పెరుగుతుందని ఎక్సర్‌సైజ్ చేసుకుంటూ ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ టీం సభ్యులు ఆర్కే గౌడ్, బ్రహ్మయ్య, శివకుమార్ , శశి, అర్జున్ రాయుడు ఎస్సై వినోద్, రఘు, వేణు, అభిషేక్, అక్షయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల నైపుణ్యాలను తల్లిదండ్రులు గుర్తించాలి

● ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో ముగిసిన సమ్మర్ క్యాంప్



నవతెలంగాణ-అంబర్‌పేట:

ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ నిర్వహించిన నెల రోజుల ఐదు వారాల వేసవి శిబిరం 'క్రియేటివ్ చైల్డ్ సెంటర్' శనివారం ముగిసింది. గ్రేడ్ నర్సరీ నుండి 6వ తరగతి విద్యార్థులు ఆర్ట్స్, క్రాఫ్ట్స్, యోగాతో సహా అనేక కార్యకలాపాలను నేర్చుకున్నారు. జిమ్నాస్టిక్స్, డ్యాన్స్, సంగీతం, జుంబా ఫిట్‌నెస్, అవుట్‌డోర్, ఇండోర్ గేమ్‌లు పిల్లలు ఉత్సాహంగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తమ పిల్లల సహజసిద్ధమైన ప్రతిభను చాటేందుకు ఈ ప్రయత్నాలు చేస్తున్నామని స్కూల్ డైరెక్టర్, వైస్ చైర్‌పర్సన్ మణికొండ ప్రార్థన ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ఆసక్తిని, వారి నైపుణ్యాలను గుర్తించాలన్నారు. తద్వారా వారు లక్ష్యాన్ని సాధించడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. ఈ ఏడాది కొన్ని అద్భుతమైన ఈవెంట్‌ల కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. నేర్చుకుని తమ పనితీరును మెరుగు పరచుకోవడంలో నిబద్ధత, అంకితభావం ప్రదర్శించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. పిల్లలను ఒకే గొడుకు కింద వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయడం ద్వారా వేసవిని నిర్మాణాత్మకంగా వినియోగించేందుకు పాఠశాల యాజమాన్యం కనబరిచిన చొరవ పట్ల తల్లిదండ్రులు అభినందించారు. కళలు, చేతి పనులు, కుండల పనితనం ప్రదర్శన యోగా, జిమ్నాస్టిక్స్, డ్యాన్స్, పాటల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయని వారిని ప్రశంసించారు. ప్రకృతిలో గడపటం, స్నేహితులను కలవడం, యోగాభ్యాసం చేయడం, వారి ఫిట్‌నెస్‌పై పనిచేయడం, అందులో భాగమవ్వడంపై విద్యార్థులందరూ శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్ రామాంజుల, ఎస్.ఎస్.సి ఫమీద, సీ.బీ.ఎస్.ఇ రేఖా రావు, ఎర్లీ ఇయర్ ప్రోగ్రాం ఫాతిమా కాజిమ్, తదితరులు పాల్గొన్నారు.

'అణగారిన వర్గాల వాణి ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్'

● తెలంగాణ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి
● ఘనంగా ఇప్టా 81వ వ్యవస్థాపక దినోత్సవం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భారతదేశ సాంస్కృతిక చరిత్రలో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) ప్రత్యేక స్థానం కలిగి ఉందని, అన్యాయాలకు వ్యతిరేకంగా స్వరం పెంచడం లక్ష్యంగా పెట్టుకొని అణగారిన వర్గాల వాణి నేటికీ పని చేస్తుందని ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్, ఇప్టా రాష్ట్ర కార్యాలయం వద్ద ఇప్టా (ప్రజా నాట్య మండలి) 81వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇప్టాపతాకాన్ని కందిమళ్ల ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కళాకారులు పాడిన పాటలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా కందిమళ్ల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ డప్పు, పాటలు, నాటకాలు, జానపదాల ద్వారా ఇప్టా ప్రజలలో సాంస్కృతిక చైతన్యం తీసుకువచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో చారిత్రక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొనేలా పౌరులను ప్రోత్సహించడం, వారి భాగస్వామ్యాన్ని పెంచడానికి గట్టిగా కృషి చేసిందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రజా నాట్యమండలిపై ప్రభుత్వం విపరీతమైన నిర్బంధ కాండను సాగించిందని, 'మాభూమి' నాటకాన్నీ, పాటలను, జానపదులను కార్యక్రమాలను నిజాం ప్రభుత్వం అణచివేసిందని ఆయన గుర్తు చేశారు. 1943 సంవత్సరంలో ఆనాటి నాటక, చలన చిత్ర దిగ్గజాలు బాలరాజ్ సహానీ, సలీల్ చౌదరి, పృథ్వీరాజ్ కపూర్, కె.ఎ.అబ్బాస్, శంభో మిత్ర, పండిట్ రవి శంకర్, ఆనంద్ శంకర్, కైఫీ అజ్మీ, ఏ.కె.హంగల్ లాంటి మహానుబాహుల సారథ్యంలో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఆవిర్భవించిందని, నాటి నుండి నేటి వరకు భారతదేశంలో ఇప్టా సాహిత్యం, చరిత్ర, సినిమా, సంగీతం, సంస్కృతి, రాజకీయాలలో కీలక పాత్ర పోషిస్తువస్తుందన్నారు. ప్రగతిశీల కళాకారులు తమ సృజనాత్మక కళారూపాలతో ఇప్టా సాంస్కృతిక మేల్కొలుపు వారసత్వాన్ని ముందుకు సాగించాలని కందిమళ్ల ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్య మండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, రాష్ట్ర నేతలు కె.లక్ష్మి నారాయణ, కె.ఉప్పలయ్య, సైదులు, విజయ్, డప్పు వెంకన్న, ఎర్ర వెంకటేష్, అలెట స్వామి, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి బి.స్టాలిన్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు విలాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఒకే చోట ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న వైద్యులను బదిలీ చేయాలి

● గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 48ను రద్దు చేయాలి
● డీఎంఈకీ వినతిపత్రం అందజేసిన ప్రభుత్వ వైద్యులు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్రంలో ఉన్న బోధన ఆస్పత్రులలో ఒకే చోట 20 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న వైద్యులను ప్రభుత్వం వెంటనే బదిలీ చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యులు డిమాండ్ చేశారు. శనివారం కోఠిలోని డీఎంఈ కార్యాల యంలో డీఎంఈనీ వైద్యులు కలిసి కొన్ని ఏండ్లుగా పాతు కుపోయిన వైద్యులను బదిలీ చేయాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మీడియాతో మాట్లాడుతూ.. కొందరు వైద్యులు అసోసియే షన్ ముసుగులో బదిలీ కావాల్సిన వైద్యులు బదిలీ కాకుండా ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారని వారిని గత ప్రభుత్వాలు పట్టిం చుకోకపోవడంతో వారి ఆగడాల మితిమీరిపోయింద న్నారు. ఈ విషయంలో ప్రస్తుత ప్రభుత్వం వైద్యుల బదిలీలను వెంటనే ప్రారంభించాలని వారి డిమాండ్ చేశారు. ఈ విషయం పై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, హెల్త్ సెక్రటరీకి ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. గత ప్రభుత్వంలో విడుదల చేసిన జీవో నెంబర్ 48ను రద్దు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నత అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.శేఖర్, డాక్టర్ చంద్ర శేఖర్, డాక్టర్ సంబశివరెడ్డి, డాక్టర్ సూర్య నారాయణ, డాక్టర్ బెంజమెన్, డాక్టర్ మనీష్ గుప్తా, డాక్టర్ మూశాఖాన్, డాక్టర్ అజామ్, డాక్టర్ జగతి, డాక్టర్ అరుణ, డాక్టర్ కవిత , డాక్టర్ శకుంతల, డాక్టర్ అమరావతి, డాక్టర్ ఎం కవిత, డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు రక్షణ కరువు

● అర్ధరాత్రిలు బస్తీలో చొరబడి పెంపుడు జంతువులను అపహరిస్తున్న దొంగలు
● దొంగలించిన వాటిని కబేళాకు తరలింపు
● ముషీరాబాద్‌లో అర్ధరాత్రి రెండు ఆవులు అపహరణ

నవతెలంగాణ-ముషీరాబాద్

అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పెంపుడు జంతువులను వాటిపైన ఆధారపడి జీవిస్తున్నటువంటి ఆవులను వాటిని అర్ధరాత్రి ఇంటి బయట కట్టేసి ఉన్నటువంటి వాటిని రాత్రి సమయంలో భారీ వాహనాలతో వచ్చి దొంగలు అపహరిస్తున్నారు. ఉదయం లేచి చూసేసరికి ఆవులు పాడి గేదెలు కనిపించకపోవడంతో వాటి యజమానులు లబోదిబోమని రోదిస్తూ చుట్టుపక్కల ఎంత వెతికిన వాటి ఆచూకీ లభించకపోవడంతో తీవ్ర శోకంలో ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ముషీరాబాద్ రాంనగర్ కూరగాయల మార్కెట్‌లో అర్ధరాత్రి భారీ వాహనాలతో చొరబడి దొంగలు రెండు ఆవులను బలవంతంగా ఎతుకెళ్లారు. ఈ ఘటన స్థానికుల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలు సీసీటీవీ ఫుటేజీలో చూసిన స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెంపుడు జంతువులను ఈ విధంగా బస్తీల్లోకి చొరబడి దొంగలు అర్ధరాత్రి అపహరిస్తుంటే వాటికే రక్షణ లేకపోవడంతో అర్ధరాత్రులు మా పరిస్థితి ఏంటి అని భయపడుతున్నారు. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆవులను అతి కర్కశంగా దొంగలించిన వారిని పోలీసులు గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



అర్ధరాత్రులు దర్జాగా సంచరిస్తున్న దొంగలు..

ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాంనగర్ కూరగాయల మార్కెట్‌లో కొన్ని సంవత్సరాలుగా ఆవులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలు ఉన్నాయి. వాటి పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ప్రాంతంలో కూరగాయల మార్కెట్ ఉండడంతో ఎప్పుడు ఈ ప్రాంత సందడిగా వచ్చే పోయే వారితో రద్దీగా కనిపిస్తుంది. పెంపుడు జంతువులు ప్రజలతో మమేకమై ఈ రోడ్లలో ఎంతో ఆహ్లాదకరంగా సంచరిస్తుంటాయి. రాత్రి సమయంలో తమ వాకిళ్ళ ఆవరణలో ఆవులను పెంపుడు జంతువులను కట్టేసి నిద్రిస్తూ ఉంటారు. యజమానులు ఆ సమయంలో రెక్కీ నిర్వహించిన దొంగలు అర్ధరాత్రి సమయంలో పదుల సంఖ్యలో భారీ వాహనాలతో మార్కెట్‌లో చొరబడి గడ్డిమేస్తున్న రెండు ఆవులను అతి కిరాతకంగా తాళ్లతో లాగుతూ తమ వాహనాలలో బలవంతంగా ఎక్కించి అపహరించారు. ఉదయాన్నే తమ ఆవులు కనిపించకపోవడంతో వాటి యజమానులు చుట్టుపక్కల వెతికిన వాటి జాడ కనిపించకపోవడంతో స్థానిక ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించి పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌లో అర్ధరాత్రులు దొంగల ముఠా ఆవులను ఆహరించడం స్పష్టంగా కనిపించింది. దీనితో తీవ్ర ఆందోళనకు గురై తమ పెంపుడు జంతువుల పరిస్థితి ఈ విధంగా ఉంటే రాత్రి సమయంలో మా పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పాడి గేదెలకు ఆవులకు రాత్రి రోడ్ల పైన బస్తీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి తమరు రక్షించాలని కోరుకుంటున్నారు. రాత్రిళ్ళు బస్తీలో సంచరిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారిని కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విక్రమ్ (దొంగలు అపహరించిన ఆవుల యజమాని)



ముషీరాబాద్ రాంనగర్ కూరగాయల మార్కెట్‌లో చాలా సంవత్సరాలుగా పాడి జంతువులను పెంచుకుంటూ వాటి ద్వారా వచ్చే ఆదాయంతో మా కుటుంబాలు జీవిస్తూంటాయని విక్రమ్ ఆవుల యాజమాని తెలిపారు. పాడి ఆవులను దుండగులు రాత్రి సమయంలో గడ్డిమేస్తున్న వాటిని బలవంతంగా అపహరించారు. మా జీవనవృత్తి అయినటువంటి ఆవులను అపహరిస్తే మేము ఏ విధంగా బ్రతకాలి మా వన్యప్రాణులకు రక్షణ కల్పించాలి. మా ఆవులను అపహరించిన వారిని కఠినంగా శిక్షించాలి.

అపహరించిన మూగజీవులను కబేలాకు తరలింపు..

రాత్రి సమయంలో అపహరించిన జంతువులను కబేలాకు తరలిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. దొంగల ముఠాలు రోడ్డుపైన జీవిస్తున్న పెంపుడు జంతువులను బలవంతంగా అపహరించి ఈ విధంగా కబేలాకు తరలించడం సర్వసాధారణంగా మారిపోయింది. వన్య ప్రాణులకు రక్షణ కరువవుతుందని మూగజీవులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

నవీన్ (యువ నాయకుడు)



ముషీరాబాద్‌లో రాత్రి సమయంలో పోలీసుల నిఘా పూర్తిగా సన్న గిల్లిందని యువ నాయకుడు నవీన్ తెలిపారు. భారీ వాహనాల్లో పదుల సంఖ్యలో దొంగలు వచ్చి ఆవులను అపహరిస్తుంటే ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడిందని వాటిని కబేలాకు తరలించి దుండగులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆవులను అపహరించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చెత్త రహిత నియోజకవర్గంగా అంబర్‌పేటను తీర్చిదిద్దాలే

అంబర్‌పేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హేమలత



నవతెలంగాణ-అంబర్‌పేట

చెత్త రహిత ప్రాంతంగా అంబర్‌పేట సర్కిల్‌ను తీర్చిదిద్దుతామని అంబర్‌పేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హేమలత అన్నారు. శనివారం సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫోర్ట్ పాయింటును ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించి, స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఆమె మాట్లాడుతూ.. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ఇంటింటి నుంచి చెత్త సేకరించే స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని నిర్వహించి చెత్త సేకరణ ప్రతిరోజు జరగాల్సిందేననీ ఆదేశించారు. ఇంటింటి నుండి చెత్త సేకరణ సమయంలో ఎక్కువ డబ్బులు డిమాండ్ చేయకుండా తగిన రుసుము తీసుకొని, ప్రజలతో ఇష్టానుసారంగా మాట్లాడకుండా చెత్త సేకరణపై పూర్తి స్థాయి దృష్టి పెట్టాలని సూచించారు. నగరంలో జీవీపీ ఎలిమినేషన్ లక్ష్యం చేరుకోవాలంటే ప్రతి ఒక్కరూ సహకరించాలని వ్యాఖ్యానించారు. గతంలో ఉన్న గార్బేజ్ వాల్నరేబుల్ పాయింట్స్ ను కొంత వరకు తొలగించగలిగము, అదే స్ఫూర్తి తో ప్రజల సహకారం తీసుకొని కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశాల మేరకు హైదరాబాద్, అంబర్‌పేటను స్వచ్ఛ నగరంగా, ప్రాంతంగా తీర్చిదిద్దడానికి నడుం బిగించాలని స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ఎలాంటి వేతనం లేకుండా చెత్త సేకరిస్తూ వారి కుటుంబాన్ని పోషిస్తున్నారని, దీంతో అందరం రోడ్ల మీద చెత్త వేయకుండా ఉంటే స్వచ్ఛ ఆటో కార్మికులను ఆదుకోవడమే కాకుండా నగరంను పరిశుభ్రంగా పెట్టడానికి దోహదపడిన వారు అవుతారని స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి నెలా తగిన రుసుము చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్ తిరుపతి నాయక్, రాంకీ సిబ్బంది, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

కమాన్ నిర్మాణానికి ఎమ్మెల్యే చేయూత



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పెద్ద చర్లపల్లి గ్రామస్తుల కోరిక మేరకు కమాన్ నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేయూత అందించారు. పారిశ్రామిక వాడ కావడంతో కార్మికులకు, విద్యార్థులకు, ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే బండారి లక్ష్మారెడ్డి కమాన్ ఏర్పాటుకు చేయూతనందించారు. దీంతో ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సామల సందీప్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-ఘట్‌కేసర్

ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పోచారం గ్రామానికి చెందిన శివరాత్రి లింగస్వామి పక్షవాతంతో బాధపడుతుండగా ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు, నిరుపేద కుటుంబానికి చెందిన ఎస్. వెంకన్నకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం పోచారంలో నాయకులు, కార్యకర్తల మధ్య సందీప్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పోచారం మున్సిపాలిటీ యువజన సంఘాల నాయకులు, ఎస్‌ఎస్‌ఆర్ టీం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ఎర్ర జెండా లక్ష్యం



- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ.నర్సింగ్‌రావు
- ఉప్పల్ కార్యదర్శిగా జే.వెంకన్న ఎన్నిక



నవతెలంగాణ-ఉప్పల్

ప్రజా సమస్యల పరిష్కారమే ఎర్రజెండా పార్టీ ప్రధాన అజెండా అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డీజీ.నర్సింగ్‌రావు అన్నారు. శనివారం ఉప్పల్ సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం ఉప్పల్ సర్కిల్ కార్యదర్శిగా జె.వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకన్న మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉప్పల్ సర్కిల్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నాయకులతో కలిసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం, కార్యదర్శి వర్గ సభ్యులు జే. చంద్రశేఖర్, ఎం. వినోద, సర్కిల్ కమిటీ సభ్యులు ఎం. అశోక్‌రెడ్డి, ఎండీ గౌస్, భీష్మాచారి, లలిత, పద్మ, ఎం. కిరణ్ శేషు, వై. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కిమిడి కుమార స్వామి ఇటీవల మరణించాడు. అతడికి బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ ఉండడంతో పార్టీ తరపున మంజూరైన రూ.2లక్షల చెక్కును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి మృతుడి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను ముందుంటానని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి



- ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్

నవతెలంగాణ-కాప్రా

2024-25 విద్యా సంవత్సరానికి ముందే మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), బాల సంఘం మేడ్చల్ జిల్లా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం, మల్లాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏఐవైఎఫ్ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లు మాట్లాడుతూ.. ఉప్పల్ మండలంలో 30 ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులు మంజూరు చేశారని, మిగతా పాఠశాలలకు కూడా నిధులు మంజూరు చేయాలన్నారు. తాము సందర్శించిన సదరు పాఠశాల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు భయానకంగా ఉన్నాయన్నారు. కలుషిత నీటితో విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని, తరగతి గదులకు సరైన డోర్లు లేవన్నారు. వేసవి సెలవులు పూర్తయ్యే లోపుగా ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తులను పూర్తి చేస్తేనే 2024 విద్యా సంవత్సర ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తే ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలను సాధిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 26,092 ప్రభుత్వ బడులు ఉండగా గత ప్రభుత్వం వాటి అభివృద్ధి కోసం మొదటి విడతలో 9153స్కూళ్లకు రూ.3,497.62 కోట్లను, రెండో విడతలో 9123 స్కూళ్లకు రూ.2516.45 కోట్లను, మూడో విడతలో 7819 స్కూళ్లకు రూ.1275.48 కోట్లను కేటాయించిందన్నారు. గతేడాది ప్రారంభించిన మరమ్మతు పనులు 1200 స్కూల్స్‌లో పూర్తిఅయ్యాయని తెలిపారు. మిగత ప్రభుత్వ పాఠశాలల్లోని పనులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జరిగేలా చూడాలన్నారు. కలెక్టర్ ఆధీనంలో ఉండే జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్టీ) నిధుల్లో నుంచి పాఠశాలల అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, గిరి బాబు, బాల సంఘం నేతలు మహేష్, కిరణ్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



- డీఎల్పీవో సాంబిరెడ్డి

నవతెలంగాణ-ఘట్‌కేసర్

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎల్పీవో సాంబిరెడ్డి అన్నారు. శనివారం చౌదరిగూడలో పలు అక్రమ, అదనపు అంతస్తుల నిర్మాణాలను కార్యదర్శి శశి కుమార్, ఎంపీవో రవికుమార్‌తో కలిసి కూల్చేశారు. సాయి సురక్షలో నాలుగు, వెంకటాద్రి కాలనీలో మూడు, ఓయూ కాలనీ, డాక్టర్స్ కాలనీలో చేపట్టిన నిర్మాణాలను కూల్చేశారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలను చేపడితే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పనులను
పరిశీలించిన జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామ రైతు వ్యవసాయ సహకార సంఘంలో నిర్మిస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పనులను శనివారం జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు పరిశీలించారు. రైతు సేవా సహకార సంఘంలో సాంప్రదాయ పరిశ్రమల పునరుత్పత్తి పథకం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా మంత్రిత్వ శాఖ (ఎంఎస్ఎంఈ) వారి ఆర్థిక సహాయంతో కూరగాయలు, పండ్ల ప్రాసెసింగ్ క్లస్టర్ నిర్మాణానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మార్కెట్లలో ఏటా సుమారు 190 టన్నుల కూరగాయలు, పండ్లు వ్యర్థమవుతున్నాయన్నారు. ఇట్టి వ్యర్థాలను అరికట్టి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కూరగాయల ధరలు పడిపోయినప్పుడు వాటిని కట్ చేసి కట్ ఫ్రూట్స్ ప్యాకింగ్, సాసులు, ప్యూరీ, పౌడర్, చట్నీలను చేయడానికి ఈ ప్రాసెసింగ్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. దీనికిగాను సూక్ష్మ, చిన్న, మధ్య, తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ నోడల్ ఏజెనీగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా క్లస్టర్ పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి నీరజ గాంధీ, ఎంఎస్ఎంఈ అధికారి సూర్య ప్రకాష్‌గౌడ్, రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్యామ్ లాల్, సొసైటీ డైరెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ భూ బాధితులకు పరిహారమివ్వాలి

- ఎంపీఆర్ ఆధ్వర్యంలో వేం నరేందర్ రెడ్డిని కలిసిన భూ యజమానులు



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ మెయిన్ రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయిన భూ యజమానులకు అందరికీ సమాన పరిహారం ఇవ్వాలని భూ యజమానులు శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు భూ యజమానులు కలిశారు. ఈ సందర్భంగా భూ యజమానులు మాట్లాడుతూ..ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి సీపీఆర్ఐ నారపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఉప్పల్‌లో రోడ్డు విస్తరణ పనులను చేపట్టారన్నారు. రోడ్డు విస్తరణలో భూములు, భవనాలు కోల్పోయిన యజమానులకు జీహెచ్ఎంసీనే పరిహారాన్ని చెల్లించినట్లుగా గుర్తు చేశారు. పరిహార చెల్లింపులో జీహెచ్ఎంసీ భిన్న వైఖరిని ప్రదర్శించిందని తెలిపారు. జీహెచ్ఎంసీ గత ప్రభుత్వ హయాంలో పరిహార చెల్లింపులో మూడు విధానాలను అవలంబించి నిజమైన భూ యజమానులకు తీవ్రమైన నష్టం చేసిందన్నారు. తక్కువ పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని భూ యజమానులు కోరారు. కార్యక్రమంలో కందికంటి అశోక్ కుమార్ గౌడ్, పూజల ప్రభాకర్, తిక్క ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం



కే. సౌమ్య ఏ1 గ్రేడ్, మైక్ జోసయ్య ఏ1గ్రేడ్, పీ.కృతిక ఏ2 గ్రేడ్, లత ఏ2 గ్రేడ్, బీ. రాజేష్ ఏ2 గ్రేడ్, ఎస్. క్రితిక ఏ2 గ్రేడ్

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు

నవతెలంగాణ-మల్కాజిగిరి

గౌతమ్ నగర్ డివిజన్‌లోని మల్లికార్జున్ నగర్‌లో ఉన్న సెవెన్ హిల్స్ మోడల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బి. శేషసాయి, ప్రిన్సిపల్ యామిని మాట్లాడుతూ..తమ విద్యార్థులు తల్లిదండ్రులకు, పాఠశాలకు గొప్ప పేరు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా యాసిన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు



నవతెలంగాణ-ఘట్‌కేసర్

మండల పరిధిలోని మర్రిపల్లిగూడలో యాసిన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం ముస్లింలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం జెండాకు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉర్సు నిర్వాహకుడు మహ్మద్ ముస్తాఫా ఆధ్వర్యంలో గ్రామంలో ఊరేగింపు (సందల్) నిర్వహించారు. డప్పు చప్పులు మధ్య యువకులు నృత్యాలు చేశారు. మజీద్ వరకు ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జాహంగీర్, షానూర్, అజీజ్, రషీద్, ఫయాజ్, ఇస్మాల్, ఉబేద్, చిలుగూరి లక్ష్మన్, మాజీ ఉప సర్పంచ్ నరేష్ పల్లపు శ్రీకాంత్, సోమని శివ, శంకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో శిథిలావస్థ భవనాల కూల్చివేత



నవతెలంగాణ-మల్కాజిగిరి

వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని జీహెచ్ఎంసీ అధికారులు మల్కాజిగిరి పరిధిలో శిథిలావస్థకు చేరిన పలు భవనాల యజమానులకు నోటీసులు జారీ చేసి జేసీబీల సాయంతో కూల్చివేశారు. శనివారం మల్కాజిగిరిలో 5-4-95 ఇంటి నెంబర్‌గల భవనాన్ని, తుల్జాసింగ్, జీహెచ్ఎంసీ స్టాఫ్ మహమ్మద్, రమేష్‌తో కలిసి కూల్చేశారు. భవనాల కూల్చివేత జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఎక్కడైనా శిథిలావస్థ భవనాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ విషయమై బస్తీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఔటర్ రింగ్ రోడ్‌పై ఘోర రోడ్డు ప్రమాదం బాలుడు మృతి



నవతెలంగాణ-మేడ్చల్

ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఔటర్ రింగ్ రోడ్‌పై మేడ్చల్ నుంచి శామీర్‌పేట్‌కు వెళ్తున్న టయోటా కారును మార్గమధ్యలో ఆపి అందులోని బాలుడు పూజిత్ రామ్(13) వాంతులు చేసుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన డీసీఎం వాహనం బాలుడితో పాటు కారును బలంగా ఢీ కొట్టి బోల్తా పడింది. దీంతో తీవ్ర గాయాల పాలైన బాలుడు పూజిత్‌రామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా సంఘటన స్థలాన్ని ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ పరిశీలించారు. ఎస్సై లావణ్య గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



నవతెలంగాణ-శామీర్‌పేట

అలియాబాద్, శామీర్ పేట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం శామీర్‌పేట తహశీల్దార్ యాదగిరి రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రాలను సందర్శించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం డబ్బులు త్వరగా ఇచ్చేలా చూడాలని రైతులు కోరారు. ప్రతీ రోజు ఒక ధాన్యం లోడు వెళ్తుందని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తహశీల్దార్‌కు తెలిపారు. రోజు 2, 3 లోడ్లు పంపించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కుమార్, అలియాబాద్ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ నేత శ్రవణ్ గుప్తా జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ యువ నాయకుడు వీరమల్ల శ్రవణ్ గుప్తా జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వారి కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. యువ నాయకుడు శాంతన్ గుప్తా మాట్లాడుతూ..1వ వార్డులోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న శ్రవణ్ గుప్తాకు వార్డు ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకుడు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్, నాయకులు మధుకర్ యాదవ్, చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఒక వరం : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఉప్పల్

సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రామంతపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ కాలనీకి చెందిన రమేశ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్‌రావు బాధితుడి ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన రూ.45వేల ఎల్‌వోసి చెక్కును అందజేశారు.

ఆంజనేయుడి ఆలయాన్ని సందర్శించిన ప్రముఖులు



నవతెలంగాణ-కీసర

కీసర మండల పరిధిలోని చీర్యాల్ గ్రామంలో ఉన్న అతి పురాతన అభయ ఆంజనేయ స్వామిని ప్రముఖ సినీ నటులు నర్సింహారావు ఆహ్వానం మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. దేవాలయ పునఃనిర్మాణానికి కృషి చేస్తున్న సినీ నటులు నర్సింహా రావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల యంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, నాయకులు బర్లపాటి జయరాం, బక్కని కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్, మంకి రాజు తదితరులు పాల్గొన్నారు.

ధనుంజయ్ డయాగ్నోస్టిక్ సెంటర్ సీజ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి, కీసర డివిజన్ ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్.నారాయణరావు, డాక్టర్ చంద్రకళ, ప్రోగ్రాం అధికారి (మాత-శిశువు) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పల్‌లోని వైద్యాధికారిణి డాక్టర్ సౌందర్య లత, శ్రీనివాస్ ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజ్ దగ్గర ఉన్న ధనుంజయ్ డయాగ్నోస్టిక్ సెంటర్, అల్ట్రాసౌండ్ మెషీన్లను సీజ్ చేశారు. గర్భనిర్ధారణ ప్రక్రియల సూచనలను పేర్కొనకపోవడం, అందుబాటులో లేకపోవడం, సరిగ్గా నింపని ఫారం-ఎఫ్‌లు, స్కాన్ చేస్తున్న వైద్యులు సంతకం చేయని నివేదికలు, తప్పనిసరి రిజిస్టర్‌లను నిర్వహించకపోవడం, ఆన్‌లైన్‌లో సమర్పించకపోవడం ఎంట్రీలు, ప్రీ-కాన్సెప్షన్, ప్రీ-నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ యాక్ట్, 1994 కింద నిబంధనలు, సెక్షన్ల ప్రకారం సీజ్ చేసినట్టు డీఎంఅండ్‌హెచ్ రఘునాథస్వామి తెలిపారు. జిల్లాలో గర్భనిర్ధారిత స్కాన్లు సరైన దస్తావేజులు లేకుంటే ప్రీ-కాన్సెప్షన్, ప్రీ-నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ యాక్ట్, 1994 కింద చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

బీఆర్ఎస్ దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలి

- ఓటమిని భయంతోనే అసత్య ప్రచారం
- మేడిపల్లి పీఎస్‌లో తీన్మార్ మల్లన్న ఫిర్యాదు



నవతెలంగాణ-బోడుప్పల్

పట్టభద్రుల ఎన్నికల్లో ఓటమిని భయంతోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు తనపై అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని పట్టభద్రుల శాసన మండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. శనివారం మేడిపల్లి పీఎస్‌లో తనపై అసత్యాలు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో ఓటమి తప్పదని గ్రహించిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పీఏతో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన మనో ధైర్యాన్ని దెబ్బ తీయడం ద్వారా తనను ఎదుర్కొలేరని బీఆర్ఎస్ పార్టీ నేతలకు హెచ్చరించారు. కేటీ రామారావు నీతి మాలిన చర్యలను మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం సభ్యులు, అంజన్న, రంగయ్య, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్ సీఎంకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-ఉప్పల్

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా బీజేపీ నాయకులు వల్లపు జగన్‌యాదవ్ బేగంపేట ఎయిర్ పోర్ట్‌లో ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యకర్తలను ఉద్దేశించి యువ నాయకులు పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని ఆయన తెలిపినట్లు వారు తెలిపారు.



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్ప వాసులు శనివారం కలిసి, తమ సమస్యలను తెలిపారు. దానికి సానుకూలంగా స్పందించి, కేఎస్ఆర్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసాల వెంకటేష్, దశరథ్, భిక్షపతి, అరుణ, సావిత్రి, వనజ, సన్నిలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

అంత్యక్రియలకు ఆర్థికసాయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని తారకరామ్ నగర్ కాలనీకి చెందిన కమలమ్మ (68) అనారోగ్యంతో బాధపడుతూ మరణించింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, స్థానిక నాయకులను ఆదేశించి... బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, డీవీజీ ట్రస్ట్ ద్వారా రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ భాస్కర్, సంతోష్ ముదిరాజ్, అంబదాసు, బాలు తదితరులు ఉన్నారు.

ఆర్టిజన్లకు కన్వర్షన్ ఇవ్వాలి



- రాష్ట్ర జనరల్ సెక్రటరీ జె. ప్రసాద్ రాజు

నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ రాష్ట్ర సీఐటీయూ అనుబంధ విద్యుత్ కార్మిక సంఘం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకత్వ పిలుపులో భాగంగా హైదరాబాద్ బోయినపల్లి డివిజనల్ ఇంజనీర్‌కు శనివారం యూనియన్ రాష్ట్ర డిప్యూటీ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ జె. ప్రసాద్ రాజు, డివిజన్ అధ్యక్షులు యన్.వెంకటేశ్వర్లు కార్యదర్శి ఎ.మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సి.చంద్ర శేఖర్‌లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రెటరీ జె. ప్రసాద్ రాజు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు అందరికీ అర్హతను బట్టి జేఎల్ఎం, జేపీఏ, జూనియర్ అసిస్టెంట్ ఆఫీస్ సబార్డినేట్ సబ్ ఇంజనీర్ తదితర రెగ్యులర్ పోస్టులకు కన్వర్షన్ ఇవ్వాలని కోరారు. టీ.జి.ఎస్పీ.డీ.సీ.ఎల్ పరిధిలో పనిచేస్తున్న ఆర్టిజన్ గ్రేడ్ 3, గ్రేడ్ 4 కార్మికులకు వేతన సవరణలో జరిగిన తప్పులను సరిచేసి అత్యధిక పర్సనల్‌తో కలిపి వేతన సవరణ చేయాలన్నారు. అదేవిధంగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. సంస్థలో ఒకే సర్వీసు నిబంధనలను అమలు చేయాలని, సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు పీజు రేటు ప్రకారం కనీస వేతనాలను అమలు చేయాలని తెలిపారు. అంతే కాకుండా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ కోటి రూపాయల టర్మ్ ఇన్సూరెన్స్, మెడికల్ అన్ ఫిట్ అయిన ఆర్టిజన్ కుటుంబంలో ఒకరికి డిపెండెంట్ ఉద్యోగం కల్పించాలన్నారు. సంస్థలో కారుణ్య నియామకాల్లో పాత నిబంధనల ప్రకారం విద్యార్హతకు తగ్గ ఉద్యోగం ఇవ్వాలన్నారు. 2011 బ్యాచ్ జె ఎల్ఎంలకు డేట్ ఆఫ్ జాయినింగ్ నుంచి మానిటరీ బెనిఫిట్స్ ఏరియర్స్ చెల్లించాలని తెలిపారు.విధి నిర్వహణలో ఉన్న ఉద్యో గులపై దాడులు జరగకుండా వారికి ప్రత్యేక భద్రత కల్పించే విధంగా యాజమాన్యం చర్యలు చేపట్టాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కోశాధికారి డి.రాజు నాయకులు ఎ.అశోక్ జె.వెంకటేష్, శంకర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, సారయ్య, సోమేష్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

కెమికల్ న్యూమోనైటిస్‌కు
గురైన పాపకు ఎక్మోతో చికిత్స



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఛతీస్‌ఘడ్‌లోని భిలాయ్ ప్రాంతానికి చెందిన 18 నెలల పాప ప్రమాదవశాత్తు ఆలౌట్ సీసా మొత్తం తాగేసింది. ఊపిరందక ఇబ్బంది పడుతుండటంతో తొలుత స్థానికంగా ఉన్న ఆస్పత్రికి, తర్వాత అక్కడి నుంచి రాయచూర్‌కు తీసుకెళ్లారు. అక్కడ వెంటిలేటర్ అమర్చారు. అయినా పరిస్థితి బాగుపడకపోగా, ఊపిరి తిత్తులు మరింత పాడయ్యాయి. సరిగా ఊపిరి అంద లేదు. దాంతో రాయపూర్ ఆస్పత్రి వర్గాలు హైదరాబాద్ కొండాపూర్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రిని సంప్రదించాయి. ఇక్కడి నుంచి ఇద్దరు ఇంటెన్సివిస్టులు, ఒక పెర్ఫ్యూజ నిస్టు, ఒక కార్డియాక్ సర్జన్, ఐసీయూ నర్సు కలిసి రాయచూర్‌కు విమానంలో వెళ్లారు. అక్కడ పరీక్షించిన తర్వాత పాపకు ఆలౌట్‌లోని హైడ్రోకార్బన్ల వల్ల కెమికల్ న్యూమోనైటిస్ అనే సమస్య తీవ్రంగా వచ్చిందని తెలిసింది. పాప శరీరానికి తగినంత ఆక్సిజన్ అందించ డానికి వెంటిలేటర్ సరిపోకపోవడంతో, ఆమె కుడివైపు గుండె కూడా తీవ్రంగా దెబ్బతింటోంది. (సివియర్ రైట్ వెంట్రిక్యులర్ డిస్ఫంక్షన్ విత్ సివియర్ పల్మనరీ హైపర్టెన్షన్). దాంతో పాపకు ఎక్మో పెట్టి, ఆమె పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. పాపను 9 రోజుల పాటు వీఏ-ఎక్మో మీద పెట్టాక పరిస్థితి మెరుగుపడింది. అప్పుడు మరో ఐదారు రోజులు వెంటిలేటర్ మీద ఉంచారు. అనంతరం హైఫ్లో, లోఫ్లో ఆక్సిజన్ పెట్టారు. ఈ మధ్యలో ఇన్ఫెక్షన్ రావడంతో యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేశారు. 18 రోజుల చికిత్స తర్వాత పాప పూర్తిగా కోలుకుంది. అన్ని రకాలుగా బాగుండటంతో గురువారం ఆమెను డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా కొండాపూర్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రి పీడియాట్రిక్స్ విభాగం క్లినికల్ డైరెక్టర్, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ విభాగాధిపతి డాక్టర్ పరాగ్ శంకర్రావు డెకాటే మాట్లాడుతూ "బాలికకు ఇచ్చిన చికిత్స వల్ల ఆమె గుండె, ఊపిరితిత్తులకు తగినంత మద్దతు లభించింది. అనుభవజ్ఞులైన కార్డియాక్, వాస్క్యులర్ సర్జన్లు ఉండటంతో రక్తనాళాల్లోకి కాన్యులేషన్ సరిగ్గా జరిగింది. ఇప్పటి వరకు ఈ ఆస్పత్రిలో ఇలా మెడ ద్వారా కాన్యులేషన్ పెట్టి వీఏ-ఎక్మో పెట్టిన కేసులు ఆరు ఉన్నాయి. ఈ ఆస్పత్రిలో ఈ-పీసీఆర్ కూడా చేయ గలరు. గడిచిన మూడేండ్లలో మొత్తం 15 సార్లు ఎక్మో పెట్టాం. మెరుగైన ఫలితాల కోసం రక్తనాళాలను కూడా పునరుద్ధరించగలం" అని ఆయన చెప్పారు. రాయపూర్ నుంచి పాపను తీసుకొచ్చిన బృందంలో పీఐసీయూ అధినేత డాక్టర్ పరాగ్ డెకాటే, పీడియాట్రిక్ ఇంటెన్సివి స్టులు డాక్టర్ కల్యాణ్, డాక్టర్ అవినాష్ రెడ్డి, కార్డియాక్ సర్జన్ డాక్టర్ సందీప్ జనార్ధన్, పెర్ఫ్యూజనిస్టు దయాకర్, దీపుమోనే, సర్జికల్ సిస్టర్ నాగశిరీష ఉన్నారు.

బక్రీద్ కల్లా మౌలిక వసతులు కల్పిస్తాం



- ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ కాలనీలో గల జమా ఈ మస్జిద్ - ఈ - నూర్ ఖబ్రస్తాన్ అండ్ ఈద్గా కమిటీ సభ్యులు, రాబోయే బక్రీద్ పర్వదినం సందర్భంగా, మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వివేకానంద నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే బక్రీద్ పర్వదినం సందర్భంగా ఈద్గాలో అన్ని రకాల మౌళికవసతులు కల్పిస్తామని తెలిపారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేసుకోవడానికి వీలుగా అన్ని రకాల మౌళికవసతులు కల్పిస్తూ... ప్రశాంత వాతావరణం కలిపిస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. బక్రీద్ పండుగను చక్కటి వాతావరణంలో చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, సయ్యద్ అహ్మద్, ఖాసీం, సలీం, షోయబ్, లుక్మన్, రషీద్, అంజద్, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూను సందర్శించిన నూతన ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూ నూతన ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్‌గా బుర్రా వెంకటేశం నియమితులైన సంగతి తెలిసిందే. శనివారం ఆయన జేఎన్‌టీయూ యూనివర్సిటీని సందర్శించారు. అనంతరం వైస్ ఛాన్స్‌లర్ ఛాంబర్‌లో రెక్టర్ కె.విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె .వేంకటేశ్వరావుల సమక్షంలో యూనివర్సిటీలోని డైరెక్టర్ లను, కాలేజ్ ప్రిన్సిపాల్, క్యాంపస్ కాలేజీలోని పలు డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న ఆచార్య వర్గాన్ని, ఆయా డిపార్ట్‌మెంట్‌ల హెచ్‌ఓడీలు ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్‌కు రిజిస్ట్రార్ పరిచయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అవసరాన్ని గుర్తించి, మంచి విద్యా బోధన చేయాలన్నారు. ఉపాధ్యా యులకు సంతృప్తిని ఇచ్చేది విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉంటే ఆ ఉపాధ్యా యులు సంతోషం వేరు అన్నారు. వచ్చే వారం తాను ప్రతీ డిపార్ట్‌మెంట్‌ను సందర్శించతానన్నారు. దేశంలో పేరు గల యూనివర్సిటీ జేఎన్‌టీయూ, ఆ పేరు ప్రతిష్టలు కాపాడుకుంటూ మరింత మెరుగైన సేవలు మనం విద్యార్థులు కు అందించాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్న నా దృష్టికి తీసుకోని వస్తే తప్పకుండా పరిష్కరం చేస్తానన్నారు.

కమీషన్ల కోసం పార్కులను నిర్మించారు

- కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



ప్రజా అవసరాల కోసం పేరుతో హౌసింగ్ బోర్డ్ కాలనీలో అవసరాలు లేనప్పటికీ ఖాళీ స్థలాలను కమీషన్ల కోసం పార్కులను నిర్మించారని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. శనివారం కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో పలు పార్కులను మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బృందం సందర్శించి పరిశీలించారు. అనంతరం పార్కుల మెయింటెనెన్స్, పార్కుల్లో ఉన్న సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి మాట్లాడు తూ నిర్మించిన పార్కుల నిర్వహణ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో జరగాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు పార్కులో తిష్ట వేసి సొంత జాగరుగా వాడుకుంటు న్నారని ఆరోపించారు. కేపీహెచ్‌బీ కాలనీ ఫ్లాట్స్ ప్రాంతంలో గల పార్కుల్లో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని వీటిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధి అంటే ప్రజాధనంతో నిర్మించి పట్టించుకోకుండా ఉండడం కాదని, గత ప్రభుత్వం హయంలో పార్క్‌లో డెవలప్మెంట్ కోసం అని కోట్ల రూపాయలు నిధులు వేచించి, టెండర్లు పిలిచి కమిషన్ల కోసం పందు చేపట్టి నిర్వహణ బాధ్యత మరిచిపోయారన్నారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు పార్కులను పరిశీలించి, ప్రజా అవసరాలకు వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ విషయమై తాము జీహెచ్ఎంసీ అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని శేరి సతీష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్ బీ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రాజు, మహిళా అధ్యక్షురాలు పొన్నం రజిత గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, ఫణీంద్ర కుమార్, కిరణ్, సాయి తేజ గౌడ్, పాల్గొన్నారు.

ఉచిత శిబిరాలు ప్రజలకు ఉపయోగపడతాయి



- కాంగ్రెస్ పార్టీ మూసా పేట డివిజన్ అధ్యక్షుడు చిన్ను పాషా

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతగానో దోహదపడుతాయని మూసాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్ను పాషా అన్నారు. బాలాజీ నగర్ డివిజన్ పరిధి ఆంజనేయ నగర్ కాలనీలోని శ్రీ సీతారామ కళ్యాణ మండపం వద్ద శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. చిన్ను పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 300 మంది ఉచితంగా షుగర్, థైరాయిడ్, సాధారణ చికిత్సలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసా పేట పరిసర ప్రాంతాలలో ప్రతీ వారానికి ఒక్కసారి వైద్య శిబిరం నిర్వహిస్తామని అన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు పేద ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ ముస్సి, డాక్టర్ రజిత, ప్రవీణ్, శ్రీకాంత్, రాకేష్, సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్క పెంటయ్య, మోజేస్, తూము సచిన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కె.ఎం. ప్రతాప్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో శ్రీ హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో జూన్ 1న నిర్వహించ బోయే శ్రీ హనుమాన్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పెద్దలు కె. యం ప్రతాప్‌ని రావలసిందిగా శ్రీ హనుమాన్ భక్తమండలి సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. హనుమాన్ జయంతి వేడుకలను శాంతియుతంగా జరుపుకునేలా... మతసామరస్యానికి విఘాతం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కె.యం. ప్రతాప్ సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తమండలి సభ్యులు జిట్టా రామేశ్వర్ రెడ్డి, ఉల్ఫీ వెంకటేష్, ఊరడి మల్లికార్జున్, జిట్టా బల్వంత్ రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతమైన జీవితానికి సంస్కారమే పునాదులు



- ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఎలెక్షన్ రెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఉన్నతమైన జీవిత సౌధానికి సంస్కారమే పునాది అని ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఎలక్షన్ రెడ్డి సూచించారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ శ్రీ మాణికేశ్వరి మాత ఆశ్రమం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు యుక్తవయస్సు రాకమునుపే మంచి మాటలు, పౌష్టికాహారం, మంచి అలవాట్లు, వినయ విధేయ సాంగత్యం అలవర్చాలని తెలిపారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో నేటి పిల్లల్లో ఈ సంస్కారం కొరవడి జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారన్నారు. మొక్కై వంగనిదే మానై వంగునా..అన్నట్లు పిల్లలకి చిన్నతనంలోనే మన సంస్కృతి,సాంప్రదాయాలు ఉద్బోధించాలన్నారు.నీతి పద్యాలు, శతకాలు స్తోత్రాలు, శ్లోకాలను నేర్పించాలని చెప్పారు. శ్రీశ్రీశ్రీ మహాయోగిని మాణిక్యేశ్వరి మాతాజీ సంస్కార శిక్షణ సంస్కృతి రక్షణ చేయాలని అనేవారు వారి ఆజ్ఞ మేరకు ప్రతీ సంవత్సరం మే నెలలో బాలసంస్కార శిక్షణ శిబిరాన్ని విఠల్ రెడ్డి సౌజన్యంతో నడుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక యం.ఎల్.ఎ.వివేకానంద్, యం.ఎల్.సి. శంభీపూర్ రాజు, స్థానిక కార్పొరేటర్ జగన్ సహకారాలతో ఇటీవలే జరిగిన ప్రతిష్ఠలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మాజీ యం.ఎల్.ఎ. మదన్ రెడ్డి, మిత్రులు బలరాం గౌడ్‌ల సహాయ సహకారాలు మరువలేనివని అన్నారు. ఆశ్రమ వ్యవస్థాపకులు మల్లికార్జున స్వామి విచ్చేసిన అతిథులకు, పిల్లల తల్లి దండ్రులకు మనికేశ్వరి మాతాజీ ఆశీస్సులు అందించారు. మాతాజీ ప్రతినిధిగా పూజ్యులు శ్రీశ్రీ వీరాచార్య స్వామి అనుగ్రహ సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పండితులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ప్రజలు ఇబ్బందులు పడకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు శనివారం గాజులరామారం డివిజన్ పరిధి చంద్రగిరినగర్ ప్రాంతంలో అధికారులు,స్థానికులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజల సహాయ సహకారాలతో అభివృద్ధి చేసి, గ్రేటర్‌లోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్ పాటిల్, డివిజన్ యువమోర్చా అధ్యక్షులు నవీన్, బస్తీ వాసులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లోని శివాలయం - నల్ల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు శనివారం కలిశారు. ఆలయంలోని వివిధ సదుపాయాల ఏర్పాటు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ పితాని శ్రీనివాసరావు, ఎమ్. వెంకటేశ్వర రావు, ఎస్.బాలకృష్ణ, వి.వి.రమణ, రామచందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

ఎక్కువ చదివి తక్కువ రాయాలి..

- రచయితలకు లోకేశ్వర్ సూచన

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



రచయితలు ఎక్కువ చదివి తక్కువ రాయాలని, ఒక జీవితంలో అనేక జీవితాల అనుభవాలను సంపాదించుకోవాలని ప్రముఖ రచయిత పరవస్తు లోకేశ్వర్ సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఏర్పాటుచేసిన పరిణతవాణి కార్యక్రమంలో ఆయన స్వీయ జీవిత, సాహిత్య విశేషాలతో కూడిన ప్రసంగం చేశారు. హైదరాబాద్ పాతనగరంలో 1951 లో జన్మించానని, చిన్నప్పటి నుంచి ఇంట్లో చదివే వాతావరణం ఉండటంవల్ల పుస్తకాలు విపరీతంగా చదివే అలవాటు వచ్చిందని, పాఠ్యపుస్తకాల పట్ల ఎంత అనాసక్తి ఉన్నా ఇతర పుస్తకాలను మాత్రం అసంఖ్యాకంగా చదివానని తెలిపారు. పాత నగరంలోని గుణవర్ధక పుస్తక భాండాగారం లో తాను చదివిన పుస్తకాలు, గ్రంథాలయోద్యమ స్ఫూర్తి తన వ్యక్తిత్వాన్ని మలిచాయని లోకేశ్వర్ తెలిపారు. చదవడానికి ఇచ్చిన ప్రాముఖ్యం రాయడానికి ఇవ్వకపోవడం అనే స్వభావం వల్ల 50 ఏండ్ల వయసులో మాత్రమే రచనలు ప్రారంభించాలని, తెలంగాణ ఉద్యమ చరిత్ర, సలాం హైదరాబాద్, కల్లోల కలల కాలం, చార్మినార్ కథలు, శాలిబండ కథలు, యాత్ర చరిత్రలు మొదలైన రచనలు తనకు ఎంతో పేరు తెచ్చిపెట్టాయని అన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షో పన్యాసం చేస్తూ డాక్టర్ సి.నారాయణరెడ్డి 1994లో ప్రారంభించిన పరిణతవాణి ప్రసంగ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమైందని, ప్రసంగ వ్యాసాలను సంపుటాలుగా పుస్తక రూపంలో పరిషత్తు అందిస్తున్నదని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
10
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
ఆదివారం | మే 26, 2024 | www.navatelangana.com

విద్యార్థుల జీవితాలతో ఇంటర్ బోర్డు చెలగాటం



- జాజుల లింగం గౌడ్

నవతెలంగాణ-ఓయూ

ఇంటర్ విద్యార్థుల జీవితాలతో ఇంటర్మీడియట్ బోర్డు చెలగాటమాడుతున్నదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పలువురు విద్యార్థులు ప్రశ్నలకు సరైన సమాధానం రాసినా తక్కువ మార్కులు వేయడం సిగ్గుచేటని అన్నారు.ఇంటర్ పేపర్ మూల్యాంకన సీనియర్ అధ్యాపకులచే చేయిస్తే ఇలాంటి సంఘటనలు జరిగేవి కావన్నారు. మిడిమిడి జ్ఞానం కలిగిన వారిని ట్యూటర్లతో, జూనియర్ లెక్చరర్స్‌తో పేపర్లు మూల్యాంకన చేయడం వల్ల ఇదంతా జరుగుతున్నదని అన్నారు. మార్కులు తక్కువ వచ్చాయని ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలకు కారణమైంది ఇంటర్మీడియట్ బోర్డు అని అన్నారు. .



అన్నమాచార్య జయంతి సందర్భంగా శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై అన్నమయ్య కీర్తన కు నర్తిస్తున్న బాల నర్తకులు.
నవతెలంగాణ-కల్చరల్



జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

జన విజ్ఞాన వేదిక, కామన్ స్కూల్ అసోసియేషన్(సీఎస్ఏ) ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ఆరోరోజు జూబ్లీహిల్స్ నియోజకవర్గం మోతి నగర్‌లో ఏర్పాటు చేశారు. సైన్స్ శిబిరంలో శనివారం పిల్లలకు జె.వి.వి నగర్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎం.భరత్ ఆహారం ఆరోగ్యంలి అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రాయింగ్ అనే అంశంపై కోసూరు శ్రీనివాసరావు స్కూల్ పిల్లలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజా , జూబ్లీహిల్స్ జోన్ అధ్యక్షులు రిటైర్డ్ సైంటిస్ట్ ఎస్ రవి పాల్గొన్నారు.



ఉత్తమ్‌ను కలిసిన అదం

నవతెలంగాణ-ఓయూ

బేగంపేట లోని టూరిజం ప్లాజాలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు అదం సంతోష్ మర్యాద పూర్వకంగా కలిశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు అవకాశాలపై చర్చించారు.



ఆంజనేయ స్వాముల బైక్ ర్యాలీ

- పాల్గొన్న కార్పొరేటర్లు

నవతెలంగాణ-ఓయూ

రామంతపూర్ చిన్న చెరువు వద్ద పాండురంగ స్వామి ఆలయం నుంచి ఆంజనేయ స్వాములు శనివారం బైక్ ర్యాలీ నిర్వహించి వివిధ దేవాలయాలను దర్శించుకున్నారు. అనంతరం పాండురంగస్వామి ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ హాజరయ్యారు. రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు , బీజేపీ సీనియర్ నాయకులు గడ్డం సాయి కిరణ్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు రాగి లతా వెంకటరెడ్డి , శ్రీ ఆంజనేయ సేవా ట్రస్టు సభ్యులు మంచాల వీర ప్రకాష్, రాగి వెంకటరెడ్డి, దంతూరి భాస్కర్, తీగల మహేష్ గౌడ్, రవీందర్ గౌడ్, ముత్యాల లక్ష్మణ్, ధరణినరేష్, నేల మల్లేష్ గౌడ్, నరేష్ గౌడ్, మోర్ల సతీష్, శ్రీనివాస్ రెడ్డి, అరవింద్ చారి, వెంకటేష్ చారి, ఆంజనేయులు చారి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.



పక్కకు ఒరిగి.. ప్రమాదకరంగా చెట్లు..

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రాజీవ్ నగర్ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలు ప్రమాదకరంగా ఒక పక్కకు ఒరిగిపోయి కనిపిస్తున్నాయి. పురాతన చెట్లు ఎప్పుడు పడిపోతాయో అనే భయంతో టూవీలర్, ఫోర్ వీలర్ ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. అయితే వర్షాకాలం వచ్చినందున చెట్ల కొమ్మలు భారీగా పెరిగి కరెంటు వైర్లను తాకుతూ, రోడ్డుపై వెళ్తున్న భారీ వాహనాలను తాకుతూ ఉన్నాయి. ఈ సందర్భంగా కాలనీవాసుల ఫిర్యాదుతో విద్యుత్ శాఖ సిబ్బంది వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను, రోడ్లపై పూర్తిగా వాలిపోయిన చెట్ల కొమ్మలను మాత్రమే తొలగిస్తున్నారు. అయితే చెట్లు కూడా పూర్తిగా రోడ్డుపై వాలిపోయి ఉన్నాయని అవి భారీ వర్షాలు వస్తే ఎప్పుడు ఎవరు మీద పడతాయో అని భయంతో కాలనీ వాసులు వాహనదారులు భయపడుతున్నారు. ఎలక్ట్రికల్ సిబ్బందిని చెట్లు ఎందుకు తొలగించుటలేదు, అవి కూడా పడిపోయే ప్రమాదంగా ఉన్నాయి కదా అని నవతెలంగాణ అడగగా చెట్లు పూర్తిగా తొలగించాలంటే ఫారెస్ట్ అధికారుల అనుమతి కావాలని, వారు అనుమతి ఇవ్వడం లేదని వారు చెప్పారు. ఇటీవల కంటోన్మెంట్ ఆస్పత్రిలో ఓ చెట్టు దంపతులపై పడడంతో భర్త చనిపోగా భార్యకు తీవ్రగాయాలైన సంగతి తెలిసిందే. ఇలాంటి ఘటనలు దృష్టిలో పెట్టుకొని వెంటనే ఫారెస్ట్ అధికారులు సిటీలో ప్రమాదకరంగా ఒరిగిపోయి ఉన్న చెట్లను వెంటనే తొలగించాలని, లేని యెడల వర్షాకాలంలో అనేక చెట్లు కూలిపోయి వాహనదారులపై పడి ప్రాణాలు కోల్పోతారని ఫారెస్ట్ అధికారులను హెచ్చరిస్తున్నారు.



వర్షాకాల ప్రణాళికకు

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- అధికారులకు జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి ఆదేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాకాల ప్రణాళికలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఎండీ సుదర్శన్ రెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, సీజీఎంలు, జీఎంలు, ఇతర అధికారులతో కలిసి ఏండీ శనివారం సమావేశం నిర్వహించారు. డివిజన్ల వారీగా ఉన్న మ్యాన్ హెూల్స్, డీప్ మ్యాన్ హెూల్స్, నీళ్ల నిలిచే ప్రాంతాలు తదితర అంశాలను అధికారులను ఎండీ అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే మ్యాన్ హెూల్స్ మరమ్మతులకు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాల ప్రణాళికలకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. స్టోర్స్‌లో సరిపడా సామగ్రి ఉందో లేదో చూసుకోవాలని ఇంకా ఏమైనా అవసరం అయితే ముందే తెప్పించుకోవాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి కావాల్సిన భద్రతా పరికరాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్ కావాల్సిన సామగ్రి అందుబాటులో ఉంచుకోవాల న్నారు. వర్షాలు ప్రారంభమైన తర్వాత రోజూ వాటర్ లాగింగ్ పాయింట్స్ దగ్గరికి వెళ్లాలని తెలిపారు. మేనేజర్ లేదా సిబ్బంది రోజూ వెళ్లి పర్యవేక్షించాలన్నారు. అన్ని డివిజన్లలో మ్యాన్ హెూల్స్ పై సేఫ్టీ గ్రిల్స్, హెచ్చరిక బోర్డులు, రెడ్ ఫ్లాగ్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



సబ్ జూనియర్ త్రో బాల్ చాంపియన్‌షిప్‌కు రెండు జట్లు ఎంపిక

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

పంజాబ్ పాటియాలలో ఈనెల 28 నుండి 30 వరకు 29వ సబ్ జూనియర్ త్రోబాల్ చాంపియన్షిప్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు తెలంగాణ త్రో బాల్ అసోసియేషన్ నుంచి అండర్ 15 బాలురు-బాలికల రెండు టీములు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా ఆ టీములకు త్రో బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి నవీన్ యాదవ్ (జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే) వైస్ ప్రెసిడెంట్ పి. జగన్మోహన్ గౌడ్, కిరణ్ చారి రెండు టీంలను సన్మానించి, వారికి కావలసిన ఆట పరికరాలు, టీ- షర్టులు, పాటియాలా పంజాబ్ వెళ్ళుటకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేశారు. బాలుర టీంకు కెప్టెన్ సిద్ధార్థ, మేనేజర్ ధీరజ్ కుమా ర్ యాదవ్, కోచ్ వాసుదేవ్ ను ఎన్నిక చేశారు. అదేవిధంగా బాలికల టీంకు కెప్టెన్ గా రక్షితటీ మేనేజర్ శశాంక్, కోచ్ శరత్ కుమార్ రెడ్డిని ఏర్పాటు చేశారు. అనంతరం టీం సభ్యులతో ఫోటోలు దిగి తెలంగాణకు మంచి పేరు తీసుకుని రావాలని, విజయం సాధించాలని బాల-బాలికల కు మనోధైర్యం చెప్పారు.

గ్రూప్1 పరీక్షను వాయిదా వేయాలి



- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్

నవతెలంగాణ-ఓయూ

జూన్ 9న గ్రూప్ 1 పరీక్ష ఉన్న నేపథ్యంలో ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎన్నికలకు విద్యార్థులు దూరమయ్యే ప్రమాదం ఉందని, కావున అట్టి పరీక్షలను వాయిదా వేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో పట్టభద్రులకు ఓటు హక్కును వినియోగించుకునే స్వేచ్ఛను కల్పించాలని కోరారు. శనివారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రూప్1 పరీక్షను వాయిదా వేసేలా చూడాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో ఎద్దల సభకు మేధావుల ద్వారా, విద్యార్థుల ద్వారా, విద్యావంతుల ద్వారా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాల్సినఅవసరం ఉంటుంది గనుక గ్రూప్ వన్ అభ్యర్థులు పరీక్ష ఒత్తిడి మూలంగా ఎన్నికలకు దూరమై ఓటు హక్కును వినియోగించుకోకపోవడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం అన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు అనుగుణంగా పనిచేయాల్సినటువంటి టీఎస్పీఎస్సీ ఈరోజు కాంగ్రెస్ పార్టీకి కొమ్ము కాస్తున్నదని విమర్శించారు. గతంలో విద్యార్థులుగా, గ్రూప్1 అభ్యర్థులుగా తాము ఇచ్చినటువంటి వినతి పత్రాలను కూడా చెత్త బుట్టలో పడేసి కాలయాపన చేస్తూ ఈరోజు విద్యార్థులను పట్టభద్రులను ఎన్నికలకు దూరం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు గనుకనే, అలాగే నిరుద్యోగుల లోపల ఉన్నటువంటి తీవ్ర వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందని, కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేక ఓటు శాతం పెరుగుతుందనే ఒక అభద్రతతో ఈ కుట్రకు తెరలేపారన్నారు. కాబట్టి ఎన్నికల సంఘం ప్రత్యేక చొరవతో ఈ పరీక్షను వాయిదా పడేలా చేసి ఎన్నికల్లో పట్టభద్రులు అంతా కూడా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు బిల్లు నాగరాజు యాదవ్, నాగేంద్రరావు, అవినాష్ పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ సాధించిన నిరుపేద యువకుడు



- అభినందించిన ఎమ్మెల్యే తలసాని
- సహాయ సహకారాలందిస్తానని హామీ

నవతెలంగాణ-బేగంపేట్

పట్టుదలతో శ్రమిస్తే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించడం కష్టమేమీ కాదని అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో నిరుపేద యువకుడు నిరూపించారు. సికింద్రాబాద్‌లోని బాలం రాయ్ కు చెందిన మంచోళ్ల సాయి కుమార్ ఈ నెల 10 నుండి 13వ తేదీ వరకు మలేషియాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో పాల్గొని 70 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్‌ను సాధించాడు. ఈ పోటీలలో 20 దేశాలకు చెందిన సుమారు 200 మంది వరకు పాల్గొన్నారు.

మాజీమంత్రి తలసాని అభినందనలు

గోల్డ్ మెడల్ సాధించిన సాయి కుమార్‌ను మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. శనివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసంలో ఎమ్మెల్యేను సాయి కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి తనకు లభించిన గోల్డ్ మెడల్, మెమెంటో, కప్‌లను చూపారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగరానికి గుర్తింపు తీసుకురావడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఇంకా మరెన్నో పోటీలలో పాల్గొనాలని, మరిన్ని అవార్డ్ లను గెలవాలని ఆశీర్వదించారు. ఉన్నత స్థాయిలో రాణించే విధంగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ బన్సీలాల్ పేట డివిజన్ నాయకులు తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో బుక్స్, యూనిఫామ్ దందాను అరికట్టాలి



- ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, అశోక్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో బుక్స్, యూనిఫామ్ దందాను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డిని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే హైదరాబాద్ జిల్లాలో పలు ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లల్లో అడ్మిషన్లు మొదలుపెట్టారని తెలిపారు.అడ్మిషన్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారని, ఇవే కాకుండా ఈ విద్యా సంవత్సరం ఫీజులు డిక్లేర్ కాకముందే ప్రయివేటు,కార్పొరేట్ స్కూళ్లల్లో 10 శాతం నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచారని చెప్పారు.

ప్రయివేటు కార్పొరేట్ స్కూళ్లల్లో బుక్స్ యూనిఫామ్స్ పేరుతో ఎల్కేజీకి రూ. 10,000 నుండి రూ 20వేల వరకు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ స్కూళ్లల్లో బుక్స్ యూనిఫామ్స్ అమ్ముతున్నారని విద్యాశాఖ అధికారులకు తెలియజేసినా చూసి చూడనట్టే ఉంటున్నారని, కావున ఇట్టి స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్ ,శ్రీమన్ పాల్గొన్నారు.

తీపి జ్ఞాపకాలు, కథలను గుర్తుచేసే ప్లేట్లు, టీ కప్పులు

- త్రిషాలా సుశాంత్ అగర్వాల్స్



నవతెలంగాణ-బంజారాహిల్స్

మీ భోజన పల్లాలు,టీ కప్పులు,ట్రేలు,టేబుల్‌వేర్ కథలు చెప్పగలవని, ఆహారం తినడానికి లేదా అందించడానికి ఉపయోగించే కత్తులు,ఫోర్కులు స్పూన్లు కూడా తీపి జ్ఞాపకాలతో పాటు ఎన్నో కథలను గుర్తుచేస్తాయనీ ఫ్లాగ్‌షిప్ స్టోర్ త్రిషాలా, సుశాంత్ అగర్వాల్స్ దంపతులు తెలిపారు. ఒక జంట సహ-స్థాపన చేసిన సిటీ స్టార్టప్ ప్రత్యేకమైన టేబుల్‌వేర్‌లతో కూడిన ఓకే స్టోరును నగరంలో ప్రారంభిస్తున్నట్టు వారు ప్రకటించారు. శనివారం వారు మాట్లాడుతూ క్రాకరీ,కట్లరి,ప్రాచీన భారతీయ కథలను చెబుతున్నాయని, అంతే కాకుండా తెరమరుగైన ప్రాచీన కళలతో కూడిన టేబుల్వేర్ ఇప్పుడు అందరిని ఆశ్చర్యచకితులను చేస్తూ అవి భారతీయ వివాహ వ్యవస్థకు సంబంధించిన చిత్రాలతో భారతదేశ గత వైభవం గురించి కథలు చెబుతు న్నాయని తెలిపారు. ఆ దంపతులిద్దరూ రూపొందించిన అమూల్యం హైదరాబాద్‌లోని తమ తొలి ఫ్లాగ్‌షిప్ స్టోర్ ద్వారా ప్రత్యేకమైన వివాహ బహుమతులు టేబుల్‌వేర్‌లను అందించడానికి సోమవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి,సామాజిక,పరోపకారి పింకీ రెడ్డి లు లాంఛనంగా ప్రారంభించనున్నారాని వివరించారు.

గ్లోబల్ యాక్సెసిబిలిటీ అవేర్‌నెస్ డే



నవతెలంగాణ-బంజారా హిల్స్

ఆచరాణాత్మక ప్రాప్యతపై కేంద్రీకరణతో ఎల్‌వీపీఈఈ సమగ్ర డిజిటల్ పరిసరాలను సమర్థిస్తూ ఇన్స్టిట్యూట్ ఫర్ విజన్ రీహాబిలిటేషన్,హల్లోఎ11వై కమ్యూనిటీ సంయుక్తంగా గ్లోబల్ యాక్సెసిబిలిటీ అవేర్‌నెస్ డే (జీఏఏడీ) 2024ను నిర్వహించారు. అందరికీ మరింత సమగ్రమైన డిజిటల్ వాతావరణాన్ని రూపొందించడానికి వీలుకల్పిస్తూ, మరింత అందుబాటులో ఉండగల వెబ్‌సైట్‌లు,ఈ-కామర్స్ సైట్‌లు పీడీఎఫ్ లు రూపొందించడంలో ఇది ఎంతో సహకారకంగా నిలువనుందని అంతర్దృష్టుల వేదిక ఏర్పాటు చేసుకున్నట్టు చెప్పారు. "హల్లోఎ11వై కమ్యూనిటీ సహకారంతో ఇటువంటి విజయవంతమైన కార్యక్రమాన్ని నిర్వహించడం మాకెంతో ఆనందదాయకంగా ఉన్నదనీ నిపుణులను వాటాదారులను ఒకచోటికి తీసుకురావడంద్వారా మే ము ప్రాప్యతగురించిన సంభాషణను ముందుకు తీసుకువెళ్లడం,మరింత సమ గ్ర సమాజం దిశలో స్పష్టమైన చర్యలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకు న్నాం' అని నెట్వర్క్ అసోసియేట్ డైరెక్టర్ -విజన్ రీహాబిలిటేషన్, ఇన్స్టిట్యూట్ ఫర్ విజన్ రీహాబిలిటేషన్,డా బ్యూలా క్రిస్టీ తెలిపారు.

గ్లోబల్ యాక్సెసిబిలిటీ అవేర్‌నెస్ డే అనేది డిజిటల్ డిజైన్ అభివృద్ధి అన్ని అంశాలలో అందుబాటుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం గురించి కీలక మైన జ్ఞాపికగా పనిచేస్తుందన్నారు.ఇలాంటి కార్యక్రమాలు అవగాహన పెంచ డమే కాకుండా అందరికీ మరింత సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మించే దిశలో దృఢమైన చర్యలను ప్రేరేపిస్తాయనీ వివరించారు. కార్యక్రమంలో బారియర్ బ్రేక్, ఎపెక్స్ కోవాంటేజ్, గ్రెయిల్మేకర్ ఇన్నోవేషన్స్, హల్లోఎ11వై, డిజిట ల్ఎ11 వై నుంచి విభిన్న వక్తలు ఉపన్యాసాలు వెలువరించారు. ప్రాప్యతపై తమ నైపుణ్యం అంతర్దృష్టులను ఈ విశిష్ట వక్తలు పంచుకున్నరాని సమగ్ర సమాజాన్ని నిర్మించడంలో లోతైన అవగాహనకు గణనీయంగా తోడ్పడ్డయని వివరించారు. www.helloa11y.com డిజిటల్ అందుబాటులోకి తీసుకొనివచ్చారు.

అద్దెకు తీసుకున్న వాహనాలకు డబ్బులు చెల్లించాలి



- రాష్ట్ర క్యాబ్స్ ప్రొటెక్టే ట్రేడ్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం. నరేష్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎలక్షన్స్ అయిపోయి 15రోజులు కావొస్తున్నా అద్దెకు తీసుకున్న మోటారుక్యాబ్ వాహనాల డబ్బులు రవాణాశాఖ, జీహెచ్ఎంసీ అధికారులు చెల్లించ లేదని, కావున డబ్బులు వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర క్యాబ్స్ ప్రొటెక్టే ట్రేడ్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం. నరేష్, నాయకులు సోమాజి, హరికృష్ణ డిమాండ్ చేశారు. రవాణా శాఖ జాయింట్ కమీషనర్‌కు శనివారం వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బులు చెల్లించకపోవడంతో డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. 15 రోజులు గా డబ్బులు చెల్లించాలని అడిగితె స్పందించకపోవడంతో కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. అద్దెకు తీసుకున్న వాహనాలకు డబ్బులు చెల్లించాలని, అవసరం అయితే ఎలక్షన్ కమిషనర్‌ను కలిసి చెబుతామన్నారు. ముఖ్యంగా అంబర్‌పేట, మలక్‌పేట, కొండాపూర్ రవాణాశాఖ కార్యాలయాల్లో అద్దె డబ్బులు ఇవ్వలేదని తెలిపారు డబ్బులు ఇవ్వని పరిస్థితిలో డ్రైవర్లు రోడ్లమీదకు వచ్చి పోరాటం చేస్తారని హెచ్చరించారు. జీఓ ఎంఎస్ నెం 166 ప్రకారం.. ప్రతీ 10 కిలోమీటర్లకు 1 లీటర్ చొప్పున ఇంధనం ఇవ్వాల్సిందని, కానీ ఇవ్వక ఇబ్బందులకు గురి చేశారని చెప్పారు. కనీస పని గంటలు 8 కంటే కూడా అధికంగా 16గంటలు పని చేయించుకున్నారని కావున అధిక పని గంటలకు కూడా గంటకు రూ. 250 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి ఘన సన్మానం



నవతెలంగాణ-సంతోష్ నగర్

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు సం రెడ్డి సురేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ పూల బొక్కే అందజేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

మానసిక స్థితి సరిగ్గా లేని బాలుడు అదృశ్యం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మానసిక స్థితి సరిగ్గా లేని బాలుడు అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న షాహిన్ నగర్,షాజహాన్ కాలనీలో మహమ్మద్ ఫక్రుద్దీన్ తన భార్య ముగ్గురు, కుమారులు ముగ్గురు కుమార్తెలతో నివాసముంటున్నాడు. అందులో 15 ఏండ్ల పెద్ద కుమారుడు సాహజ్ అనుసారి మానసిక స్థితి బాగాలేదు. అతను ఈ నెల 18న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం బంధువులను స్నేహితులను సంప్రదించగా సమాచారం అందకలేదు. దాంతో తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

ఎస్సీ గురుకులాల్లో ఇంటర్‌కు దరఖాస్తులు

- హైదరాబాద్ రంగారెడ్డి ప్రాంతీయ సమన్వయ అధికారిని డాక్టర్ శారద వెంకటేష్

నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్


ఎస్సీ గురుకులాలలో నాన్‌సీఓఈ విద్యాలయాలలో2024-25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌మీడియట్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ఆర్‌సీఓ డాక్టర్ శారద వెంకటేష్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 24 నుండి 31వ తేదీ వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఎంపీసీ బైపీసీ, ఎంఈసీ, సీఈసీ హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులలో సీట్లు ఉన్నాయని దరఖాస్తు రుసుం రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఆమె తెలిపారు.

నగరంలో కొత్త అబ్కారీ పోలీస్ స్టేషన్లు..!

- 4 నెలల్లో అందుబాటులోకి వచ్చే ఛాన్స్
- ఎన్నికల నేపథ్యంలో ఆలస్యం

నవతెలంగాణ-సంతోష్ నగర్

నగరంలో కొత్త అబ్కారీ పోలీస్ స్టేషన్లు త్వరలోనే ఏర్పాటు కాబోతున్నట్టు తెలుస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిలో 12 కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లతో పాటు మరో రెండు (సికింద్రాబాద్, ముషీరాబాద్) స్టేషన్లను విభజన చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో వాటి సంఖ్య 16కు చేరనుంది. సంవత్సర కాలంగా ఈ స్టేషన్ల ఏర్పాటు ముందుకు పడకపోవడంతో మిగతా స్టేషన్లలో పనిచేసే ఎక్సైజ్ సిబ్బంది, అధికారు లపై కేసుల ఒత్తిడి పెరుగుతున్నదని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు డ్రగ్స్, గంజాయి, గుడుంబా, అక్రమ మద్యం సరఫరాపై ఎక్సైజ్ శాఖ సిబ్బంది చేతులు ఎత్తేస్తున్నట్టుగా ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ కొత్త స్టేషన్లు ఏర్పాటైతే అక్రమ మద్యం, గంజా యి, గుడుంబాలపై ఉక్కుపాదం మోపవ చ్చని అబ్కారీ శాఖ అధికారులు చెబుతున్నారు.



గ్రేటర్ పరిధిలో కొత్తగా ఏర్పాటయ్యే పోలీస్ స్టేషన్లలో శంషాబాద్, సరూర్ నగర్, హయత్ నగర్, ఉప్పల్, ఫత్యేనగర్, మల్కాజిగిరి, అమీర్పేట, నాంపల్లి, జూబ్లీహిల్స్, మలక్పేట, కుత్బుల్లాపూర్, లింగంపల్లి స్టేషన్లు ఉన్నాయి. దీంతో పాటు పటాన్‌చెరులో ఎక్సైజ్ సర్కిల్ ఏర్పాటు చేయనున్నారు. అయితే వీటిని ఇప్పటికే ఏర్పాటు చేయాల్సి ఉండగా, కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఆలస్యం అయ్యిందని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి అబ్కారీ సమస్య

ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో ఉన్న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలోనూ పోస్టింగ్ల కోసం ఉన్న తాధికారులతో పాటు మంత్రులు, సీఎంపై కొందరు ఉద్యోగులు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన విషయాన్ని ఎక్సైజ్ ఉన్నతాధికారులు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టుగా తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి సైతం వీటి ఏర్పాటుపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అబ్కారీ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్టుగా సమాచారం. ముఖ్యంగా నగరంలో డ్రగ్స్, గంజాయి, గుడుంబా వంటి వాటికి చెక్ పెట్టాలంటే కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసి సరిపడా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. అబ్కారీ శాఖ నుంచి ప్రతీ సంవత్సరం సుమారుగా రూ. 35 వేల కోట్లపైగా ఆదాయం వస్తున్నది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా 40 ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాలతో పాటు 139 అబ్కారీ పోలీస్ స్టేషన్లు మాత్రమే

కార్మికులను పర్మినెంట్ చేయాలి



- సీఐటీయూ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య

నవతెలంగాణ-వనస్థలిపురం

జీహెచ్ఎంసీ, మున్సిపల్, గ్రామపంచాయతీలలో పని చేసే కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ, మున్సిపల్, జీహెచ్ఎంసీ కార్మికులకు మూడు రోజులు క్లాసులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ రామ్‌కి ఇతర సంస్థలతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ. 26,000/- ఇవ్వాలని, కొత్త పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 5 నుండి 10 వరకు అన్ని జిల్లా జనరల్ బాడీలలో సదస్సు జరపాలని, జూన్ 11 నుండి 15 వరకు జీహెచ్ఎంసీ, మున్సిపల్ గ్రామపంచాయతీలో పనిచేసిన ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ వర్కర్ల వివరాలు అన్ని సేకరించాలని తెలిపారు. అన్ని రంగాల్లో పనిచేసే ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెట్ చేయాలని కోరారు. వారికున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేలకు ఎంపీలకు వినతి పత్రాలు ఇవ్వాలని తెలిపారు. జూన్ 26 నుంచి 27 వరకు జీహెచ్ఎంసీ, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జులై నెల మొదటి వారంలో చలో హైదరాబాద్ జయప్రదం చేయాలని వారు కోరారు.కుత్బుల్లాపూర్ పారిశుధ్య కార్మికులపై అక్కడ ఉన్న ఎస్ ఎఫ్ ఏ సూపర్వైజర్ కిషన్ అనే వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడని, అతని పైన కార్పొరేషన్ అధికారులు, పోలీస్ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపి ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అన్యాయం జరిగిన మహిళా కార్మికురాలికి న్యాయం చేయాలన్నారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఆఫీస్ బేరర్స్ రుద్ర కుమార్, దేవేందర్, సౌత్ జిల్లా కార్యదర్శి ఎం శ్రావణ్ కుమార్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పెంటయ్య, సత్యం, అరుణ్, భాగ్యమ్మ, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిమర్శలు అధికమైతే యాంగ్జయిటీ



- సైకియాట్రిస్ట్ డా.రవ్వ హరి కుమార్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆత్మవిమర్శలు అధికమైతే యాంగ్జయిటీ ఏర్పడుతుందని సైకియాట్రిస్ట్ డా.రవ్వ హరి కుమార్ అన్నారు. ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ - ఇండియా ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్మూలనా మార్గాలు పై ఒక రోజు జాతీయ స్థాయి శిక్షణా శిబిరం డా హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన మానసికాందోళన, సంక్షోభం వల్ల యాంగ్జయిటీ ప్రారంభమవుతుందన్నారు. యాంగ్జయిటీ ఉత్పన్నమయ్యిందంటే, ఆ వ్యక్తి అంతరంగంలో ఒత్తిడి ఏర్పడిందని అర్థమన్నారు. మాట మాటకీ తమను తాము విమర్శించుకునే వ్యక్తులుగా తయారవుతారని తెలిపారు. యాంగ్జయిటీ ఉన్న వారు స్వతహాగా అంతర్వర్తనులై ఉంటారన్నారు. స్వాభావికంగా పిరికివాళ్ళు ద్వేషం, కోపం, రోషం లాంటి ఉద్వేగాలను బయటకు వెలిబుచ్చలేక తమలోనే అణచివేసు కుంటుంటారని చెప్పారు . యాంగ్జయిటీ ప్రజలలో నూటికి ఎనభై శాతం మందిలో కన్పిస్తుందన్నారు. కరోనా తర్వాత ప్రధానంగా అబ్సెస్సివ్, కంపల్సివ్ , పానిక్ డిసార్డర్స్ బాగా పెరిగాయన్నారు . వీటిని గుర్తించడం, ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసు కొని వాటి మూల కారణాన్ని తెలుసుకొని ఎలా నివారించవచ్చో సమస్య నుండి ఎలా బయట పడాలి వివిధ సైకలాజికల్ టెక్నిక్స్ నెగటివ్ థాట్స్ ని పాజిటివ్ థాట్స్ గా ఎలా మార్చాలి, ఎక్స్ పోజర్ అండ్ రెస్పాన్స్ (ప్రివెన్షన్, (ఈఆర్‌పీ), కాగ్నిటివ్ థెరపీ వంటి విధానాలను సైకాలజిస్ట్ లకు నేర్పారు.

తెలంగాణ అధ్యక్షుడు డా.జి.వీరభద్రం మాట్లాడుతూ ఆందోళన వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పూర్తిగా కనుమరుగవుతుందన్నారు.

డా.హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ సైకాలజిస్ట్‌ల్లో నైపుణ్యాలను పెంపొందిస్తే దశదిశలా మానవత్వం పరిమళిస్తుందని డా.హిప్నో కమలాకర్ 2009 నుంచి ఇటు వంటి సదస్సులు నిర్వహించారన్నారు. దానిని కొనసాగింపు లో భాగంగా డా. జి. సమరంతో లైంగిక విజ్ఞానం పై, ఆందోళన నిర్మూలనా మార్గాలు పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇది 6 నెలల కంటే ఎక్కువ కాలం ఉంటుందని ఇతర ఆందోళన రుగ్మతలను పెంచుతుందని తెలిపారు. తల్లిదండ్రుల ప్రేమ, అపేక్షలకు దూరం అవుతామనే బెంగకల్గిన పిల్లలు యాంగ్జయిటీ డిసార్డర్ కులోనయ్యే అవకాశం ఉందని చెప్పారు.

సంఘ సభ్యులు డా.రవ్వ హరి కుమార్ ను ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా.జి. వీరభద్రం, డా.క్యార్లిన్, డా.రఘు, డా.శ్రీనివాస్, షహినా , డా.పి.రమేష్ కుమార్, సంఘం జిల్లా అధ్యక్షుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. తదనంతరం సైకాలజిస్ట్ లకు సర్టిఫికెట్ అందజేసారు.

నగరంలో జాతీయ చేనేత వస్త్ర పరిశ్రమ ప్రదర్శన



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ ,ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ చేనేత వస్త్ర పరిశ్రమ ప్రదర్శనను ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ సందర్శించారు. చేతివృత్తులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలే కాదు వినియోగదారుల పైన ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు





ఉచిత వైద్య శిబిరం





కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగాసుప్రజ హాస్పిటల్, నవతెలంగాణ సాహితీ సంస్థ, శ్రీవిద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి ఎంహెచ్ భవన్‌లోని మల్లు వెంకట నరసింహారెడ్డి ప్రజా వైద్య శాలలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. పలువురు ఈ శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.







డాక్టరేట్ అందుకున్న గ్యాదరి బాలమల్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేషన్ చైర్మెన్ గ్యాదరి బాలమల్లు సామాజిక సేవా రంగంలో డాక్టరేట్ అందుకున్నారు. అమెరికాకు చెందిన గ్లోరీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారు సామాజిక సేవా రంగం కింద గ్యాదరి బాలమల్లుకు డాక్టరేట్‌ను అందించారు. ఏప్రిల్ 28న దుబాయిలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్‌ను యూనివర్సిటీ ప్రతినిధుల చేతుల మీదుగా తీసుకున్నారు. తెలంగాణలో పలు సామాజిక కార్యక్రమాల్లో ముందుండి నడిపించారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో పాల్గొని, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. ఈ సందర్భంగా గ్యాదరి బాలమల్లు మాట్లాడుతూ.. సేవా రంగంలో డాక్టరేట్ ను అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ డాక్టరేట్‌తో తనపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడుతానంటూ స్పష్టం చేశారు.



28 నుంచి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ - ధూల్ పేట్

జియాగూడ శ్రీ రంగనాథ స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ఫౌండర్ ట్రస్ట్ ఎల్బీ చారి, ప్రతినిధి శేషాచార్యులు, అర్చకులు శ్రీనివాస్, రంగనాథ్, బద్రీనాథ్ లు తెలిపారు. శనివారం ఆలయంలో బస్తి సంఘాలు, పలు పార్టీల ప్రతినిధులు తో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈనెల 28 నుంచి 3వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో రోజువారీగా కొనసాగే పూజా కార్యక్రమాలు ఉత్సవాలపై వివరించారు. అన్ని రంగాల అధికారులతో సమన్వయమై ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా కావలసిన జాగ్రత్త చర్యలను తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులతో పాటు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
ఎల్బీనగర్ -మహేశ్వరం
ఆదివారం | మే 26, 2024 | www.navatelangana.com

అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని వినతి



నవతెలంగాణ-సంతోష్‌నగర్

సింగరేణి కాలనీలో రౌద్రీ సొసైటీ వారు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు శనివారం సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీకి వినతి పత్రం అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో సీపీఐ సీనియర్ నాయకుడు శంకర్ నాయక్, డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు దాస్, సీపీఐ నాయకులు దశరథ్ నాయక్, పంథు నాయక్, వంశీ, సుకూర్ పాషా, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది జేసీబీ సాయంతో శనివారం కూల్చివేశారు. అంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని బలిజగూడ రోడ్డు సర్వే నెం. 169, 170, 183,149 లలో చేపట్టిన వాణిజ్య సముదాయాల నిర్మాణాలను, అలాగే పెద్ద అంబర్‌పేటలోని సర్వే నెం. 272, 273లో చేపట్టిన షెడ్డు/ గోడౌన్‌లను, కూల్చివేశారు. పసుమామల గ్రామ రెవెన్యూ సర్వే నెం. 454 లో చేపట్టిన పునాదిని జేసీబీ సాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

• ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

పాఠశాలల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ లో బడంగ్‌పేట్, కుర్మల్ గూడ, ఇంద్రానగర్‌లో గల ప్రైమరీ స్కూల్‌ను, బడంగ్‌పేట్ గ్రంథాలయ బిల్డింగ్ దగ్గరలో నూతనంగా నిర్మించనున్న హైస్కూల్ బిల్డింగు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ బడంగ్‌పేట్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యం కోసం నూతన పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా జేఎన్ఎన్‌యుఆర్ఎం, ఇంద్రానగర్ కాలనీ నుండి కుర్మల్ గూడ పాఠశాలకు విద్యార్థులు వెళ్తున్న కారణంగా అక్కడే స్కూల్ ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ఈ సంవత్సరం జూన్‌లోనే కాలనీలో విద్యార్థులకు పాఠశాలను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు.



ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్లు బీమిడి స్వప్న జంగారెడ్డి, పెద్దబావి శోభ ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భద్రమోని రోహిణి రమేష్, బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాజ్, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, టేకుల భాస్కర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం మీ సేవకుడిగా ముందుంటా



• కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి

నవతెలంగాణ - హయత్ నగర్

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అనునిత్యం మీ సేవకుడిగా ముందుంటానని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధిలోని లక్ష్మీ భవాని కాలనీలో జరుగుతున్న పార్క్ ప్రహరీ గోడ పనులను, బృందావన్ కాలనీలోని తాగునీటి సమస్యను శనివారం కాలనీ సంక్షేమ సభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీ భవాని కాలనీలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ పనులు పూర్తైన తర్వాత మరొక పార్క్ స్థలం వద్ద గేటును నిర్మిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. సీఎస్ ఆర్ కాలనీ నుండి మొదలైన ట్రంక్ లైన్ పనులు ఆగిపోయాయని, వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభిస్తానని భరోసా ఇచ్చారు. బృందావన్ కాలనీలో వారం రోజులుగా తాగునీటి సమస్య ఉందనే విషయాన్ని స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. సంబంధిత జలమండలి అధికారులను పిలిపించి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు ఏఈ రాజు, ఏటీఓ విశ్వనాథ్, నర్సింగ్ రావు కాలనీ సంక్షేమ సభ్యులు నవీన్ రావ్, నరేంద్ర కుమార్, భూపాల్, శ్రీనివాస్ రెడ్డి, రాధకృష్ణ, రవీందర్, ముత్యాలు, భాను, శ్రీనివాస్, శివరామయ్య క్యాదస్ శ్రీను, రామచంద్రయ్య బీజేపీ నాయకులు కడారి యాదగిరి, బాలాజీ, రమేష్ చారి, యాదగిరి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

• కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ - సంతోష్‌నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని పద్మానగర్ కాలనీ, న్యూ పద్మానగర్ నందు ఎస్.ఎన్.డి.పి నిధుల ద్వారా ప్రారంభించిన బాక్స్ టైప్ ట్రాక్ లైన్ నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాలనీవాసులకు ఇబ్బందిగా సీవరేజ్ లైన్లు, కేబుల్స్ లైన్స్, తాగునీటి పైపులైన్‌లను నాలా మధ్యలో లేకుండా నాలా స్లాబ్ కింద నుండి వేయాలన్నారు. వరదనీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రధాన రహదారిపై వరద నీటి కాలువ నిర్మించాలన్నారు. ఇప్పటికే పూర్తిచేసిన ఎస్.ఎన్.డి.పి నాలాకు ఇరువైపులా సీసీ రోడ్డును వెంటనే వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, పద్మానగర్ కాలనీ అధ్యక్షులు జయవర్ధన్ రెడ్డి, వీరారెడ్డి, రామకృష్ణ, ఆంజనేయులు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.




నవతెలంగాణ - సిటీబ్యూరో

ప్రపంచ థైరాయిడ్ దినోత్సవం సందర్భంగా థైరాయిడ్ గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యం అని డాక్టర్ నాగేంద్ర రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ 2007 మే 25 ప్రపంచ థైరాయిడ్ దినోత్సవం అని అన్నారు. థైరాయిడ్ ఒక దీర్ఘకాలిక సమస్య అని, భారత దేశంలో ప్రతి 10 మందిలో ఒకరి కన్నా ఎక్కువ మందికి థైరాయిడ్ సమస్య ఉందని చెప్పారు. థైరాయిడ్ మహిళలో 44.3% డెలివరీ తర్వాత మూడు నెలలో థైరాయిడ్ సమస్య వచ్చే అవకాశం ఉందని.. ఇది మహిళలు, పురుషులలో ఇద్దరిలోనూ వస్తుందని కానీ ఈ సమస్య మగవారి కన్న ఆడవారిలో దాదాపు రెట్టింపు కనిపిస్తుంది అని తెలిపారు.

థైరాయిడ్ అనేది సీతాకోక చిలుక ఆకారంలో కంఠం వద్ద ఉండే ఒక ఎండ్రో క్రైన్ గ్లాండ్, ఇది థైరాక్సిన్ అనే థైరాయిడ్ హార్మోన్‌ను విడుదల చేయడం ద్వారా బాడీలోని అనేక జీవ క్రియలను ప్రభావితం చేస్తుందన్నారు. ఇది అస్తవ్యస్తం అవ్వడం వల్ల పలు సమస్యలు ఎదురవుతాయన్నారు. తగినంత థైరాయిడ్ హార్మోన్ విడుదల కాకపోవడం హైపోథైరాయిడజం, అవసరమైన దానికన్నా ఎక్కువగా థైరాయిడ్ విడుదలడం హైపర్ థైరాయిడ్, విడుదల కావడం థైరాయిడ్ స్పెల్లింగ్ థైరాయిడ్ ట్యూమర్ థైరాయిడ్ క్యాన్సర్ ఉంటాయి, హైపోథైరాయిజం హైపర్థం అనేవి చాలా కామన్‌గా ఉండే థైరాయిడ్ డిజార్డర్స్ అని అన్నారు.



డాక్టర్ నాగేందర్ రెడ్డి



థైరాయిడ్‌పై అవగాహన చాలా ముఖ్యం

ఉప్పును అవసరమైన దానికంటే ఎక్కువ తీసుకోకూడదు..

విటమిన్ 'డి' లోపం వలన కూడా థైరాయిడ్ సమస్య వస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజు కనీసం 15 నిమిషాలైన సూర్యరశ్మి శరీరానికి తగిలే విధంగా చూసుకోవాలని సూచించారు. అంతేకాదు అవిసె గింజలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఉప్పును అవసరమైన దానికంటే ఎక్కువ తీసుకుంటే థైరాక్సిన్ ఎక్కువ ఉత్పత్తి చేసి హైపోథైరాడ్ల కలిగా చేస్తుందన్నారు. ఈ సమస్య ఉన్నవారు రోజుకి ఐదు గ్రాముల ఉప్పును మాత్రమే తీసుకోవాలని కోరారు. వాల్ మార్ట మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది, అది థైరాయిడ్ గ్రంథి పనితీరును మెరుగుపరుస్తుంది, దీంతో థైరాక్సిన్ అవసరం ఉన్నంత మేర శరీరానికి అంది థైరాయిడ్ సమస్య నుండి ఉపశమనం పొందవచ్చు అని వివరించారు. థైరాయిడ్ అదుపులో ఉంచుకోవడానికి సరైన ఆహారపు అలవాట్లను అలవాటు చేసుకోవాలన్నారు. జీవనశైలి హార్మోన్లో అసమతుల్యం అవుతాయి, తద్వారా థైరాయిడ్ వస్తుందన్నారు. మందులతో కంట్రోల్ అవుతుందని అనుకోవడం తప్పు అని చెప్పారు. మందులతో పాటు సరైన ఆహారం తీసుకోవడం వలన ఈ సమస్య నుంచి బయట పడవచ్చు అని పేర్కొన్నారు. థైరాయిడ్ ప్రారంభ లక్షణాలపై శ్రద్ధ వహిస్తే జీవన శైలిలో మార్పు చేసుకోవడం ద్వారా కొన్ని చికిత్సల ద్వారా దీనిని నియంత్రించవచ్చు అని అన్నారు.

ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి..

థైరాయిడ్‌ను అదుపులో ఉంచుకోవడానికి కనీసం ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. థైరాయిడ్ సమస్య ఉన్న మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలని, గర్భం దాల్చిన తర్వాత అబార్షన్ అయ్యే అవకాశాలు ఉంటాయి కాబట్టి ఎప్పటికప్పుడు డాక్టర్లను సంప్రదిస్తూ ఉండాలని సూచించారు. గర్భవతిగా ఉన్నప్పుడు బిడ్డ ఎదుగుదల కోసం థైరాయిడ్ మాత్రలు వేసుకోవాలన్నారు. పుట్టినప్పుడు కూడా పిల్లలకు థైరాయిడ్ టెస్ట్ చేయించాలి, ఎందుకంటే కొంతమందికి ఒక్కోసారి పుట్టుకతోనే సమస్య వస్తుందని అన్నారు.

ఒత్తిడికి దూరంగా ఉండాలి..ధ్యానం అలవాటు చేసుకోవాలి

థైరాయిడ్‌ను పూర్తిగా నయం చేయలేమని, దీనిని మందులు ద్వారా జీవన శైలిలో మార్పుల ద్వారా నియంత్రించుకోవచ్చు అని అన్నారు. థైరాయిడ్ బాధితులు ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. మానసిక, శారీరక ఒత్తిడి వలన మీ శరీరంలో మంటను పెంచుతుందన్నారు. ఒత్తిడి తొలగించుకోవడానికి ధ్యానం అలవాటు చేసుకోవాలని సూచించారు. మంచి పోషక ఆహారం తీసుకోవడం, ఆహారంలో తగినంత కాల్షియం, ప్రోటీన్స్, అయోడిన్, మెగ్నీషియం ఉండటం వలన మీ థైరాయిడ్ పనితీరు మెరుగ్గా ఉంటుందన్నారు. ఇవి కాకుండా థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు విటమిన్ ఏ, బి, సి అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం మంచిదన్నారు. ముఖ్యంగా వ్యాయామం ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. క్యాబేజీ, క్యాలీఫ్లవర్, పాలకూర, ముల్లంగి, సోయాబీన్స్, స్ట్రాబెరీస్‌లు తినడం తగ్గించాలి అన్నారు. ముఖ్యంగా పాలు, చీజ్, మాంసం, చేపలు, ఖర్జూరం, గుడ్లు తెల్లసన, పీచు పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని వివరించారు.

త్రినేత్ర ఆంజనేయ స్వామి జాతర ప్రారంభం

ఆలయ కమిటీ చైర్మెన్ పెండ్యాల శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ - వనస్థలిపురం

త్రినేత్ర ఆంజనేయ స్వామి జాతర ఉత్సవాలు సాహెబ్ నగర్ గ్రామం హయత్ నగర్ మండలంలో శనివారం ప్రారంభమైనట్టు ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25, 26, 27 తేదీల్లో రుద్రహోమం, రథోత్సవం, పల్లకి ఊరేగింపు చివరి రోజున మహా అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి మురళీకృష్ణ, ధర్మకర్త మండలి సభ్యులు బొమ్మిడి జంగారెడ్డి, నీళ్ల కృష్ణ గౌడ్, పరమేష్ గౌడ్, బంటు లక్ష్మి, ఎర్రవెల్లి బాలాచారి, జి.పృథ్వీరాజ్ గౌడ్, ఆలయ పూజారులు దీన్ దయాల్ త్రివేది, శంకర్ త్రివేది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

కౌన్సిలర్ లక్ష్మీనారాయణ



నవతెలంగాణ- బడంగ్ పేట్

శ్రీరాం కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని 18వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనే మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. శ్రీరామ కాలనీ పరిధి శ్రీరామహిల్స్ ప్రజలకు మంచినీటి సౌకర్యార్థం 500 మీటర్ల పొడవున పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ ఆలయ ఏడో వార్షికోత్సవంలో సబితమ్మ

నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లేనిన్ నగర్ హనుమాన్ దేవాలయం ఏడవ వార్షికోత్సవాన్ని ఆలయ చైర్మన్ దిండు రాజు గౌడ్, వైస్ చైర్మన్ జేటావత్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పి. రాజ్ కుమార్, ఆర్. మోహన్ నాయక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్



భర్త వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం మన్నెగూడ గ్రామానికి చెందిన పారిజాత(32)ను అబ్దుల్లాపూర్ మెట్ మండలం, అనాజీ పూర్ గ్రామానికి చెందిన నార్లకొండ మహేందర్ తో 14 సంవత్సరాల కిందట వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమారులు సాయిరాం, విష్ణు. మహేందర్, పారిజాత వివాహం తర్వాత రెండు సంవత్సరాల వరకు అన్యోన్యంగా ఉన్నారు. ఈ క్రమంలో భర్త నార్లకొండ మహేందర్ మద్యానికి బానిస కాగా దంపతుల మధ్య కలహాలు మొదలయ్యాయి. భర్త మహేందర్ తరచుగా మద్యం తాగివస్తూ ప్రతి చిన్న విషయానికి గొడవ పడుతూ భార్యను కొట్టడం, తిట్టడం, మానసికంగా వేధించేవాడు. పలుమార్లు పారిజాత కుటుంబ సభ్యులు, బంధువులు మహేందర్‌కు సర్ది చెప్పారు. కానీ అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోగా వేధింపులు మరింత ఎక్కువ కావడంతో పది రోజుల కిందట మళ్ళీ కుటుంబ సభ్యులు అతనికి సర్ది చెప్పారు. చివరకు భర్త వేధింపులు భరించలేక శుక్రవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అప్పటికి చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతురాలు అన్న గునుకుల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

> కుటుంబ సభ్యులు సర్ది చెప్పినా
> భర్త ప్రవర్తనలో రాని మార్పు
> తాగిన మత్తులో వేధింపులు
> పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు

రాష్ట్ర మంత్రులను కలసిన ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవ తెలంగాణ- నాగోల్

తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబులను శనివారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్త మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస గుప్త వారిని శాలువాలతో సత్కరించి.. జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వైశ్య కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రకటించడం, కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించడం పట్ల ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించినందుకు మంత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. పేద వైశ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. వైశ్యులలో ఉన్న పేదలను గుర్తించి వైశ్య కార్పొరేషన్ ద్వారా గాని ప్రభుత్వం ద్వారా గాని ఆర్థికంగా ఆదుకోవాలని, వ్యాపారంలో స్థిరపడి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని మంత్రులను కోరారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకనే గెలిపించాలి

• బీఆర్ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్

నవతెలంగాణ - బడంగ్‌పేట్

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకనే గెలిపించాలని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న ఎర్రగుంటలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం 6 నెలల్లోనే బట్టబయలైందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేదని, నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. నిరుద్యోగ భృతి గురించి అడిగితే హామీనే ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ బుకాయిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీళ్లు, కరెంటు మాయమయ్యాయని, కేసీఆర్ కిట్లు బంద్ అయ్యాయని అన్నారు. ఇంకెన్ని రోజులు మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టుకుంటూ కాంగ్రెస్ నేతలు బతుకుతారని మండిపడ్డారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓడిస్తేనే కాంగ్రెస్‌కు కనువిప్పు కలుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేయిస్తుందని, కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుడి హత్య వీరి దివాలా కోరుతనానికి నిదర్శనమని ఆరోపించారు. మా సహనాన్ని పరీక్షించవద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులను హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ తమ వైఖరి మార్చుకోకుంటే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తగిన గుణపాఠం నేర్పుతారని అన్నారు.

తొలి తెలుగు మహిళగా..



తెలుగు ప్రజలు ఎందరో తమ కలలు నెరవేర్చుకునేందు రెక్కలు కట్టుకొని విదేశాలకు ఎగిరిపోతున్నారు. ఉద్యోగం, వ్యాపారం, ఉన్నత విద్య... ఇలా రకరకాల కారణాలతో విదేశాల్లో స్థిరపడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. అలా అమెరికాలో స్థిరపడ్డ తెలుగు వారిలో చాలా మంది ఉద్యోగాలు, వ్యాపారాలకే పరిమితం కాకుండా అక్కడి రాజకీయాల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో, న్యాయస్థానాల్లోనూ తమ సత్తా చాటుకుంటున్నారు. అలాంటి వారి జాబితాలో విజయవాడకు చెందిన జయ బాడిగ కూడా చేరిపోయారు. అమెరికా కాలిఫోర్నియాలోని శాక్రమెంటో కౌంటీ సుపీరియర్ కోర్టు జడ్జిగా నియమితులయ్యారు. దాంతో.. కాలిఫోర్నియాలో ఓ కోర్టు జడ్జిగా అపాయింట్ అయిన తొలి తెలుగు వ్యక్తిగా అరుదైన ఘనత సాధించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ పదవికి ఎంపికైన తొలి తెలుగు మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు.

కృష్ణాజిల్లాకు చెందిన జయ తల్లి బాడిగ ప్రేమలత, గృహిణి. తండ్రి ప్రముఖ పారిశ్రామికవేత్త, మచిలీపట్నం మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ. ఈ దంతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు వున్నారు. వీరిలో జయ మూడో కూతురు. జయ పుట్టింది విజయవాడలో అయినా పెరిగింది మొత్తం హైదరాబాద్‌లోనే. 'నేను సికింద్రాబాద్‌లోని సెయింట్ ఆన్స్‌లో చదివాను. మిషనరీ పాఠశాల కావడంతో సామాజిక సేవపై అవగాహన కలిగింది. అలాగే మా నాన్న నుండి కూడా కొంత నేర్చుకున్నాను. చిన్నప్పటి నుండి సమాజం గురించి ఆలోచించడం అలవాటు. నేను లా చదవాలనేది మా అమ్మ కోరిక. అప్పట్లో నన్ను బయట దేశాలకు పంపడం మా నాన్నకు ఇష్టం లేదు. అందుకే ఉస్మానియాలో పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ చేశాను' అంటూ ఆమె తన చిన్నతనం గురించి వివరించారు.

వృత్తి జీవితంలో సవాళ్లు

'సమాజంలో ప్రతి చోట లింగ వివక్షతో సహా అనేక సవాళ్లు ఉన్నాయి. లాయర్‌గా తొలినాళ్లలో నాకు అమెరికన్ ఇంగ్లీష్ సరిగ్గా వచ్చేది కాదు. అక్కడి వారంతా నన్ను ఆటపట్టించేవారు. దీంతో మరింత పట్టుదలతో పని చేయడం ప్రారంభించాను. నన్ను నేను నిరూపించుకున్నాను. సామాన్యులు కోర్టు ఖర్చులు భరించలేరు. అంతేకాదు విడాకుల కేసుల్లో పిల్లలు అనేక ఇబ్బందులు పడుతుంటారు. అందుకే వీలైనంత వరకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ చేసేదాన్ని. ప్రజలకు నిజమైన న్యాయం జరగాలని కోరుకుంటున్నాను' అంటూ జయ వివరించారు.

మహిళల సమస్యలపై...

డిగ్రీ తర్వాత జయ అమెరికా వెళ్లి బోస్టన్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్ విభాగంలో ఎంఏ పూర్తి చేశారు. ఆ తర్వాత 'డబ్ల్యూఈవీఈ'(మహిళలు హింసాత్మక వాతావరణం నుండి తప్పించుకోవడం) అనే స్వచ్ఛంద సంస్థలో కొన్నేండ్లు పని చేశారు. అక్కడ మహిళల సమస్యలపై లోతైన అధ్యయనం చేశారు. 'ముఖ్యంగా మన దేశం నుంచి వచ్చే మహిళలకు అక్కడి కోర్టులు, చట్టాల గురించి పెద్దగా అవగాహన లేదు. స్థానిక మహిళలకు కూడా అనేక సమస్యలు ఉన్నాయి. పిల్లలు లైంగిక దాడులకు గురయ్యేవారు. ఇదంతా విన్నాక నేను లా ఎందుకు చదవకూడదు అనుకున్నాను. అందుకే శాంటా క్లారా యూనివర్సిటీలో లా డిగ్రీలో చేరాను' అంటూ ఆమె పంచుకున్నారు.



కుటుంబ సహకారంతోనే...

'నా భర్త ప్రవీణ్ అప్పట్లో ఇంటెల్‌లో హార్డ్‌వేర్ ఇంజనీర్. లా చేస్తున్నప్పుడే పాప పుట్టింది. దాంతో కాలిఫోర్నియా బార్ పరీక్షలకు సిద్ధం కావడం కష్టంగా అనిపించింది. అందుకే పాపను ఇండియా తీసుకెళ్ళి అమ్మ దగ్గర వదిలిపెట్టి పరీక్షలు రాశాను. పరీక్ష ముగిసిన వెంటనే పాపను తీసుకొచ్చారు. రిజల్ట్ రోజు చాలా టెన్షన్ పడ్డాను. పాపను ఒడిలో పెట్టుకొని ల్యాప్‌టాప్ తెరిచాను. బార్ కౌన్సిల్ రిజిస్టర్‌లో నా పేరు చూడగానే రిలాక్స్ అయ్యాను. కుటుంబ సహకారంతోనే ఇది సాధ్యమయింది' అంటూ ఆమె పంచుకున్నారు. జయ 2009లో కాలిఫోర్నియా స్టేట్ బార్ ఎగ్జామ్ క్లియర్ చేసి పదేండ్లకు పైగా న్యాయవాద వృత్తిలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేశారు. యూఎస్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రయిల్ అడ్వకేసీలో ఫ్యాకల్టీ మెంబర్‌గా వ్యవహరించారు. మెక్‌జార్జ్ స్కూల్ ఆఫ్ లాలో అధ్యాపకురాలిగా కూడా పని చేశారు.

మన జీవితం తెరచిన పుస్తకం

అమెరికాలో న్యాయమూర్తులను ఎంపిక చేసే విధానం గురించి మాట్లాడుతూ 'ఇది చాలా కష్టం. నేను 2021లో దరఖాస్తు చేసుకున్నాను. ఫలితాలు ఇప్పుడు వెలువడ్డాయి. దరఖాస్తు పూర్తి చేయడానికి రెండు నుండి మూడు నెలలు పడుతుంది. మన హాబీలతో మొదలుపెట్టి మన స్కూల్, కాలేజీ రోజుల గురించి రాయాలి. లాయర్‌గా మీరు ఎలాంటి కేసులు డీల్ చేశారు? చేసిన కేసుల్లో కనీసం 75 గురించి అందులో ప్రస్తావించాలి. దరఖాస్తు పూర్తయ్యే సరికి మన జీవితం తెరిచిన పుస్తకంలా అనిపిస్తుంది. ఆ వివరాలన్నీ తనిఖీ చేసి, నామినేట్ చేసే న్యాయ కమిటీకి పంపుతారు. తర్వాత మరో బృందం పరిశీలన చేస్తుంది. మేం పేర్కొన్న 75 మందితో పాటు మొత్తం 250 మందిని విచారిస్తారు. ఆ తర్వాత ఇంటర్వ్యూ. వారిలో ఎవరైనా ఏదైనా నెగిటివ్‌గా చెబితే ఇంటర్వ్యూలో దాని గురించి అడుగుతారు. వారు ఒప్పుకున్న తర్వాత గవర్నర్‌కు పంపుతారు. అవసరమైతే మరో ఇంటర్వ్యూ' అంటూ వివరించారు.

ఫ్యామిలీ లా నిపుణురాలిగా

2018లో కాలిఫోర్నియా గవర్నర్ కార్యాలయంలోని అత్యవసర సేవల విభాగంలో బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే 2020లో కాలిఫోర్నియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ కేర్ సర్వీసెస్‌లో అటార్నీగా కూడా పనిచేశారు. 2022 నుంచి శాక్రమెంటో సుపీరియర్ కోర్టు కమిషనర్‌గా వ్యవహరిస్తూ కాలిఫోర్నియాలో ఫ్యామిలీ లా నిపుణురాలిగా మంచి గుర్తింపు పొందారు. కుటుంబ న్యాయ సలహాల రంగంలో పలువురికి మార్గదర్శకురాలిగానూ వ్యవహరించారు. అయితే శాక్రమెంటో సుపీరియర్ కోర్టు జడ్జి రాబర్ట్ లాఫమ్ పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆ స్థానంలో జయ జడ్జిగా నియమితులయ్యారు. ఇప్పటికే.. ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో మన తెలుగు ప్రజలు కీలకమైన పదవులు సొంతం చేసుకున్నారు. ఇప్పుడు వారి సరసన జయ కూడా చేరారు.



తెలుగు వెలుగును చాటారు

శాంక్రామెంటో కౌంటీ సుపీరియర్ కోర్టు న్యాయమూర్తిగా నియమితురాలైన తర్వాత ఆమె తెలుగులో ప్రమాణ స్వీకారం చేసి తెలుగు వెలుగును చాటారు. ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో ఆమె తెలుగులో మాట్లాడడం అందరినీ ఆకర్షించింది. తన మాతృభాష తెలుగు మీద తనకున్న అభిమానాన్ని తాను ఇలా చాటాకున్నాని చెప్పారు. ప్రమాణ స్వీకార ప్రసంగాన్ని ప్రారంభిస్తూ ఆమె 'గుడ్ ఆఫ్టర్‌నూన్ ఎవరీవన్... మీ అందరికీ నా హృదయపూర్వక స్వాగతం' అన్నారు. ఈ గొప్ప సందర్భంలో తన మాతృభాషలో మాట్లాడ్డం తనకు చాలా సంతోషాన్ని కలిగించే విషయం అని భావోద్వేగంతో చెప్పారు. ఇలాంటి సందర్భాలలో తెలుగును మాట్లాడ్డం మొదటిసారి అంటూ తన భావాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఓ సంస్కృత శ్లోకాన్ని కూడా అక్కడి వారికి వినిపించారు. అమెరికాలో ఉన్నత స్థానానికి ఎదగడమే కాకుండా అక్కడ తెలుగు వెలుగును ప్రసరింపజేసిన జయను తెలుగు ప్రజలు, ప్రముఖులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. ■

పిల్లల పెంపకం

'వాస్తవానికి ఉద్యోగ బాధ్యతలు, పిల్లల పెంపకం సమతుల్యం చేయడం చాలా పెద్దపని. మొదట్లో అమ్మ, అమ్మమ్మ నాకు సపోర్ట్‌గా ఉన్నారు. ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్లయ్యారు. స్వతంత్ర్యంగా బతకగలరు. అయితే ఇక్కడి బాలల చట్టాలపై మన తెలుగు వారికి అవగాహన లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వాటిపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాను. మా పిల్లలకు కూడా మన తెలుగు సంప్రదాయాలు నేర్పుతుంటాను. ఒక తల్లిగా వారి అవసరాలన్నింటినీ చూసుకుంటాను. ఏ స్థాయిలో ఉన్నా కుటుంబ జీవితంలోనే నిజమైన ఆనందం లభిస్తుంది' అంటున్నారు జయ.

పంటి నొప్పి బాధిస్తే...

చాలా మందిని వేధించే సమస్య పంటి నొప్పి. దంతాలు పుచ్చిపోవడం, ఇన్ఫెక్షన్, దంతాల్లో పగుళ్ల రావడం, చిగుళ్ల వ్యాధులు తదితర కారణాల వల్ల పంటి నొప్పి వస్తుంది. ఒక్కసారి పంటి నొప్పి వచ్చిందంటే ఒక పట్టాన తగ్గదు. దీంతో బాధ భరించలేక చాలా మంది డాక్టర్‌ను ఆశ్రయిస్తుంటారు. ఈ కింది చిట్కాలు పాటించడం వల్ల పంటి నొప్పి నుంచి ఉపశమనం పొందొచ్చు.



లవంగాలతో పంటి నొప్పికి ఉపశమనం పొందవచ్చు. లవంగాల్లో ఉండే యుగేనల్ అనే రసాయన పదార్థం తేలికపాటి మత్తును కలిగిస్తుంది. నొప్పి వచ్చే దంతం దగ్గర లవంగాన్ని ఉంచి కొద్దికొద్దిగా నమలడం వల్ల అందులోని నూనె విడుదలై పంటి నొప్పి తగ్గుముఖం పడుతుంది. మార్కెట్లో లభించే లవంగ నూనెను నొప్పి వచ్చే చోట రాసినా ఫలితం ఉంటుంది. లవంగం నూనెను నేరుగా రాయకుండా.. దూదిపై రెండు చుక్కలు వేసి నొప్పి వచ్చే దంతాలపై ఉంచాలి.

వేడి నీటిలో ఉప్పు వేసి కరిగాక పుక్కించాలి. ఇలా చేయడం వల్ల సహజ మైన యాంటి సెప్టిక్‌లా పని చేస్తుంది. కనీసం 30 సెకన్లపాటు ఉప్పు నీటిని పుక్కిలించాక ఉమ్మేయడం వల్ల దంతాల చుట్టూ పేరుకుపోయిన వ్యర్థాలు బయటకు వెళ్తాయి. ఇన్ఫెక్షన్ పెరగకుండా కూడా చూసుకోవచ్చు. రోజూలో వీలైనన్ని సార్లు ఇలా పుక్కిలించడం వల్ల సూక్ష్మ జీవులు నశించి నొప్పి తగ్గుముఖం పడుతుంది.

ఐస్ క్యూబ్‌లను ప్లాస్టిక్ బ్యాగ్‌లో వేసి పలుచటి గుడ్డతో చుట్టాలి. నొప్పి పెట్టే పంటిపై ఈ బ్యాగ్‌తో నెమ్మదిగా ఒత్తడం వల్ల ఫలితం ఉంటుంది.

వెల్లుల్లిలో యాంటి బయోటిక్ గుణాలు అధికంగా ఉన్నాయనే సంగతి తెలిసిందే. ఇవి తీవ్రమైన పంటి నొప్పి నుంచి కూడా ఉపశమనం కలిగిస్తాయి. వెల్లుల్లిని దంచి.. టేబుల్ సాల్ట్ లేదా మిరియాలతో కలిపి నొప్పిని కలిగించే పంటిపై ఉంచడం వల్ల చక్కటి ఫలితం లభిస్తుంది.

రోజూ రెండుసార్లు బ్రష్ చేసుకోవడం, తీపి పదార్థాల జోలికి పోకపోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మరీ చల్లగా ఉండే ద్రవాలను తాగకపోవడమే ఉత్తమం.

జూన్ 1 నుంచి బడిబాట

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం 229 పనిదినాలుంటాయని తెలిపింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 23 పాఠశాలలకు చివరి పనిదినమని స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను శనివారం విడుదల చేశారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుంటాయని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి పదో తేదీ వరకు పదో తరగతి విద్యార్థులకు సిలబస్‌ను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 28 వరకు ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలల్లో ప్రార్థన (అసెంబ్లీ) ముగిసిన తర్వాత ప్రతిరోజూ ఐదు నిమిషాలపాటు యోగా, ధ్యానం చేయాలని కోరారు. వచ్చే విద్యాసంవత్సరంలో బ్యాగ్‌లేని రోజులు పది ఉంటాయని వివరించారు. ప్రతినెల మూడో శనివారం తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం నిర్వహించాలనీ, గ్రీన్ అవర్, బాలసభ జరపాలని సూచించారు.

జులై 31 నాటికి ఎఫ్ఏ-1 పరీక్షలు

రాష్ట్రంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు జులై 31 నాటికి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ-1) పరీక్షలను నిర్వహించాలని బుర్రా వెంకటేశం తెలిపారు. సెప్టెంబర్ 30 నాటికి ఎఫ్ఏ-2 పరీక్షలు జరపాలని పేర్కొన్నారు. అక్టోబర్ 21 నుంచి 28 వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-1) పరీక్షలుంటాయని వివరించారు. డిసెంబర్ 17 నాటికి ఎఫ్ఏ-3 పరీక్షలుంటాయని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 29 నాటికి పదో తరగతి విద్యార్థులకు ఎఫ్ఏ-4 పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 28 నాటికి ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎఫ్ఏ-4 పరీక్షలుంటాయని వివరించారు. ఏప్రిల్ తొమ్మిది నుంచి 19 వరకు ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీలోపు పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలను చేపడతామని పేర్కొన్నారు. మార్చిలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలుంటాయని వివరించారు.

పండుగ సెలవులు

దసరా సెలవులు అక్టోబర్ 2 నుంచి 14 వరకు (13 రోజులు)
క్రిస్మస్ సెలవులు (మిషినరీ స్కూళ్లకు) డిసెంబర్ 23 నుంచి 27 వరకు (ఐదు రోజులు)
సంక్రాంతి సెలవులు జనవరి 13 నుంచి 17 వరకు (ఐదు రోజులు)

అకడమిక్ క్యాలెండర్‌లో ముఖ్యాంశాలు

- జూన్ 1 నుంచి 11 వరకు బడిబాట కార్యక్రమం
- జూన్ 12 నుంచి బడులు పున:ప్రారంభం
- జులై 31 నాటికి ఎఫ్ఏ-1 పరీక్షలు
- సెప్టెంబర్ 30 నాటికి ఎఫ్ఏ-2 పరీక్షలు
- అక్టోబర్ 21 నుంచి 28 వరకు ఎస్ఏ-1 పరీక్షలు
- డిసెంబర్ 17 నాటికి ఎఫ్ఏ-3 పరీక్షలు
- జనవరి 29 నాటికి పది విద్యార్థులకు ఎఫ్ఏ-4 పరీక్షలు
- ఫిబ్రవరి 28 నాటికి 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఎఫ్ఏ-4 పరీక్షలు
- ఏప్రిల్ 9 నుంచి 19 వరకు ఎస్ఏ-2 పరీక్షలు
- ఫిబ్రవరి 29కి ముందే టెన్త్ ప్రీ ఫైనల్
- మార్చిలో టెన్త్ పరీక్షలు
- స్కూళ్లకు చివరి పనిదినం ఏప్రిల్ 23
- ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు

ఉత్తమ నటిగా తొలి భారతీయ నటి అనసూయ సేన్‌గుప్తా

(మొదటిపేజీ తరువాయి)

సెక్స్ వర్కర్ కథగా చిత్రీకరించారు. ప్రపంచవ్యాప్తంగా తమ హక్కుల కోసం ధైర్యంగా పోరాడినందుకు ఈ అవార్డును "క్వీర్ కమ్యూనిటీ, ఇతర అట్టడుగు వర్గాలకు" అంకితం ఇస్తున్నట్టు కోల్‌కతాకు చెందిన అనసూయ సేన్‌గుప్తా తెలిపారు. శనివారంతో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ముగిశాయి.

ఎన్డీఎస్ఏ సిఫారసులు అమలు చేయలేం

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలతో పరీక్షలు చేపట్టి మరమ్మతులు చేయాలని చెప్పింది. కాగా బ్యారేజీ భౌతిక పరిస్థితులు అందుకు సహకరించడం లేదని సాగునీటిపారుదల శాఖ ఉన్నతాధి కారులు అంటున్నారు. సమయాన్ని ఆదా చేసేందుకు ఒక్కో ఏజెన్సీకి ఒక్కో బ్యారేజీ అప్పగించి టెస్టులు చేయించాలని ఎన్డీఎస్ఏ చెప్పిన విషయమూ విదితమే. వర్షాల కారణంగా ఇప్పుడు ఆ పనిచేసే అవకాశం లేదని తెలిసింది. ప్రస్తుతం కేవలం డ్యామ్ భద్రతా చర్యలకు పరిమితం కావాలని నీటిపారుదల శాఖ భావిస్తున్నది. మేడిగడ్డ పనులు ఎల్అండ్‌టీ కంపెనీ, అన్నారం పనులు ఆఫ్రాన్ విజేత కంపెనీ, సుందిళ్ల బ్యారేజీ నవయువ ఇంజినీరింగ్ కంపెనీలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయా బ్యారేజీలకు అయ్యే ఖర్చును ఆయా కంపెనీలు భరించాల్సిందేనని సర్కారు ఆదేశాలిచ్చింది. ఇప్పుడు చేపట్టిన బ్యారేజీల భద్రత కోసం, అలాగే పూర్తిస్థాయి మరమ్మతులకు అయ్యే ఖర్చును ఆ మూడు కంపెనీలే భరించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆ మొత్తం ఎంతైనా సరే కంపెనీలదే బాధ్యత అని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. అలాగే స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎస్‌డీఎస్ఏ) ఇటీవల తరచుగా సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిసింది. గోతులను నింపేందుకు గ్రౌటింగ్ చేయనున్నారు. ఎలక్ట్రిక్ మోటార్ల ద్వారా నీళ్లను ఎలా తోడిపోస్తారో, ఇసుకను సైతం మోటార్లతో తోడి గోతుల్లో నింపనున్నారు. బ్యారేజీల పగుళ్లను సిమెంటుతో మరమ్మతు చేస్తారు. ఇలా ఎస్‌డీఎస్ఏ సైతం కొన్ని పనులు చేయాలంటూ రామగుండం ఈఎన్సీకి ఆదేశించింది. ఎల్అండ్‌టీకి ఎప్పటికప్పుడు సంబంధిత ఆదేశాలు, మార్గదర్శకాలు వెళుతూనే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అన్నారం, సుందిళ్లకు వేగంగా తాత్కాలిక మరమ్మతులు చేసి అక్కడి నుంచే నీళ్లను రైతుల అవసరాల కోసం వినియోగించుకోవాలని అధికారులు భావిస్తున్నారు. మేడిగడ్డ దగ్గర నీళ్లను స్టోరేజీ చేయడం ఇప్పట్లో సాధ్యం కాదని అంటున్నారు.

గుజరాత్‌లో 25 మంది సజీవదహనం

(మొదటిపేజీ తరువాయి)

చిన్నారులు సహా మొత్తం 25 మంది సజీవదహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మతుల్లో 12 మంది చిన్నారులున్నారు. తమ బిడ్డలు బతికే ఉన్నారా..లేదా అని కనిపించిన వారిని అక్కడి వారు అడుగుతున్న తీరు కన్నీరును తెప్పించింది ఈ హృదయ విదారక సంఘటన గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో స్థానిక టీఆర్‌పీ గేమింగ్ జోన్‌లో చోటు చేసుకుంది.

ప్రమాదం గురించి తెలియగానే ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. పెద్ద ఎత్తున గాలి దుమారం వచ్చినప్పటికీ శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. మతుల సంఖ్యను సరిగ్గా అంచనా వేయలేమని, మతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఆర్‌ఏ జోబన్ తెలిపారు. ప్రమాద స్థలం నుంచి మతదేహాలను వెలికి తీస్తున్నామని పేర్కొన్నారు. మరోపక్క ఈ ఘటనపై గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ స్పందించారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులంతా తక్షణమే ఘటనా స్థలికి చేరుకొని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం ఎక్స్‌లో పోస్టు చేశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపిన తర్వాత ప్రమాదానికి గల కారణాలు వెల్లడిస్తామని రాజ్‌కోట్ పోలీస్ కమిషనర్ రాజు భార్గవ్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

ఒకే గొడుగు కిందకు విపత్తుల నిర్వహణ

(మొదటిపేజీ తరువాయి)

ఆసెంటర్‌కు సంబంధించిన పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఒక్కో విభాగం నుంచి ఒక్కో అధికారి బాధ్యత వహించేలా వ్యవస్థ ఉండాలన్నారు. జూన్ 4లోగా పూర్తి ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. నాలాల పూడికతీతలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. పూడిక తీసిన చెత్తను సమీప ప్రాంతాలకు తరలించాలన్నారు. క్వారీ ఏరియాలను గుర్తించి ఆ ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామనీ, పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఓపెన్ సెల్లార్ గుంతల వద్ద ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వాటికి బారికేడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గతంలో జరిగిన సంఘటనల ఆధారంగా ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరద తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కంటోన్మెంట్ ఏరియాలో నాలాల సమస్యలు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సమస్యాత్మక నాళాల వద్ద అవసరమైతే ప్రతీ రోజు క్లీనింగ్ చేపట్టాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడటంతోపాటు కరెంట్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పవర్ మేనేజ్మెంట్ సరైన విధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యవహరిస్తే సహించేది లేదనీ, నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదన్నారు. పని చేసే వారిని ప్రోత్సహిస్తామనీ, వారికే ఉన్నత స్థానం కల్పిస్తామని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి చెప్పారు.

డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలి
ఎంత పెద్దవారున్నా ఉపేక్షించొద్దు : సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో మరింత యాక్టివ్‌గా పని చేయాలని సూచించారు. అనుమానిత ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించాలని కోరారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలనీ, గంజాయి, డ్రగ్స్ సరఫరా చైన్‌ను బ్రేక్ చేయాలని ఆదేశించారు. వాటిని సరఫరా చేయాలంటేనే భయపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ కేసులో సెలబ్రిటీలున్నా...ఎంత పెద్దవారున్నా ఉపేక్షించొద్దనీ, అవసరమైతే యాంటీ డ్రగ్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం సమర్థవంతంగా పని చేసే వారిని ప్రోత్సహించాలన్నారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు ఏం కావాలన్నా.. ప్రభుత్వం సహకరిస్తున్నదని తెలిపారు. డ్రగ్స్ అనే పదం వింటేనే భయపడేలా చర్యలు ఉండాలని సూచించారు.రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలనీ, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు.

ఈవీఎంలకు బీజేపీ ట్యాగ్..

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఆరో విడత పోలింగ్ జరుగుతున్న వేళ పశ్చిమబెంగాల్‌లోని బాంకురా జిల్లా రఘునాథ్‌పుర్‌లో ఈవీఎంలకు బీజేపీ ట్యాగ్‌లు కనిపించాయి. ఈ ట్యాగ్‌పై బీజేపీ ప్రతినిధి సంతకం మాత్రమే ఉండడంపై తణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపణలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి బెంగాల్ ఎన్నికల సంఘం స్పందించింది. "పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను పెట్టినప్పుడు కామన్ అడ్రస్ ట్యాగ్‌లను ఇస్తుంటాం. వాటిపై అభ్యర్థులు, వారి ఏజెంట్ల సంతకాలు తీసుకుంటాం. మీరు (టీఎంసీ) పేర్కొన్న కేంద్రాల్లో ఈవీఎం, వీవీప్యాట్లను పెట్టిన సమయంలో కేవలం బీజేపీ అభ్యర్థికి చెందిన ఏజెంట్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. అందుకే ఆయన సంతకం తీసుకున్నాం. ఆ తర్వాత పోలింగ్ జరుగుతున్న సమయంలో మిగతా ఏజెంట్ల సంతకాలు కూడా వాటిపై పెట్టించాం. పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల ఏర్పాటు సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తాం. ఈ ప్రక్రియంతా వీడియోగ్రాఫ్ చేస్తాం. సీసీటీవీల్లోనూ రికార్డ్ అవుతుంది" అని ఈసీ స్పష్టం చేసింది.

ఆరోగ్యమే మహా భాగ్యం


(మొదటిపేజీ తరువాయి)

సాహితీ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి ఎంహెచ్ భవన్‌లోని మల్లు వెంకట నరసింహారెడ్డి ప్రజా వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం బీపీ, షుగర్, ఈసీజీ, బ్లడ్ గ్రూపింగ్ అండ్ టెస్టింగ్, చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో ఉన్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార పదార్థాలపై వైద్యులు వివరించారు. దాదాపు 200 మంది ఈ ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకున్నారు. జనరల్ ఫిజీషియన్ ఘట్‌కేసర్ డాక్టర్ శ్రీనివాస్, ఎమర్జెన్సీ ఫిజీషియన్ డాక్టర్ రాజేందర్, గైనకాలజిస్ట్ డాక్టర్ నిఖిత, డెంటల్ స్పెషలిస్ట్ డాక్టర్ తేజస్విని, నర్సింగ్ సూపరింటెం డెంట్ ఎలిజబెత్, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ నీలిమ, డాక్టర్ రమాదేవి వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని సుప్రజ హాస్పిటల్ జీఎం అజయ్‌కుమార్, ఏజీఎంలు మహ్మద్, మాధవిరెడ్డి (ఆపరేషన్స్) పర్యవేక్షించారు. అనంతరం సుప్రజ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌ను 'నవతెలంగాణ' సీజీఎం ప్రభాకర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వీరయ్య, హెచ్ఆర్ ప్రభాకర్, కిషన్, రాములు, హాస్పిటల్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్‌కు సీపీఐ, సీపీఐ(ఎం), టీజేఎస్ మద్దతు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సీపీఐ, సీపీఐ(ఎం), తెలంగాణ జనసమితి మద్దతు ప్రకటించాయి. శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ లో గల తన నివాసంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సీపీఐ, సీపీఐ(ఎం) , తెలంగాణ జనసమితి నేతలతో భేటీ అయ్యారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అందులో కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లావెంకట్‌రెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, నాగయ్య, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, ఆ పార్టీ నేత ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. తమ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కచ్చితంగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు సీపీఐ నాయకులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ప్రజాస్వామ్యం బతకాలంటే తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్‌కు తమ పార్టీ మద్దతిస్తున్నదని చెప్పారు. విద్యాధికులు లోతుగా ఆలోచించి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకుని ఓటేయాలని విన్నవించారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ..బీజేపీ, బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతిచ్చామనీ, ఎమ్మెల్సీ ఎన్నికలోనూ ఆ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. మార్పు కోసం, ప్రజాస్వామ్య పాలనను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్‌ను గెలిపించాలని విన్నవించారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలని జనసమితి కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

ఫైనల్లో సింధు


సెమీస్‌లో బుసానన్‌పై గెలుపు

మలేషియా మాస్టర్స్ సూపర్ 500



కౌలాలంపూర్ : భారత అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు మలేషియా ఓపెన్ సూపర్ 500 టోర్నీలో ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ సీజన్‌లో తొలి టైటిల్ కోసం ఎదురుచూస్తున్న వరల్డ్ నం.15 సింధు.. మహిళల సింగిల్స్‌లో థాయ్‌లాండ్ అమ్మాయి బుసానన్‌ను చిత్తు చేసింది. గంటన్నర పాటు సాగిన సెమీఫైనల్లో 13-21, 21-16, 21-12తో సింధు మెరుపు విజయం సాధించింది. సెమీస్‌లో థాయ్‌లాండ్ షట్లర్ బుసానన్ తొలి గేమ్ గెల్చుకుని సింధుకు షాక్ ఇచ్చింది. 21-13తో అలవోకగా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. చావోరేవో తేల్చుకోవాల్సిన రెండో గేమ్‌లో సింధు పుంజుకుంది. ప్రథమార్థంలో బుసానన్ నుంచి గట్టి పోటీ ఎదురైంది. 9-9 వరకు నువ్వా నేనా అన్నట్టు పోరాడింది. 11-9తో విరామ సమయానికి ముందంజ వేసిన సింధు.. అదే దూకుడు కొనసాగించింది. 21-16తో రెండో గేమ్ నెగ్గి లెక్క సమం చేసింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు ఏకపక్ష విజయం సాధించింది. 11-6తో ఎదురులేని ఆధిక్యంలో నిలిచి.. 21-12తో ఫైనల్స్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. నేడు టైటిల్ పోరులో వరల్డ్ నం.7, రెండో సీడ్ చైనా షట్లర్ వాంగ్ జి యితో సింధు తలపడనుంది. వాంగ్‌తో ముఖాముఖిలో సింధు 2-1తో ముందంజలో కొనసాగుతుంది.

భారత బ్యాడ్మింటన్ చరిత్రలో అత్యధిక విజయాలు సాధించిన షట్లర్‌గా సైనా నెహ్వాల్ రికార్డును పి.వి సింధు అధిగమించింది. మలేషియా ఓపెన్ సెమీఫైనల్ విజయంతో సింధు బిడబ్ల్యూఎఫ్ విజయాలు 452కు చేరుకున్నాయి.



పవర్‌హిట్టర్ల టైటిల్ వేట

2021లో పదో స్థానం, 2022లో ఎనిమిదో స్థానం, 2023లో మళ్లీ పదో స్థానం. ఐపీఎల్ గత సీజన్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రదర్శన ఇది. వేలంలో పాట్ కమిన్స్‌కు రికార్డు ధర పెట్టడంతో సన్‌రైజర్స్ కథ మళ్లీ కంచికే అనేశారు.

గత రెండు సీజన్లలో కోల్‌కత నైట్‌రైడర్స్ ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. జట్టులో స్వదేశీ స్టార్స్ పెద్దగా లేరు. 2015 నుంచి లీగ్‌లో ఆడని మిచెల్ స్టార్క్‌కు రికార్డు ధర పెట్టి కొనుగోలు చేశారని విమర్శలు తప్పలేదు. సరైన సారథ్యం, సరైన కూర్పు లేని జట్టుగా ముద్ర!. హైదరాబాబాద్, కోల్‌కత ఐపీఎల్ 17 ఫైనల్లో తలపడతాయని ఎవరూ ఊహించలేదు.

టీ20 క్రికెట్‌లో సరికొత్త బ్రాండ్ క్రికెట్‌తో ఇటు హైదరాబాద్, అటు కోల్‌కత ఐపీఎల్‌లోనే కాదు గ్లోబల్ టీ20 క్రికెట్ అభిమానులను సైతం ఆకట్టుకున్నాయి. భయమెరుగుని బ్యాటింగ్‌తో అసాధ్యమనుకున్న రికార్డులు అలవోకగా బద్దలుకొట్టాయి. పవర్ హిట్టింగ్‌కు సరికొత్త నిర్వచనం ఇచ్చాయి.

2012, 2014లో కోల్‌కత ఐపీఎల్ విజేతగా నిలిచింది. 2016లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచింది. ఇటీవల సీజన్లలో దారుణ వైఫల్యాలు చవిచూసినా.. బ్యాటింగ్ విధ్వంసక విప్లవంతో నేడు మరో ఐపీఎల్ టైటిల్ వేటలో నిలిచాయి. నేడు చెపాక్‌లో సన్‌రైజర్స్ రెండో టైటిల్ అందుకుంటుందా? కోల్‌కత మూడో ట్రోఫీ ముద్దాడుతుందా? ఆసక్తికరం.

- నేడు ఐపీఎల్ 2024 ఫైనల్ పోరు
- రెండో టైటిల్‌పై సన్‌రైజర్స్ గురి
- మూడో ట్రోఫీ కోసం కోల్‌కత తహతహ
- రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-చెన్నై

ఐపీఎల్ 2024 ఆఖరు ఆటకు చేరుకుంది. రెండు నెలల పాటు సరికొత్త విధ్వంసక క్రికెట్‌తో లీగ్‌ను ఊపేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కత నైట్‌రైడర్స్ నేడు ఐపీఎల్ 17వ సీజన్ టైటిల్ పోరుకు సిద్ధమయ్యాయి. మే 26న చెపాక్ స్టేడియంలో ఫైనల్లో తలపడే జట్లుగా హైదరాబాద్, కోల్‌కతలపై ఎవరికీ అంచనాలు లేవు. కానీ, ఆధునిక క్రికెట్‌లో విప్లవాత్మక విధ్వంసక వ్యూహంతో అదరగొట్టిన సన్‌రైజర్స్, నైట్‌రైడర్స్ నేడు ఫైనల్ షోకు రంగం సిద్ధం చేసుకున్నాయి. పవర్ హిట్టింగ్ పవర్‌హౌస్‌లు నేడు ఆఖరు ఆటలో టైటిల్ కోసం తాడోపేడో తేల్చుకోనున్నాయి. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌పై నైట్‌రైడర్స్ రెండు సార్లు పంజా విసిరింది. లీగ్ దశలో, క్వాలిఫయర్ 1లో హైదరాబాద్ తలొంచింది. ఆ రెండు పరాజయాలకు నేడు టైటిల్ విజయంతో ప్రతీకారం తీర్చుకునేందుకు కమిన్స్ సేన ఎదురుచూస్తుంది. నేడు ఐపీఎల్ ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కత నైట్‌రైడర్స్ ఢీకొట్టనున్నాయి.

దూకుడు మంత్ర : సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎవరూ ఊహించని వ్యూహంతో విజయవంతమైంది. బలమైన బౌలర్ల జట్టుగా పేరొందిన సన్‌రైజర్స్.. ఈ సీజన్లో బ్యాటింగ్ పవర్‌హౌస్‌గా మారింది. ఈ సీజన్లో సన్‌రైజర్స్ తరఫున ఏ బౌలర్ పెద్దగా వార్తల్లో నిలువలేదు. ఆ స్థాయిలో బ్యాటర్లు విశ్వరూపం చూపించారు. నేడు ఫైనల్లో ఎర్ర మట్టి పిచ్, కోల్‌కత బ్యాటింగ్ లైనప్‌లో నలుగురు లెఫ్ట్ హ్యాండర్లతో సన్‌రైజర్స్ జట్టు కూర్పులో మార్పులు ఉండే అవకాశం ఉంది. వెంకటేశ్ అయ్యర్, సునీల్ నరైన్, రింకూ సింగ్, నితీశ్ రానాలకు చెక్ పెట్టేందుకు ఇద్దరు లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లతో ఆడేది అనుమానమే. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా దంచికొడుతున్నారు. రాహుల్ త్రిపాఠి ఆఖర్లో ఈ జోడీకి జత కలిశాడు. కానీ మిడిల్ ఆర్డర్‌లో నమ్మకమైక బ్యాటర్లు కరువయ్యారు. ఎడెన్ మార్‌క్రామ్ క్వాలిఫయర్ 1లో తేలిపోయాడు. నేడు కోల్‌కతతో మ్యాచ్‌లో బలమైన మిడిల్ ఆర్డర్ సన్‌రైజర్స్‌కు అవశ్యం. గ్లెన్ ఫిలిప్స్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశం సైతం లేకపోలేదు. 17 వికెట్లతో మెరిసినా.. స్థాయికి తగ్గ ప్రదర్శన పాట్ కమిన్స్ నుంచి రాలేదు. కీలక మ్యాచుల్లో మెప్పించే పాట్ కమిన్స్ నేడు తనదైన పేస్ పంజా విసిరే అవకాశం లేకపోలేదు.

రైడర్స్ ధీమా : కోల్‌కత నైట్‌రైడర్స్ శిబిరం ఎంతో నమ్మకంగా కనిపిస్తుంది. వర్షంతో శనివారం ప్రాక్టీస్ లేకపోయినా ఫైనల్లో ఆ జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపించే అవకాశం లేదు. బ్యాటింగ్, ఫీల్డింగ్, బౌలింగ్‌లో ఆ జట్టు జోరుమీదుంది. సునీల్ నరైన్, గుర్బాజ్ సహా వెంకటేశ్ అయ్యర్, శ్రేయస్ అయ్యర్ ఫామ్‌లో ఉన్నారు. నితీశ్ రానా, రింకూ సింగ్, రసెల్‌లు డెత్ ఓవర్ల ఊచకోతకు ఎప్పుడూ సిద్ధమే. మిచెల్ స్టార్క్ ఫామ్ కోల్‌కతకు అదనపు బలం. సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి మరోసారి మిడిల్ ఓవర్లలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ ఇద్దరు ఎనిమిది ఓవర్లలో సన్‌రైజర్స్‌ను పరుగుల వేటలో కట్టడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఫిల్ సాల్ట్ బాధ్యతలను తీసుకుని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ క్వాలిఫయర్ 1లో దూకుడుగా ఆడాడు. నేడు ఫైనల్లోనూ శ్రేయస్ అదే జోరు చూపించాలని భావిస్తున్నాడు.

పిచ్ రిపోర్టు : ఐపీఎల్ ఫైనల్‌కు చెపాక్‌లో ఎర్ర మట్టితో చేసిన పిచ్‌ను సిద్ధం చేశారు. దీంతో బ్యాటర్లకు కాస్త ఉపశమనం కలుగనుంది. స్పిన్నర్లతో పాటు పేసర్లకు సైతం పిచ్ నుంచి సహకారం లభించనుంది. మంచు ప్రభావం ఉంటుందని భావించినా.. ఏ మేరకు అని చెప్పటం కష్టమే. టాస్ నెగ్గిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఫైనల్ మ్యాచ్‌కు ఎటువంటి వర్షం సూచనలు లేవు.

సురేఖ డబుల్ ధమాకా

- టీమ్ విభాగంలో పసిడి, రజతం సొంతం



న్యూఢిల్లీ : భారత స్టార్ ఆర్చర్, తెలుగు తేజం జ్యోతి సురేఖ అదరగొట్టింది. ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 2లో మరో స్వర్ణం, రజత పతకం సాధించింది. మహిళా ఆర్చర్ల త్రయం జ్యోతి సురేఖ వెన్నం, పర్ణీత్ కౌర్, అదితి స్వామి పసిడి పతకం సాధించారు. మహిళల కాంపౌండ్ జట్టు విభాగం ఫైనల్లో టర్కీపై 232-226తో మన అమ్మాయిలు గెలుపొందారు. వరల్డ్ నం.1 భారత జట్టు ప్రత్యర్థిపై ఆరు పాయింట్ల భారీ ఆధిక్యం సాధించి స్వర్ణం దక్కించుకున్నారు. మిక్స్‌డ్ జట్టు విభాగంలో జ్యోతి సురేఖ తృటిలో పసిడి చేజార్చుకుంది. మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో ప్రియాన్షుతో కలిసి సిల్వర్ సాధించింది. పసిడి వేటలో యుఎస్‌ఏ చేతిలో 153-155తో తడబాటుకు గురైంది. ప్రపంచకప్‌లో సురేఖ, పర్ణీత్ కౌర్, అదితి త్రయానికి ఇది మూడో పసిడి పతకం కావటం విశేషం.

బెడబ్రత్ అదరగొట్టాడు


వరల్డ్ యూత్ టోర్నీలో పసిడి



లిమా (పెరూ) : ఐడబ్ల్యూఎఫ్ ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్స్‌లో భారత యువ లిఫ్టర్ బెడాబ్రత్ బరాలి పసిడి పతకం సాధించాడు. మెన్స్ 67 కేజీల విభాగంలో పోటీపడిన బెడబ్రత్ ఈ పోటీల్లో స్వర్ణం సాధించిన తొలి భారత లిఫ్టర్‌గా నిలిచాడు. నిరుడు ఈ పోటీల్లో మూడో స్థానానికి పరిమితమైన బెడబ్రత్.. ఈసారి స్వర్ణం దక్కించుకున్నాడు. స్నాచ్‌లో 136 కేజీలు ఎత్తిన బెడబ్రత్.. జాతీయ రికార్డు (133 కేజీలు)ను తిరగరాశాడు. 81 కేజీల విభాగంలో పోటీపడిన సాయిరాజ్ పర్దేశి స్నాచ్ విభాగంలో కాంస్యం సాధించి, ఓవరాల్ విభాగంలో నాల్గో స్థానానికి పరిమితం అయ్యాడు.

సిమ్రన్ పసిడి పరుగు

ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్స్



న్యూఢిల్లీ : ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ 2024లో టీమ్ ఇండియాకు మరో పసిడి పతకం దక్కింది. మహిళల 200 మీటర్ల టీ12 విభాగంలో సిమ్రన్ శర్మ పసిడి పతకం సాధించింది. 25 ఏండ్ల సిమ్రన్ శర్మ శనివారం జరిగిన మెడల్ రేసులో 24.95 సెకండ్లతో అగ్రస్థానంలో నిలిచింది. మహిళల 100 మీటర్ల టీ35 విభాగంలో ప్రీతి పాల్ కాంస్య పతకం గెల్చుకుంది. 14.43 సెకండ్లలో రేసును ముగించిన ప్రీతి.. చైనా అథ్లెట్ల తర్వాతి స్థానంలో నిలిచింది. మెన్స్ జావెలిన్ త్రో ఎఫ్41 విభాగంలో నవదీప్42.82 మీటర్ల దూరంతో కాంస్య పతకం సాధించాడు. ఈ పోటీల్లో భారత్ ఆరు స్వర్ణాలు, ఐదు రజతాలు, ఆరు కాంస్యాలు సహా 17 మెడల్ సాధించింది.

నవచిత్రం

విశ్వంభరలో కీలక పాత్ర



ఆషికా రంగనాథ్

చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ మాగ్నమ్ ఓపస్ 'విశ్వంభర'. వశిష్ట దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. మెగా అభిమానులకు, సినీ అభిమానులకు చిరస్మరణీయమైన చిత్రాన్ని నిర్మించే అవకాశాన్ని వశిష్ట అద్భుతంగా వినియోగించుకుంటుండగా, యూవీ క్రియేషన్స్ రాజీపడకుండా భారీ కాన్వాస్‌పై సినిమాను నిర్మిస్తోందని చిత్ర బృందం తెలిపింది.

తాజాగా హీరోయిన్ ఆషికా రంగనాథ్‌ను 'విశ్వంభర' ఎపిక్ సినిమాటిక్ జర్నీకి టీమ్ స్వాగతించింది. 'నా సామి రంగా'లో తన అద్భుతమైన లుక్స్, నటనతో అందరినీ ఆకట్టుకున్న ఆషికా ఈ సినిమాలో ఒక ముఖ్యమైన పాత్రను పోషించనున్నారు. మరికొందరు ప్రముఖ నటీనటులు ప్రముఖ పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష కృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తోంది.

"బింబిసార' చిత్రంతో దర్శకుడిగా తానేమిటో నిరూపించుకున్న వశిష్ట ఈ చిత్రాన్ని అత్యంత అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి నుంచి ఆయన అభిమానులు, ప్రేక్షకులు ఏమి ఆశిస్తారో అవన్నీ ఈ చిత్రంలో పుష్కలంగా ఉన్నాయి. ఓ సరికొత్త కాన్సెప్ట్‌తో అత్యంత భారీ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రం కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం' అని నిర్మాతలు తెలిపారు. విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌ని నిర్మిస్తున్నారు. ఆస్కార్ అవార్డు విజేత ఎంఎం కీరవాణి సంగీతం సమకూరుస్తుండగా, చోటాకెనాయుడు సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. వచ్చే సంక్రాంతి కానుకగా ఈ సినిమా జనవరి 10న విడుదల కానుంది. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, ఫైట్స్: రామ్-లక్ష్మణ్.

మహిళా సాధికారతను చాటే యేవమ్




'మీ సినిమా ఓపెనింగ్‌కు వచ్చిన నేను మళ్లీ మీ చిత్ర టీజర్‌ని విడుదల చేయడం హ్యాపీగా ఉంది. 'యేవమ్' చాలా మంచి టైటిల్. మీ ప్రమోషన్ కంటెంట్ చూస్తుంటే చిత్రం కూడా కొత్తగా ఉంటుందని అనిపిస్తుంది. టీజర్ చాలా ఇంప్రెసివ్‌గా ఉంది' అని దర్శకుడు హరీశ్ శంకర్ అన్నారు. 'యేవమ్' టీజర్‌ను లాంచ్ చేసి సినిమా సక్సెస్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

చాందిని చైదరి, వశిష్ట సింహా, భరత్‌రాజ్,ఆషు రెడ్డి ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం డైరెక్టర్ హరీష్‌శంకర్ విడుదల చేశారు.

ప్రకాష్ దంతులూరి . దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి నవదీప్, పవన్ గోపరాజు నిర్మాతలు.

ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ,'కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమాలకు తెలుగు ప్రేక్షకుల ఆదరణ ఎప్పుడూ ఉంటుంది. డిఫరెంట్ అండ్ న్యూ కంటెంట్‌తో రాబోతున్న మా సినిమాపై పూర్తి విశ్వాసంతో ఉన్నాం. మా టీజర్‌ను డైరెక్టర్ హరీష్ శంకర్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన చాందిని చౌదరి, ఆషూ రెడ్డి, వశిష్ట సింహా, భరత్‌రాజ్ పాత్రలకు సంబంధించిన లుక్స్ విడుదల చేశాం. అన్ని పాత్రల లుక్స్‌కు మంచి స్పందన వచ్చింది. మహిళా సాధికారికతను చాటి చెప్పే నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. తప్పకుండా చిత్రం అందరికి నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ : ఎస్‌వీ విశ్వేశ్వర్, సంగీతం: కీర్తన శేషు, నీలేష్ మందలపు, ఎగ్జిక్యూటివ్ నిర్మాత : రాజు పెన్మెత్స.

భారతీయుడు-2



కమల్ హాసన్

కమల్ హాసన్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్‌తో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'.

ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూలై 12న ఈ చిత్రం గ్రాండ్ లెవల్లో రిలీజ్ అవుతుంది. జూన్ 1న చెన్నైలో సినీ ప్రముఖులు సమక్షంలో ఆడియో వేడుకను ఘనంగా నిర్వహించటానికి సన్నాహాలు చేస్తున్నారు.

1996లో కమల్ హాసన్, శంకర్ కాంబినేషన్‌లో విడుదలై బాక్సాఫీస్ దగ్గర సరికొత్త రికార్డులను క్రియేట్ చేసిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' రూపొందుతోంది. అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆతృతతో ఎదురు చూస్తోన్న ఈ మూవీ ప్రమోషన్స్‌లో వేగం పుంజుకున్నాయి. అందులో భాగంగా తాజాగా మేకర్స్ 'భారతీయుడు 2' మూవీ నుంచి 'శౌర..' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. పాటలో చూపించిన కొన్ని విజువల్స్ చూస్తుంటే 'భారతీయుడు 2' అంచనాలను మించేలా శంకర్ తెరకెక్కించారని స్పష్టమవుతుంది. అనిరుద్ రవిచందర్ సంగీత సారథ్యంలో సుద్దాల అశోక్ తేజ రాసిన ఈ పాటను రితేష్ జి.రావ్, శ్రుతికా సముద్రాల పాడారు.

కమల్ హాసన్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో సిద్దార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జె.సూర్య, బాబీ సింహ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

రవివర్మన్ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి అనిరుద్ రవిచంద్రన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఎ.శ్రీకర ప్రసాద్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్‌గా టి.ముత్తురాజ్ గావర్క్ చేస్తున్నారు. బి.జయమోహన్, కబిలన్ వైరముత్తు, లక్ష్మీ శరవణకుమార్‌లతో కలిసి డైరెక్టర్ శంకర్ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జైంట్ మూవీస్ ఈ భారీ చిత్రాన్ని రూపొందిస్తున్నాయి. 'భారతీయుడు 2' మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పి, సీడెడ్ హక్కులను శ్రీలక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. సోనీ మ్యూజిక్ ద్వారా 'భారతీయుడు 2' పాటలు మార్కెట్లోకి విడుదలవుతున్నాయి. నెడుముడి వేణు, వివేక్, కాళిదాస్ జయరాం, గుల్షన్ గ్రోవర్, సముద్రఖని, బ్రహ్మానందం, జాకీర్ హుస్సేన్, పియుష్ మిశ్రా, గురు సోమసుందరం, డిల్లీ గణేష్, జయప్రకాష్, మనోబాల, అశ్వినీ తంగరాజ్ తదితరులు ఈ చిత్రంలోని ఇతర ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు.

సత్యభామ హిట్ ఖాయం - బాలకృష్ణ



కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'సత్యభామ'. నవీన్ చంద్ర అమరేందర్ అనే కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. 'మేజర్' చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ, స్క్రీన్ ప్లే అందించారు.

క్రైమ్ థ్రిల్లర్ కథతో దర్శకుడు సుమన్ చిక్కాల రూపొందించారు. జూన్ 7న ఈ సినిమా గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ కానుంది. శుక్రవారం బాలకృష్ణ చేతుల మీదుగా ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, "సత్యభామ' అనే పేరులోనే ఒక వైబ్రేషన్ ఉంది. పారిజాతపహరణం సమయంలో శ్రీకృష్ణుడి వెంట ఉన్నది సత్యభామ. ఆమె వెంట ఉంటే విజయం ఖాయం. సత్యభామ అనే పేరు ఉమెన్ ఎంపవర్‌మెంట్‌కు ప్రతీకగా చెప్పుకోవాలి. ఆర్టిస్టులు వైవిధ్యమైన చిత్రాలు చేయాలి. కాజల్ సత్యభామతో ఆ ప్రయత్నం చేసింది. ఆమె ఒక ఫైర్ బ్రాండ్. అన్ని రకాల ఎమోషన్స్ చేయగల నటి. పాత్రల ఆత్మలోకి వెళ్లి మెప్పించగలదు. ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా తప్పకుండా సక్సెస్ అవుతుంది. జూన్ 7న థియేటర్స్‌లో చూడండి' అని చెప్పారు. 'బాలకృష్ణ అభిమానిగా ఆ గుంపులో ఉండాల్సిన వాడిని. ఈ వేదిక మీద నుంచి మాట్లాడుతున్నా. ఆయన రావడంతో రిలీజ్ కు ముందే సక్సెస్ అందుకున్నంత హ్యాపీగా ఉంది. కాజల్ అగర్వాల్ మా సినిమా షూటింగ్ టైమ్‌లో చూపించిన డెడికేషన్‌కు హ్యాట్సాఫ్' అని నిర్మాతలు బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి చెప్పారు.

'సత్యభామ' కథను శశి తన టీమ్‌తో వచ్చి చెప్పారు. నాకు చాలా ఎమోషనల్‌గా అనిపించింది. వెంటనే ఓకే చెప్పాను. ఈ కథ మీద ఉన్న నమ్మకం గ్లింప్స్ చూసినప్పుడు రెట్టింపు అయ్యింది. నా కోస్టార్ నవీన్ చంద్రకు థ్యాంక్స్ చెబుతున్నా. అమర్‌గా నవీన్ చంద్ర కంటే మరొకరు బాగా నటించలేరేమో. ప్రకాష్ రాజ్‌తో మరోసారి వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. శశి వల్లే నేను సత్యభామగా మారాను. తెలుగు ఆడియెన్స్ నన్ను స్టార్ హీరోయిన్‌ను చేశారు. మీ అందరికీ థ్యాంక్స్. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుందనే నమ్మకంతో ఉన్నాను.

- హీరోయిన్ కాజల్

ఓ రైతు పెళ్ళి నేపథ్యంలో కన్యాకుమారి



శ్రీ చరణ్ రాచకొండ

గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ జంటగా నటిస్తున్న సినిమా 'కన్యాకుమారి'. ఈ చిత్రాన్ని రాడికల్ పిక్చర్స్ బ్యానర్ పై దర్శక, నిర్మాతగా సృజన్ రూపొందిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. శుక్రవారం ఈ సినిమా నుంచి తిరుపతి క్యారెక్టర్‌ను పరిచయం చేస్తూ రైతు టీజర్ రిలీజ్ చేశారు.

శ్రీకాకుళం జిల్లాలోని పెంటపాడులో ఐదు ఎకరాల రైతు తిరుపతి. ఏడో తరగతి చదువుకున్న తిరుపతి వ్యవసాయం చేస్తుంటాడు. ఈ వృత్తే అతని పెళ్లికి అడ్డుగా మారుతుంటుంది. సంబంధాల కోసం వెళ్లిన చోటల్లా ఉద్యోగస్తుడైన కుర్రాడికే మా అమ్మాయిని ఇచ్చి పెళ్లి చేస్తాం అంటారు. తిరుపతిని రైతు అనే చిన్నచూపు చూస్తుంటారు. బాగా చదువుకున్న అమ్మాయినే పెళ్లి చేసుకుంటానని తనను తక్కువ చేసి మాట్లాడిన వాళ్లతో ఛాలెంజ్ చేస్తాడు తిరుపతి. ఈ యువ రైతు చేసిన సవాలును నిలబెట్టుకున్నాడా లేదా అనేది సినిమాలో చూడాలి. ఫన్నీగా, ఇంట్రెస్టింగ్‌గా ఉన్న రైతు టీజర్ ఆందర్నీ ఆకట్టుకుంటోంది అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి ఎడిటింగ్ - నరేష్ అడుప, సినిమాటోగ్రఫీ - శివ గాజుల, హరిచరణ్ కె, మ్యూజిక్ - రవి నిడమర్తి, సౌండ్ డిజైనర్ - నాగార్జున తాళ్లపల్లి, కో ప్రొడ్యూసర్స్ - సతీష్ రెడ్డి చింతా, వరీనియా మామిడి, అప్పల నాయుడు అట్టాడ, సిద్ధార్థ్.ఎ.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

యూనియన్ బ్యాంక్ రిటైల్ ఎక్స్‌పోకు స్పందన



గుంటూరు : ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శనివారం నగరంపాలెంలోని ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటైల్ ఎక్స్‌పో 2024కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ గుంటూరు రీజినల్ హెడ్ ఎస్ జవహర్ మాట్లాడుతూ.. అతి తక్కువ వడ్డీ రేటుతోనే గృహ, వాహన రుణాలు అందిస్తున్నామన్నారు. రూ.40 లక్షల వరకు పూచికత్తు లేని విద్యా రుణాలు జారీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ ప్రదర్శనకు క్రెడాయ్ చైర్మెన్ ఆళ్ల శివారెడ్డి, ఆ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ అశ్వర్థ నాయక్, రిటైల్ లోన్ పాయింట్ హెడ్ రామాంజనేయ కుమార్, బ్రాంచి మేనేజర్లు హాజరయ్యారు. బిల్డర్లు, కారు డీలర్లు, ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు పాల్గొన్నారు.

వయాకాం18, స్టార్ ఇండియా విలీనం

- సీసీఐ ఆమోదం కోరిన రిలయన్స్

న్యూఢిల్లీ : వయాకామ్ 18, స్టార్ ఇండియా విలీనానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అనుమతి కోరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన వయాకామ్ 18, ది వాల్ట్ డిస్నీ కంపెనీకి చెందిన స్టార్ ఇండియాకు చెందిన వినోద వ్యాపారాలను విలీనం చేయనున్నామని, దీంతో జాయింట్ వెంచర్ ఏర్పాటు కానుందని సీసీఐకి రిలయన్స్ తెలిపింది. ఈ లావాదేవీల వల్ల దేశంలోని పోటీ వ్యాపారాలపై ఎలాంటి ప్రభావం పడబోదని పేర్కొంది. అమెరికా కేంద్రంగా పని చేస్తున్న వాల్ట్ డిస్నీ కంపెనీ అనుబంధ స్టార్ ఇండియా ఆధ్వర్యంలో టీవీ బ్రాడ్ కాస్టింగ్, ఓటీటీ వేదికను నిర్వహిస్తోంది. రూ.70 వేల కోట్ల (8.5 బిలియన్ డాలర్లు) వ్యాపారం కోసం గత ఫిబ్రవరిలో ఇరు సంస్థలను విలీనం చేసేందుకు అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ విలీనం పూర్తి అయితే దేశంలోని పలు భాషల్లో 100కి పైగా ఛానెల్స్, 7.5 కోట్ల మంది వీక్షకులు గల రెండు లీడింగ్ ఓటీటీలు ఉంటాయి. జాయింట్ వెంచర్ సంస్థకు రిలయన్స్ ఇండస్ట్రీస్ చెర్మెన్ ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఉదయ్ శంకర్ వైస్ చైర్‌పర్సన్‌గా ఉంటారు. విలీనం తర్వాత రిలయన్స్‌కు 63.16 శాతం, వాల్ట్ డిస్నీ 36.84 శాతం వాటాలు కలిగి ఉంటాయి.

శూన్య కార్బన్ భవిష్యత్తుపై సిమెంట్ రంగం దృష్టి

హైదరాబాద్ : నికర శూన్య కార్బన్ లక్ష్యాన్ని చేరాలని నిర్దేశించుకున్నట్లు గ్రీన్ సిమెంటెక్ 2024 చైర్మెన్, జెకె సిమెంట్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ మాధవకృష్ణ అన్నారు. సీఐఐ గ్రీన్ సిమెంటెక్ 2024 సదస్సు 20వ ఎడిషన్ హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రెండు రోజుల పాటు జరిగింది. సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (సీఎంఏ) భాగస్వామ్యంతో సీఐఐ వార్షిక సిమెంటు రంగ సదస్సును ఏర్పాటు చేసింది. ఇందులో మాధవకృష్ణ మాట్లాడుతూ.. హరిత భవిష్యత్తు దిశగా సిమెంటు రంగం ప్రయాణాన్ని తీర్చిదిద్దేందుకు సీఐఐ గ్రీన్ సిమెంటెక్ ఆవిష్కరణలు, చర్చలు, భాగస్వామ్యం తదితర అంశాల్లో కీలకంగా వ్యవహరిస్తుందన్నారు.

అమ్మకాల్లో 18 శాతం వృద్ధి

- అమెజాన్ బిజినెస్ వెల్లడి

హైదరాబాద్ : తమ వేదిక అమ్మకాల్లో రెండంకెల వృద్ధి చోటు చేసుకుందని అమెజాన్ బిజినెస్ తెలిపింది. సుమారు 10 లక్షల విక్రేతలు, 19 కోట్లకు పైగా జీఎస్టీ గల ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. హైదరాబాద్ సహా దేశంలో 2024 తొలి త్రైమాసికం (క్యూ1)లో 48 శాతం వృద్ధిని నమోదు చేశామని వెల్లడించింది. కొత్త వినియోగదారుల రిజిస్ట్రేషన్స్‌లో 84 శాతం పెరుగుదల చోటు చేసుకుందని తెలిపింది. వినియోగదారులు అధికంగా ల్యాప్‌టాప్స్, టెలివిజన్స్, ఏపీ, కూలర్లు, ఫ్యాన్లు వంటి ప్రముఖ కేటగిరీల్లో షాపింగ్ చేశారని అమెజాన్ బిజినెస్ డైరెక్టర్ సుచిత్ సుభాస్ తెలిపారు.

పెండ్లి కానుకుల మార్కెట్ 30శాతం వృద్ధి

- స్టార్టప్ అమూల్యమ్ కో-ఫౌండర్స్ వెల్లడి
- బంజారాహిల్స్‌లో నూతన స్టోర్ ఏర్పాటు

నవతెలంగాణ - హైదరాబాద్



విలువైన పెండ్లి కానుకలకు డిమాండ్ పెరుగుతోందని స్టార్టప్ సంస్థ అమూల్యమ్ కో ఫౌండర్స్ సుశాంత్ అగర్వాల్, త్రిషాల అగర్వాల్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లో తమ నూతన అమూల్య స్టోర్‌లో మీడియాతో మాట్లాడారు. తమ ఈ స్టోర్‌ను సోమవారం హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, ప్రముఖ డిజైనర్ పింకీ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారని తెలిపారు. పెండ్లి, ఇతర శుభాకార్యాలకు ఇచ్చే బహుమతుల విధానం మారిందన్నారు. కస్టమైజ్డ్ (వ్యక్తిగతీకరించిన) కానుకలకు అందించడానికి ఆసక్తి పెరుగుతుందన్నారు. చాయ్ కప్పులు, ట్రేలు, టేబుల్‌వేర్ నుంచి భోజన పళ్లెంలలోనూ అలనాటి భారత గత వైభవాలను గుర్తు చేసేలా తాము ఉత్పత్తులను డిజైన్ చేశామన్నారు. లగ్జరీ యుటిలిటీ వస్తువుల ద్వారా భారతీయ కళలు, చేతిపనులను ప్రోత్సహించడం, చేతివృత్తుల వారికి గౌరవాన్ని సంపాదించడం అనే లక్ష్యంతో తాము ఈ వ్యాపారంలోకి అడుగు పెట్టామన్నారు. తెలంగాణలో ప్రతీ ఏడాది మూడు లక్షల పెండ్లిండ్లు జరుగుతున్నాయన్నారు. ఇందులో 10వేలు అధిక ఆదాయం కలిగిన కుటుంబాల పెండ్లిండ్లు ఉంటున్నాయన్నారు. వేడుకలకు రూ.3 నుండి 5 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారన్నారు. దేశంలో ఏటా కోటి వివాహాలు జరుగుతాయన్నారు. పెండ్లిండ్ల పరిశ్రమ వ్యాపారం రూ.5లక్షల కోట్లుగా ఉంటుందని ఆయన అంచనా వేశారు. ఇది ఏడాదికి 25 నుంచి 30 శాతం చొప్పున పెరుగుతుందన్నారు. పిచ్వాయి, జోధ్‌పూర్, ఉదయపూర్ కట్లరీ, క్రాకరీతో సహా ప్రసిద్ధ కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ కళాఖండాలను తాము విక్రయాలకు సేకరించామన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ సహా పలు మెట్రో నగరాల్లో ఐదు ఫ్లాగ్‌షిప్ స్టోర్లను తెరవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

'ఇండియా' నేతలు రాజవంశీయులు


- ఘోరంపై మరోమారు మోడీ విసుర్లు

న్యూఢిల్లీ : ప్రతిపక్షాల ఐక్య వేదికకు విశేష ప్రజాదరణ లభిస్తున్న క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పిస్తూ వస్తున్నారు. బీహార్‌లోని పాట్నాలో శనివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో మోడీ మాట్లాడుతూ.. ఇండియా బ్లాక్‌లోని నాయకులందరూ ఎల్లప్పుడూ తమ కుటుంబాలను ముందు ఉంచుతారని తెలిపారు. వారంతా మతతత్వ, కులతత్వ రాజకీయాలకు పాల్పడతారని, అందరూ రాజవంశీయులని మోడీ వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికలు కేవలం ఎంపీలను ఎన్నుకోవడానికి మాత్రమే ఉద్దేశించినవి కాదని, దేశానికి ప్రధానమంత్రిని నిర్దేశించేవి కూడా ఈ ఎన్నికలేనని ఆయన చెప్పారు. భారత్ శక్తిని ప్రపంచం ముందు చూపగలిగేలా దేశ ప్రధాని ఉండాలని వ్యాఖ్యానించారు. అలాంటి ప్రధానిని ఈ ఎన్నికల్లో మీరు ఎన్నుకోవాలని ఆయన సూచించారు. అయితే మోడీ వ్యాఖ్యలపై రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేశారు. ప్రధానిని ప్రజలు నేరుగా ఎన్నుకోరన్న సంగతి తెలిసి కూడా ప్రధాని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విడ్డూరమని వారు పేర్కొన్నారు. ప్రజలు నేరుగా లోక్‌సభ సభ్యులను ఎన్నుకుంటే అలా ఎన్నికైన వారు ప్రధానిని ఎన్నుకుంటారని గుర్తు చేశారు.

మెడికల్ సీట్లు మన విద్యార్థులకు దక్కేలా చూడండి..

- మాజీ మంత్రి టి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించి స్థానికత అంశంపై స్పష్టత ఇవ్వడంతో పాటు, మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లలో వందకు వంద శాతం తెలంగాణ విద్యార్థులకు దక్కేలా చూడాలని మాజీ మంత్రి టి హరీశ్‌రావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూన్ మూడో వారంలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతున్న క్రమంలో ప్రభుత్వం తక్షణం స్పందించి స్పష్టత ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. లేదంటే వైద్య విద్య చదివే అవకాశాలను తెలంగాణ విద్యార్థులు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందున్న 20 మెడికల్ కాలేజీల్లోని 2,850 సీట్లలో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 1,900 సీట్లు ఉన్నాయనీ, ఇందులో 15శాతం అన్ రిజర్వుడు కోటా అంటే 280 సీట్లను తెలంగాణ విద్యార్థులు నష్టపోతారని పేర్కొన్నారు. దీంతోపాటు నిమ్స్ సహా ఇతర మెడికల్ కాలేజీల్లోని దాదాపు 150 పీజీ సీట్లను వారు కోల్పోతారని తెలిపారు. ఎంబీబీఎస్, పీజీ అడ్మిషన్ల ప్రక్రియ సమీపిస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. విద్యార్థుల ప్రయోజనాలు కాపాడడంలో సర్కార్ విఫలమైందన్నారు. ప్రభుత్వ తీరుతో తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు 2014 నుంచి కన్వీనర్ కోటాలో 15శాతం సీట్లకు తెలంగాణతో పాటు, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సైతం పోటీపడే వెసులుబాటు కల్పించారని పేర్కొన్నారు. ఇదే విధానం కొనసాగితే, 2014 తర్వాత ఏర్పాటు చేసిన కొత్త మెడికల్ కాలేజీల్లో కూడా 15శాతం అన్ రిజర్వుడు కోటా అమలు చేయాల్సి ఉంటుందనీ, దీని వల్ల దాదాపు 520 సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోతారని హరీశ్‌రావు తెలిపారు.

జూన్ 1 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

- 17 కేంద్రాల్లో నిర్వహణ
- కొత్తగా జగిత్యాలలో ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభం కానుంది. అదేనెల ఆరో తేదీ వరకు ఆ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా శనివారం మూల్యాంకనం షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17 కేంద్రాల్లో మూల్యాంకనం ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. ఆదిలాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, హన్మకొండ, నల్లగొండ, సిద్ధిపేట, మంచిర్యాల, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాలలో ఒకటి చొప్పున హైదరాబాద్‌లో రెండు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం కోసం జగిత్యాలలో కొత్తగా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈనెల 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. వచ్చేనెల మూడో తేదీ వరకు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 2,73,407 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 1,53,608 మంది కలిపి మొత్తం 4,27,015 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

టీజీజేఎల్ఏ హర్షం

జగిత్యాల జిల్లాలో ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్ఏ-475) హర్షం ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, ఉపాధ్యక్షులు ఎల్ దేవేందర్, జగిత్యాల అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతిరెడ్డి, అత్తినేని శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశానికి, ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఐసీజే ఆదేశాలు బేఖాతరు

- గాజాలో కొనసాగుతున్న ఇజ్రాయెల్ యుద్ధోన్మాదం



వెస్ట్‌బ్యాంక్ : ఇజ్రాయెల్ యుద్ధోన్మాదంతో ఊగిపోతోంది. పాలస్తీనియన్లపై మారణకాండ తక్షణమే నిలిపివేయాలని అంతర్జాతీయ న్యాయ స్థానం ఆదేశాలు జారీ చేసినా.. వాటిని ఇజ్రాయెల్ ఏమాత్రమూ లెక్క చేయడం లేదు. గాజాలో, ముఖ్యంగా రఫాలో శనివారం కూడా ఇజ్రాయెల్ తన యుద్ధోన్మాద దాడులను యథేచ్ఛగా కొనసాగించింది. రఫాకు ఆగ్నేయంగా ఇజ్రాయిల్ యుద్ధ ట్యాంక్‌లు, బలగాలతో ఆక్రమణలను కొనసాగిస్తూ అక్కడి అమాయక పౌరులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. నగరంలో జనసాంద్రత ఎక్కువగా వున్న పశ్చిమ జిల్లా ప్రాంతం వైపుగా నెతన్యాహూ సైన్యం చొరబడుతోంది. రఫాలోని కువైట్ ఆస్పత్రికి సమీపంలో నివాస భవనాలపై బాంబు దాడులు జరిపింది. ఉత్తర గాజావ్యాప్తంగా కొనసాగుతున్న వైమానిక దాడుల్లో డజన్ల సంఖ్యలో ప్రజలు మరణించారు. బీట్ హనూన్ ప్రాంతంలో తలదాచుకున్న మహిళలు, చిన్నారులు కూడా మరణించిన వారిలో వున్నారు.

దయనీయస్థితిలో ప్రజలు

ఇజ్రాయెల్ వరుస దాడులతో గాజా, రఫా పరిసర ప్రాంతాల్లో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. తాగడానికి గుక్కెడు నీటి కోసం కూడా అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 17 రోజులుగా ఆస్పత్రికి ఇంధనం, నీటి సరఫరా లేదు, వైద్య సరఫరాలు కూడా అందడం లేదు. దాదాపు కుప్పకూలే పరిస్థితిలో వుంది. గాజాలో యుద్ధం మొదలైన తొలినాళ్లలో వున్న పరిస్థితులే నేడు రఫాలో కనిపిస్తున్నాయి. ఉత్తర గాజాలోని ఒక స్కూలుపై జరిగిన దాడిలో పదిమంది పాలస్తీనియన్లు మరణించారు. 17 మంది గాయపడ్డారు. ఆ పొరుగు ప్రాంతాల నుంచి పారిపోయి వచ్చి ఆ స్కూల్లో చాలామంది తలదాచుకున్నారు. జాబాలియా శరణార్థ శిబిరంపై కూడా భీకరంగా దాడి జరిగింది. అనేకమంది అక్కడ నుండి పారిపోయారు. వెస్ట్ బ్యాంక్‌లో జరుగుతున్న దాడుల్లో 15 మంది పాలీస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం అపహరించింది. ఇప్పటివరకు 8,855 మందిని ఇలా అదుపులోకి తీసుకున్నారని పాలస్తీనా ప్రిజనర్స్ సొసైటీ తెలిపింది. ఇప్పటివరకు గాజాలో 35,857 మంది మరణించగా, 80,293 మంది గాయపడ్డారు. గాజాలో జరుగుతున్న విషాదం మాటలకందనిదని ఐక్యరాజ్య సమితి అత్యవసర సహాయ కార్యకలాపాల చీఫ్ వ్యాఖ్యానించారు. తక్షణమే ఈ దారుణాన్ని ఆపేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని అభిప్రాయపడ్డారు.

తక్షణమే నిధులు విడుదలకు జి7 వినతి

పాలస్తీనా తక్షణ ఆర్థికావసరాలను దృష్టిలో వుంచుకుని విత్‌హెల్డ్‌లో పెట్టిన పాలస్తీనా అథారిటీ నిధులను తక్షణమే విడుదల చేయాలని జి-7 దేశాల ఆర్థిక మంత్రులు శుక్రవారం ఇజ్రాయెల్‌కు విజ్ఞప్తి చేశారు. స్ట్రెసాలో సమావేశమైన వీరు గాజాలో పరిస్థితులపై చర్చించారు. ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో కీలకమైన ఆర్థిక లావాదేవీలకు అంతరాయం కలిగించవద్దని వారు కోరారు. పాలస్తీనా బ్యాంకులతో లావాదేవీలను నిలిపివేయడానికి ఇజ్రాయెల్ యోచిస్తోందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ వినతి వెలువడింది. ఇజ్రాయిల్, పాలస్తీనా బ్యాంకుల మధ్య కొనసాగుతున్న బ్యాంకింగ్ సేవలు యథావిధిగా సాగేలా చూడాలని కోరారు.

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఘోరం..

- శ్రీధర్‌రెడ్డి హత్యకు సీఎం, మంత్రి జూపల్లి బాధ్యత వహించాలి : బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి రోజురోజుకూ ఘోరంగా తయారవుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో తమ పార్టీ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్యే దీనికి ఉదాహరణని అన్నారు. ఆ హత్యకు సీఎం రేవంత్, మంత్రి జూపల్లి కృష్ణారావే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాయకులు అభిలాశ్‌రావు తదితరులతో కలిసి ప్రవీణ్ కుమార్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. సాక్షాత్తూ సీఎం రేవంతే రాష్ట్రానికి హోం మంత్రిగా ఉన్నారనీ, ఆయన హయాంలో తెలంగాణలో రాయలసీమ తరహా ఫ్యాక్షనిజం కొనసాగుతోందని వాపోయారు. శ్రీధర్‌రెడ్డి హత్యోదంతంలో ఇప్పటి వరకూ ఒక్కర్ని కూడా అదుపులోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్‌తోపాటు రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై కాంగ్రెస్ దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘాన్ని, హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులను కలిసి కాంగ్రెస్ ఆగడాలపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.


పట్టభద్రులారా.. ఆలోచించి ఓటేయండి... : మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఆలోచించి ఓటేయాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ పట్టభద్రులకు సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ నేతలు 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టారని దుయ్యబట్టారు.

ధాన్యం కొనుగోళ్ల కుంభకోణంపై నిజనిర్ధారణ కమిటీ వేయాలి

- సిట్టింగ్ లేదా రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలి
- లేనిపక్షంలో ఆధారాలు సీబీఐకి : ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ధాన్యం కొనుగోళ్ల కుంభకోణంపై సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే నిజనిర్ధారణ కమిటీ వేయాలనీ, లేనిపక్షంలో హైకోర్టు సిట్టింగ్ లేదా రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం అలా చేయని పక్షంలో సీబీఐకి వివరాలను నేరుగా అందిస్తానన్నారు. సివిల్ సప్లయ్ శాఖలో జరుగుతున్న అవినీతిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధా నాలు చెప్పకపోగా దాటవేస్తున్నారని విమర్శించారు. ఆధారాలతో సహా బయటపెడితే కేసులు పెట్టి వేధించడం సరిగాదన్నారు. శనివారం హైదరా బాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి 18 ప్రశ్నలతో రాసిన లేఖను చూపెట్టారు. సరైన టైంలో మిల్లర్లు బియ్యం ఇవ్వకుండా మోసం చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఆలస్యం వల్ల ఆ శాఖ ఎంత నష్టాల్లో ఉంది? ఎంత వడ్డీ చెల్లిస్తున్నది? మిల్లర్ల నుంచి 22 వేల కోట్ల బకాయిలు వసూలు చేయకుండా లోపాయికారిగా కుదిరిన ఒప్పందం ఏంటి? ఒక్కరోజులోనే టెండర్ నోటిఫికేషన్ రిలీజ్, కమిటీ వేయడం, గైడ్‌లైన్స్ రూపొందించడం, టెండర్ ప్రాసెస్ చేయ డంలో ఉన్న మతలబు ఏంటి? అని నిలదీశారు. టెండర్‌లో రేటు ఫైనల్ చేశాక జల సౌధలో బిడ్డర్లు, కాంట్రాక్టర్లను పిలిపించి మంత్రి, కమిషనర్ కలిసి చీకటి ఒప్పందంలో భాగంగా రూ.100 స్టాంప్ పేపర్‌పై బిడ్ ఇచ్చిన వారికి, రైస్ మిల్లర్లకు మధ్య ఒక ఎంవోయూను రాయించుకున్నది వాస్తవం కాదా? వారి సంతకాలు పెట్టించుకున్నది నిజం కాదా? రూ.2007ను రూ.2223 కు నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లలో బిడ్డర్ దగ్గర నుంచి రైస్ మిల్లర్లు కొనుగోలు చేసినట్టు రాయిం చుకున్నది వాస్తవం కాదా? అని నిలదీశారు.

అదనంగా రూ.216 రాయిం చడం వల్ల 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి దాదాపు రూ.800 కోట్లు వసూలు కానున్నాయనీ, ఆ డబ్బు ఎవరి ఖాతాలోకి వెళ్లనుందో మంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి 90 రోజుల గడువు ముగిసినా కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వారి బిడ్‌ను రద్దుచేసి వేరే వారికి ఇస్తారా? లేక వారికే ఎక్స్ టెన్షన్ ఇస్తారా? అని అడిగారు. సన్నవడ్లను రూ. 2259కే అమ్ముతున్నారనీ, బియ్యం మిల్లింగ్ చేస్తే రూ.3500 లోపే ఖర్చవు తుందని చెప్పారు. కొత్తగా క్వింటాకు రూ.5700 పెట్టి 2 లక్షలా 20 వేల టన్నుల బియ్యాన్ని కొనాల్సిన అవసరమేంటి? ఆ నష్టాన్ని ఎవరు భరిస్తారు? అని ప్రశ్నించారు. దీని వల్ల రూ.370 కోట్ల కుంభకోణం జరుగు తున్నదని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా రాష్ట్రానికి కమీషన్ వస్తుందన్నారు. ఈ అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలని ప్రధాని మోడీ, హోంశాఖమంత్రి అమిత్‌షా, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని ప్రకటించారు.

స్క్రాప్ గోదాంలో చెలరేగిన మంటలు

- తరచూ పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదాలు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

నవతెలంగాణ-గుమ్మడిదల

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామికవాడలోని మైత్రి డ్రగ్స్ పరిశ్రమ ఎదురుగా ఉన్న స్క్రాప్ గోదామ్‌లో శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అందులో కెమికల్ డ్రమ్ముల నిల్వలు ఉన్నట్టు స్థానికులు వాపోతున్నారు. మంటల చెలరేగడంతో పక్కనే ఉన్న మైత్రి డ్రగ్స్ పరిశ్రమతోపాటు వివిధ పరిశ్రమల యాజమాన్యాలు, కార్మికులు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్లను రప్పించారు. సీఐ సుధీర్ కుమార్, ఏఎస్ఐ డీఎస్ రాజు సిబ్బందితో కలిసి హెటిరో పరిశ్రమ ఫైర్ ఇంజన్లతో సుమారు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. భారీగా నష్టం జరిగినట్టు తెలుస్తోంది.

బొంతపల్లి పారిశ్రామికవాడలో ఫైర్ స్టేషన్ లేకపోవడంతో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రమాదాలు తరచూ జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రత్యేక చొరవ తీసుకొని పారిశ్రామిక వాడకు ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని పారిశ్రామిక ప్రాంత ప్రజలు కోరుతున్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్క్రాప్ గోదాములను తనిఖీలు చేసి యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఓటేసేందుకు వెళ్తున్న వ్యక్తిని..

తొక్కి చంపిన ఏనుగు

రాంచీ : ఓటు వేసేందుకు వెళ్తున్న ఓ వ్యక్తిపై ఏనుగు దాడి చేసింది. కాళ్లతో తొక్కి చంపేసింది. జార్ఖండ్‌లోని తూర్పు సింగ్‌భూమ్ జిల్లాలో శనివారం ఈ ఘటన జరిగింది. గోబర్ఘాని గ్రామానికి చెందిన 71 ఏండ్ల వద్ధుడు శనివారం ఉదయం ఓటేసేందుకు ఇంటి నుంచి బయలు దేరాడు. అటవీ మార్గంలో నడుచుకుంటూ ధోలబెడ పోలింగ్ కేంద్రానికి వెళ్తుండగా ఓ ఏనుగు అతడిపై దాడి చేసి తొక్కి చంపింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అక్కడకు చేరుకున్న అటవీ శాఖ సిబ్బంది మతుడు సురేంద్ర నాథ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం తర్వాత మతదేహాన్ని బాధిత కుటుంబానికి అప్పగించారు. అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ. 25,000ను అటవీ శాఖ అందజేసినట్లు మృతుడి కుమారుడు తెలిపాడు. మరోవైపు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాలివాన బీభత్సం

- పలుచోట్ల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- కరెంటు సరఫరాలో అంతరాయం
- కొనరావుపేట వైన్స్ వద్ద కూలిన రేకుల షెడ్డు, ఒకరికి గాయాలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



నవతెలంగాణ - కొనరావుపేట/ సిరిసిల్ల టౌన్

సిరిసిల్లలో శనివారం సాయంత్రం గాలి దుమారం బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఉన్న వాతావరణం సాయంత్రం చల్లబడింది. ఒకేసారి గాలి దుమారం జన జీవనాన్ని స్తంభింపజేసింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గాలి తాకిడికి పట్టణంలో పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడి, కరెంట్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. చిన్న బోనాలలోని రేణుక మాత దేవాలయం వద్ద దాదాపు 125సంవత్సరాల చరిత్ర గల మర్రి చెట్టు నేలకొరిగింది. విద్యుత్ శాఖ సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారు.కొనరావుపేట మండలం కేంద్రంలో గాలివానకు వైన్స్ వద్ద ఉన్న రేకుల షెడ్డు కూలడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసింది. విద్యుత్ స్తంభాలు కూలడంతో సెస్ అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం మరమ్మతులు చేపడుతున్నారు.జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో గాలివానకు ఇండ్లపై కప్పులు కొట్టుకుపోయాయి. మేడిపల్లి మండలంలో దమ్మన్నపేటలో పూరి గుడిసె ధ్వంసమైంది. పలు ఇండ్లు, పశువుల కొట్టాలపై కప్పులు ఎగిరిపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలాయి.

ఫ్రాన్స్‌లో స్తంభించిన విమాన సర్వీసులు

- పారిస్‌లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ల సమ్మె
- ఓర్లీ విమానాశ్రయంలో 70శాతం సర్వీసుల రద్దు

పారిస్ : ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు సమ్మెకు దిగడంతో శనివారం ఫ్రాన్స్‌లో విమానరాకపోకలు స్తంభించిపోయాయి.. పారిస్‌లోని ఓర్లీ విమానాశ్రయంలో 70 శాతానికి పైగా సర్వీసులను శని, ఆదివారాల్లో రద్దు చేస్తున్నట్లు ఫ్రెంచి పౌర విమానయాన శాఖ ప్రకటించింది. దీంతో శనివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి ఆదివారం రాత్రి పొద్దుపోయేవరకు అన్ని కమర్షియల్ విమానాలు రద్దయినట్లు డీజీఏసీ అధికారులు తెలిపారు. వేతనాల, పని ఒత్తిడి వంటి సమస్యలపై యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు ఈ సమ్మె చేపట్టారు. జులై 26 నుంచి పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ప్రపంచం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, అభిమానులు తరలిరానున్నారు. నెల రోజుల వ్యవధిలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు సమ్మె చేయడం ఇది రెండవసారి. ఫ్రాన్స్‌లో రెండో అతిపెద్ద లేబర్ గ్రూప్ యూఎన్ఎస్ఏ - ఐసీఎన్ఏ ఆధ్వర్యంలో ఈ సమ్మె జరుగుతోంది.


గన్‌పౌడర్ ఫ్యాక్టరీలో పేలుడు

- ఒకరు మృతి
- ఏడుగురికి గాయాలు



రాయపూర్ : ఛత్తీస్‌గఢ్‌లో శనివారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. బెమెతారా జిల్లా బెర్లా తాలుకా బోర్సి గ్రామంలో ఉన్న అతిపెద్ద గన్‌పౌడర్ తయారీ ఫ్యాక్టరీలో భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు సజీవ దహనమయ్యారు. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఈ ప్రమాదంలో 17 మంది వరకు చనిపోయినట్లు వివిధ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. పోలీసులు, స్థానిక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బోర్సి గ్రామంలో పేలుడు శబ్దం భయంకరంగా వినిపించిందని.. ఆ ధాటికి భయంతో వణికిపోయామని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దట్టమైన పొగ అలుముకోవడంతో వెంటనే ఆ ఫ్యాక్టరీ వద్దకు పరుగులు తీశామన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రయివేటు ఫీ'జులుం' ఆగేదెన్నడు?




మేకిరి దామోదర్
9573666650

ప్రాథమిక విద్య బలంగా ఉంటే? ఎంతటి ఉన్నత విద్యనైనా అలవోకగా అభ్యసించవచ్చు. ఇష్టపడి నేర్చుకున్న విషయం ఏనాటికి మరపురాదు. విద్య బాల బాలికలందరి హక్కు. విద్యతోనే విజ్ఞానం దక్కుతుంది. విశ్వ సౌభాగ్యానికి విద్యార్థి పట్టుకొమ్మ.. మన దేశంలో విద్య ఉమ్మడి జాబితాలో ఉంది. నిధుల కేటాయింపు కూడా ఆ మేరకు వెచ్చించాల్సిన అవసరం ఉన్నది. అలాగే విద్య ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ రంగాలచే అందించబడుతుంది. ప్రభుత్వ అజమాయిషీ కొరవడి "రెంటికి చెడ్డ రేవడిలా" రెండు రంగాల్లోనూ కూనరిల్లిపోతున్నది. రాజ్యాంగంలో పొందుపరిచిన ఉచిత నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు అందని ద్రాక్షగా మారుతున్నది.

ప్రభుత్వ విద్యారంగంలో పాఠశాలల్లో ఉచిత విద్యతోపాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, వర్కుబుక్కులు తదితర సౌకర్యాలు అందించబడుతున్నాయి. అయినా ఏడాదికేడాది ప్రభుత్వ రంగంలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య పడిపోతున్నది. దీనిలో అనేక మేనేజ్మెంట్లలో కుల, మత, లింగ బేధాలతో గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు ప్రభుత్వ రంగంలోనే ఒక దానికి మరో సంస్థ పోటీగా ఏర్పడినవి. మౌలికవసతులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కొరతతో ప్రభుత్వ విద్య కొనసాగుతున్నది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ప్రధానంగా కేజీ టు పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్య అందిస్తామని, అటెండర్ పిల్లల నుంచి కలెక్టర్ పిల్లల వరకు- సర్పంచ్ పిల్లల నుండి సీఎం పిల్లల వరకు అంతా ఒకే బెంచీ(తరగతి గది)లో చదివేలా "కామన్ స్కూల్" తీసుకొస్తామన్న మాటలు దశాబ్ద కాలం గడిచినా అమలుకు నోచుకోలేదు. అంగన్వాడీలను సర్కారు బడుల్లో విలీనం చేయకపోగా, ఆరేండ్లు నిండిన వారినే చేర్చుకోవాలన్న నిబంధనలు శాపంగా మారాయి. ప్రభుత్వ విద్యను పరిరక్షించడంలో పాలకుల ఉదాసీనతతో ప్రయివేటు విద్యాసంస్థలకు వరంగా మారింది. తల్లిదండ్రులకు స్థోమత లేకపోయినా, భారీగా ఫీజులు పెంచినా భరిస్తూ పంపుతున్నారు. ఇలా ప్రభుత్వాలు విద్యా పరిరక్షణకు నిధులు పెంచడంలో, ప్రజల్లో నమ్మకం కల్పించడంలో విఫలమయ్యారని విద్యావేత్తలు భావిస్తున్నారు.

మన రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ బడుల్లో ఫీజుల మోత ఆకాశాన్నంటుతున్నది. ప్లే స్కూల్, ఎల్కేజీ, యూకేజీ మొదటి తరగతి నుంచి పదోతరగతి వరకు డొనేషన్లు, అభివృద్ధి చార్జీలతో పాటు పాఠ్యపుస్తకాలు, దుస్తులు, బూట్లు, బెల్టుల పేరిట తల్లిదండ్రుల జేబులకు భారీగా చిల్లులు పడుతున్నాయి. పాఠశాలకు ఉన్న డిమాండ్‌ను బట్టి ఫీజులను ఇష్టానుసారంగా పెంచేస్తున్నారు. ప్రభుత్వం రుసుములు పెంచడంపై నియంత్రణ పాటించకపోవడం వాటికి అనుకూలంగా మారింది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి కొన్ని పాఠశాలలు ఏకంగా 25 శాతం వరకు ఫీజులను పెంచేశాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో పాటు నగరాల్లో ఇదే పరిస్థితి ఉంది. నగరాల్లో పలు కార్పొరేట్ పాఠశాలలు 45 నుంచి 50శాతం పెంచేస్తున్నాయి. ఇలా ఏటా పాఠశాలల్లో రుసుములు పెంచడం ఆనవాయితీగా మారిపోయింది. దీనికంటూ నిర్ణీత ప్రాతిపదిక ఏమీ లేదు. మరోవైపు యూనిఫాంలు, పుస్తకాలు, బ్యాగుల ధరలను పెంచేస్తున్నారు. రూ. 200 ఉండిన చిన్నారుల బూట్లకు రూ.500 నుంచి రూ.1000 వరకు, మూడు జతల యూనిఫామ్‌లకు రూ.3000లు, టై రూ.300, బెల్ట్ కు రూ.300చొప్పున ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. తల్లిదండ్రులు వేడుకుంటున్నా వినడం లేదు. ప్రత్యేకంగా తయారు చేయించామని పాఠశాల చిహ్నం ఉన్నందున ఇక్కడే కొనుగోలు చేయాలని ఖరాఖండిగా చెప్తున్నారు. పుస్తకాలు సైతం బయటి మార్కెట్లో కొనడానికి ఒప్పుకోవడం లేదు. తాము చెప్పిన ముద్రణ సంస్థ పుస్తకాలనే కొనాలని అంటున్నాయి. ఇలా పెంచిన రుసుము(ఫీజు)లు అదనపు బాదుడుతో సామాన్య, మధ్య తరగతుల ప్రజలపై పెను భారం పడుతుంది. కొందరు అప్పులు చేసి మరీ పిల్లల ఫీజు చెల్లిస్తున్నారు.




ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల పెంపుదలపై ఎలాంటి నియంత్రణ లేకపోవడం యాజమాన్యాలకు వరంగా మారింది. తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. పాఠశాలల ఫీజుల వసూలు నియంత్రణ చట్టాన్ని తేవాలని 2022 జనవరి 17వ తేదీన జరిగిన మంత్రి మండలి సమావేశంలో అప్పటి మంత్రులు 11 మందితో ఉపసంఘం ఏర్పరిచింది. ఆ సిఫారసులు అమలు కావడం లేదు. కొన్ని పాఠశాలల్లో ప్లే స్కూల్ కు రూ. 1 లక్ష, ఒకటో తరగతికి రూ. 2.5 లక్షలుగా ఆపై తరగతుల వారిగా పెంచుకుంటూ పోతున్నాయి. అందరికీ ఉచితంగా అందించవలసిన విద్యను వ్యాపారంగా మార్చాయి. మరోవైపు ప్రయివేటు, కార్పొరేట్ బడులు గుర్తింపు, అనుమతి లేని పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు ఏ ఒకటో రెండో బ్రాంచ్లకు అనుమతులు తీసుకొని వేర్వేరుచోట్ల అనేక బ్రాంచ్లను నిర్వహిస్తున్నాయి కనీస రక్షణ లేని బహుళ అంతస్తుల భవనాలలో తరగతులు నిర్వహిస్తున్నా యి.ప్రభుత్వ నిబంధనలు..ఎస్టాబ్లిష్ మెంట్ రికగ్నిజేషన్ అడ్మిషన్ అండ్ కంట్రోల్ ఆఫ్ స్కూల్ అండర్ ప్రయివేటు మేనేజ్మెంట్ స్కూల్స్ యాక్ట్ 1993 ప్రకారం నివాస భవనాల్లో తరగతులు నిర్వహించకూడదు. తరగతుల నిర్వహణకు అనుమతులు ఇవ్వకూడదు. ఈ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు ఫైర్ సేఫ్టీ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ఆట స్థలం లేకపోవడంతో శారీరక వ్యాయామం, మానసిక వికాసం లేక మెజారిటీ పిల్లలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

అదేవిధంగా సైన్స్ ప్రయోగశాలలు మచ్చుకైనా కనిపించవు. తాగునీరు సైతం విద్యార్థులే సమకూర్చుకోవాల్సి వస్తుంది. ఇక మరుగుదొడ్లు, మూత్రశాలలు కంపు కొడుతున్నాయి. ఇలా గుర్తింపు, సౌకర్యాలు లేని పాఠశాలను వెంటనే రద్దు చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యాశాఖ అధికారులు హడావుడి చేసినా మళ్లీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోతుంది. కావున ఈ ఫీజుల దోపిడీని ఆపేలా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలను వెంటనే కట్టడి చేయాల్సి ఉంది. ఇటు ప్రభుత్వ అటు ప్రయివేటు, కార్పొరేటు విద్య కూడా అరకొర సౌకర్యాలతోనే నడుస్తున్నది. కానీ ఫీజులు రాబట్టడంలో మాత్రం జలగల్లా పీక్కు తింటున్నారు. ప్రభుత్వం వెంటనే కట్టడి చేయాల్సి ఉంది. విద్య, వైద్యం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్నాయి. అందరికీ ఉచిత నాణ్యమైన విద్య అందేలా చూడాలి. తద్వారా ఎదగడానికి సమాన అవకాశాలు కల్పించబడాలి. విద్య వ్యక్తిత్వానికి, జీవనోపాధిని కల్పించాలి. సంస్కారవంతంగా తీర్చి దిద్దబడాలి. ప్రభుత్వం ఉదాసీనత వీడనంత కాలం ఇది సాధ్యపడదు. పేదరికం దూరం చేయనంతవరకు విద్యారంగం అభివృద్ధి సాధించలేదు. ఈ విషయంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అయినా కఠిన చర్యలతో విద్యను ఒకే గొడుగు కిందికి తెచ్చి "కామన్ స్కూల్" విధానాన్ని ప్రవేశపెట్టాలి. ప్రయివేటు విద్యను పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలి. అప్పుడే పేద, మధ్య తరగతి వాళ్లకు న్యాయం జరుగుతుంది. సమాన అవకాశాలు దొరుకుతాయి. ■

మన రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ బడుల్లో ఫీజుల మోత ఆకాశాన్నంటుతున్నది. ప్లే స్కూల్, ఎల్కేజీ, యూకేజీ మొదటి తరగతి నుంచి పదోతరగతి వరకు డొనేషన్లు, అభివృద్ధి చార్జీలతో పాటు పాఠ్యపుస్తకాలు, దుస్తులు, బూట్లు, బెల్టుల పేరిట తల్లిదండ్రుల జేబులకు భారీగా చిల్లులు పడుతున్నాయి. పాఠశాలకు ఉన్న డిమాండ్ ను బట్టి ఫీజులను ఇష్టానుసారంగా పెంచేస్తు న్నారు. ప్రభుత్వం రుసుములు పెంచడంపై నియంత్రణ పాటించకపోవడం వాటికి అనుకూలంగా మారింది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి కొన్ని పాఠశాలలు ఏకంగా 25 శాతం వరకు ఫీజులను పెంచేశాయి.

విశ్వవిద్యాలయాలపై సన్నగిల్లుతున్న విశ్వాసం



దక్షిణాఫ్రికాలోని ఒక విశ్వవిద్యాలయ శిలాఫలకం మీద ఇలా వుంది. "ఏ దేశమైనా నాశనమవ్వడానికి అణుబాంబులు అక్కర్లేదు. అణ్వస్త్ర ఆయుధాలు అంతకంటే అక్కర్లేదు. ఆ దేశంలో లోపభూయిష్టమైన, నిర్వీర్యమైన విద్యావ్యవస్థ అన్ని వ్యవస్థలను నీచస్థితికి దిగజార్చుతుంది". నేడు దేశవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలు విశ్వ విద్యాలయాలలో విద్యా ప్రమాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గణితం, సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్‌లలో పదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం వరుసగా 32 శాతం, 35 శాతం, 37 శాతం, 43 శాతంగా నమోదయ్యాయని 'నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వే' పేర్కొన్నది. 2017 నాటి జాతీయ సర్వేతో పోల్చితే, 2021 సర్వేలో సగటు ఫలితాలు పడిపోయాయని తెలిపింది. తమిళనాడు, తెలంగాణ, మేఘాలయ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జాతీయ సగటు కన్నా దిగువన ఫలితాలు నమోదయ్యాయి. ముఖ్యంగా కరోనా సంక్షోభం విద్యార్థుల చదువుల్ని కకావికలం చేసింది. సామాజికంగా, ఆర్థికంగా మెరుగైన కుటుంబాల పిల్లలకు ఆన్‌లైన్ చదువులు అందుబాటులో ఉన్నాయని, మిగతావారికి కష్టసాధ్యమైందని సర్వే ఫలితాలు తెలిపాయి. ఆన్‌లైన్ ద్వారా సమాన విద్యావకాశాలు పూర్తిగా సన్నగిల్లాయని సర్వేలు చెబుతున్నా దిద్దుబాటు చర్యలకు ప్రభుత్వాలు పూనుకోవడం లేదు. భాషా నైపుణ్యం, పర్యావరణ శాస్త్రం, సైన్సు, గణితం, సామాజిక శాస్త్రాలలో పిల్లలు వెనుకబడ్డారు. తాజాగా కాగ్ నివేదిక ఆసక్తికర అంశాలను బయట పెట్టింది. ఐఐటి, ఎన్ఐటి లలో పీజీ, పిహెచ్‌డి కోర్సుల్లో ఏటా సీట్లు భారీగా మిగిలి పోతున్నాయని వెల్లడించింది.

ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసర్చ్ గుర్తింపు ఉండాలంటే కనీసం వంద ఎకరాల వ్యవసాయ భూమి ఉండాలి. ఇలాంటి విశ్వవిద్యాలయాలకు సెంటు భూమి లేదు. కళాశాలలో అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ కోర్సులు బోధిం చడానికి పట్టుమని నలుగురు అధ్యాపకులు ఉండరు. ప్రయివేటు విశ్వవిద్యాలయాల ఉప కులపతులు, కులపతులు ఎక్కువగా నియంత్రణ మండళ్లల్లో పని చేసి రిటైర్ అయిన వారిని నియమించడం జరుగుతుంది. ఎందుకంటే వీరి పరపతి ఉపయోగించి కోర్సులకు అప్రూవల్ తెస్తారని ధీమా. ఇలాంటి విశ్వవిద్యాలయంలో మూడేండ్ల విద్యనభ్యసించే విద్యార్థులకు వ్యవసాయంపై కనీస అవగాహన ఉండదు.

ఇక రెండు తెలుగు రాష్ట్రాలలో పరిశోధన పడకేసి దశాబ్దం అవుతున్నది. ప్రతి సంవత్సరం నిర్వహించాల్సిన రీసెట్ ఎంట్రన్స్ పరీక్ష మూడేండ్లకోసారి నిర్వహిస్తూ ఇంటర్వ్యూలు అడ్మిషన్లకు సంవత్సర కాలం తీసుకుంటున్నారు. చాలా విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులు లేక విభాగాలు మూసివేశారు. నకిలీ విశ్వవిద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. 2020లో అడ్మిట్ అయిన స్కాలర్‌కు 2022 పట్టా ఇస్తున్నారు. విశ్వవిద్యాలయంలో కంప్యూటర్, ఎంబిఏ విభాగాలలో చదువు చెప్పేవారే లేరు. బాసరలో వెలసిన ట్రిపుల్ ఐఐటి పరిస్థితి ఎలా ఉందో అనంతపురంలో వెలసిన కేంద్ర విశ్వవిద్యాలయం పరిస్థితి అలాగే ఉంది. అక్కడ వి.సి, అధ్యాపకులు లేరు. మౌలిక సదుపాయాలు లేవు. ఇక్కడ కేంద్ర విశ్వవిద్యాలయం పెట్టి ఏడేండ్లు కావస్తున్నా అద్దె భవనంలోనే ఉంది. అక్కడ ఉన్న శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, కాకతీయ విశ్వవిద్యాలయాలలో పట్టుమని పది మంది శాశ్వత అధ్యాపకులు లేరు. చివరికి వంద సంవత్సరాల ఘన కీర్తి ఉన్న ఉస్మానియాలో అరవై మంది అధ్యాపకులు లేరు. ఆంధ్రాలో వెలసిన నన్నయ్య, యోగి వేమన, ద్రావిడ, అంబేద్కర్, విక్రమ్ సింహపురి, పద్మావతీ, రాయలసీమ విశ్వ విద్యాలయాలలో పట్టుమని పదిమంది శాశ్వత అధ్యాపకులు కూడా లేరు. అధ్యాపకులు లేక కీలక విభాగాలు మూసివేతకు గురైనాయి. పొలిటికల్ సైన్స్, పాలిమర్ సైన్స్, స్టాటిస్టిక్స్, సెరికల్చర్, జువాలజీ, బయో కెమిస్ట్రీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఎకనామిక్స్, హిస్టరీ, సోషల్ వర్క్, రూరల్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమెటిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని విభాగాల్లోను ఒకే ఒక్కరితో నడుపుతున్నారు.

ఇక్కడ పని చేసే శాశ్వత అధ్యాపకులు మైనర్, మేజర్ రీసర్చ్ ప్రాజెక్టులకు అప్లై చేసిన పాపాన పోవడం లేదు. రీసర్చ్ గ్రాంట్ అనేది తెలియని స్థితిలో అధ్యాపకులు ఉన్నారు. రీసర్చ్ గ్రాంట్లే కాదు కాన్ఫరెన్సులు, సెమినార్, ఫ్యాకల్టీ డెంట్ ప్రోగ్రాంలకు, స్టాఫ్ డెవలప్‌మెంట్ కోర్సులు, రిఫ్రెషర్, ఓరియంటేషన్ కోర్సులు దశాబ్ద కాలంలో జరగలేదు. అకడమిక్ స్టాఫ్ కాలేజీలు, ఎలక్ట్రానిక్ మల్టీ మీడియా రీసర్చ్ సెంటర్లు నిధులు లేక వెలవెలబోతున్నాయి. ఇక ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, జువాలజీ, వృక్ష శాస్త్ర విభాగంలో టెక్నీషియన్లు, ల్యాబ్ అటెండర్లు లేక ప్రయోగశాలలు మూతపడ్డాయి.యుజిసి, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇతర నియంత్రణ సంస్థల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రయివేటు విశ్వవిద్యాలయాల అడ్డు అదుపు లేకుండా పోయింది. అడుగు వ్యవసాయ భూమి లేకపోయినా అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ కోర్సులు నడుపుతూ ఎలాంటి గుర్తింపు లేకున్నా విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెడుతున్న విశ్వవిద్యాలయాలపై ప్రభుత్వాలకు అదుపు లేకుండా పోయింది. కొన్ని నర్సింగ్, బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు షాపింగ్ కాంప్లెక్స్ లోను, కమర్షియల్, లాడ్జిలో, అద్దె భవనాలలో ఉంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సువిశాలమైన అత్యాధునిక వసతులతో శాశ్వత భవనాలు అని ప్రచారం చేస్తూ ఏడేండ్లుగా కాలం వెలిబుచ్చుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. బిఎస్సీ అగ్రికల్చర్, బిఎస్సీ హార్టికల్చర్, బిఎస్సీ ఫారెస్ట్రీ, ఎంబిఏ అగ్రికల్చర్...ఏ ఒక్క కోర్సుకు ఐ కార్ అనుమతి లేదు.

ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసర్చ్ గుర్తింపు ఉండాలంటే కనీసం వంద ఎకరాల వ్యవసాయ భూమి ఉండాలి. ఇలాంటి విశ్వవిద్యాలయాలకు సెంటు భూమి లేదు. కళాశాలలో అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ కోర్సులు బోధిం చడానికి పట్టుమని నలుగురు అధ్యాపకులు ఉండరు. ప్రయివేటు విశ్వవిద్యాలయాల ఉప కులపతులు, కులపతులు ఎక్కువగా నియంత్రణ మండళ్లల్లో పని చేసి రిటైర్ అయిన వారిని నియమించడం జరుగుతుంది. ఎందుకంటే వీరి పరపతి ఉపయోగించి కోర్సులకు అప్రూవల్ తెస్తారని ధీమా. ఇలాంటి విశ్వవిద్యాలయంలో మూడేండ్ల విద్యనభ్యసించే విద్యార్థులకు వ్యవసాయంపై కనీస అవగాహన ఉండదు. అగ్రానమి, సాయిల్ సైన్స్, క్రాప్ ప్రొడక్షన్, హార్వెస్టింగ్, పెస్ట్ కంట్రోల్, ప్లాంట్ పాథాలజీ, వీడ్ మేనేజ్‌మెంట్, పెస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన లేదు. సుదూర ప్రాంతాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి పిల్లలు ఇలాంటి విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్నారు. మూడు నాలుగేండ్ల తరువాత ఐ కార్ గుర్తింపు లేని, వ్యవసాయంపై కనీస అవగాహన లేని విద్యార్థులకు వీళ్లిచ్చే సర్టిఫికెట్‌తో ఎవరికీ ఉద్యోగం రాదు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి విద్యారంగంలో చోటు చేసుకుంటున్న ఇటువంటి అవకతవకలను సరిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ■

The major scientific objectives of Aditya-L1 mission are



Jagannadh
8885399893
Senior Lecturer for Science and Technology (UPSC)

1) Identify the characteristic features of sixth generation fighter jets

1. Designed using Digital Engineering (aka Model based Design)
2. Advanced digital capabilities including high-capacity networking, AI, data fusion, cyber warfare, D2D and battlefield command, control and communications (C3) capabilities.
3. Optionally manned, with the same airframe capable of conducting piloted, remote controlled or onboard-AI controlled missions.
4. Enhanced human-systems integration, with virtual cockpits presented via helmet -mounted displays which allow the pilot 360-degree vision with AI-enhanced battlefield awareness, and replacing conventional instrument panels

a) Only 1 is true b) only 3 is true
c) all the above are features of sixth generation fiter jets
d) none of the above are the features

2) identify the hyper sonic weapons of the following :

1. Hypersonic glide vehicle (HGV): missile warheads which manoeuvre and glide through the atmosphere at high speeds after an initial ballistic launch phase
2. Hypersonic cruise missile: cruise missiles which use air-breathing engines such as scramjets to reach high speeds
3. Hypersonic aircraft using air-breathing engines such as scramjets to reach high speeds
4. Guns which fire cannon-launched guided projectiles. These may be developments of traditional artillery or novel technologies such as railguns.

a) Only 1 is hypersonic b) only 2 is hypersonic
c) all the above technologies are hypersonic
d) none of the above are hypersonic

3) The major scientific objectives of Aditya-L1 mission are:

1. Study of Solar upper atmospheric (chromosphere and corona) dynamics.
2. Study of chromospheric and coronal heating, physics of the partially ionized plasma, initiation of the coronal mass ejections, and flares
3. Observe the in-situ particle and plasma environment providing data for the study of particle dynamics from the Sun.
4. Physics of solar corona and its heating mechanism.
5. Diagnostics of the coronal and coronal loops plasma: Temperature, velocity and density

a) 1,2, & 3 b) all the above
c) none of the above d) 3,4,& 5

4) Consider the statements regarding DURGA

1) Directionally Unrestricted Ray-Gun Array (DURGA) II, a lightweight directed energy weapon (DEW).
2) It aims to provide the Indian armed forces with cutting- edge technology capable of neutralising various threats, including drones, missiles, and artillery shells.
3) It is a type of weapon system that emits highly focused energy, typically in the form of lasers, microwaves, or particle beams, to incapacitate or destroy targets.

a) only stement one is true
b) only statement 2 is true
c) only statement 3 is true
d) all the statements ate true

5) Consider the following statements regarding kali

a) KALI the acronym for Kilo Ampere Linear Injector, is a weapon that India has designed as a potential response to any incoming missiles
b) As a high power microwave gun, KALI will produce a tremendous amount of microwaves.
c) It is a linear electron accelerator being developed by DRDO(Defence Research and Development Organisation) and BARC (Bhaba Atomic Research Centre).

a) only statement one is true
b) only statement 2 is true
c) only statement 3 is true
d) all the statements ate true

6) Consider the following statements regarding green energy

1) power solutions to stop climate change with wind, solar, water & photovoltaic energy.it Don't rely on fossil energy and find solutions to reduce greenhouse gas emissions.
2) Green energy creates no carbon emissions and has the lowest impact on the environment. Relative to fossil-fuel energy sources, it vastly improves the quality of the air we breathe, the water we drink, and conserves many of our precious natural resources.
3) The goal of a clean energy community is to reduce dependence on fossil fuels and decrease the overall carbon footprint of the community.

a) only statement one is true
b) only statement 2 is true
c) only statement 3 is true
d) all the statements ate true

7) Which of the following subatomic particles radiation leads to transmutation

a) alpha, beta, and Gama particles
b) only alpha and beta particles
c) only alpha and Gama particles
d) only beta and Gama particles

8) which of the following statements regarding nuclear reactors in India is/are true

1) The Canadian Deuterium Reactor Known as CANDU uses "Natural Uranium "U235 as fuel and uses Heavy water as moderator
2) Pressurized water Reactors uses ordinary water
3) II General Reactors:- Advanced gas cooled reactor. These are gas cooled British using graphite moderator and carbon dioxide as coolant. The fuel is uranium oxide pellets enriched to 2.5 to 3.5% in stainless steel tubes the steam can be generated at 650c
4) "Liquid Metal Fast Breeder Reactor (LMFBR) which uses molten metal liquid sodium as coolant

a) Only 1 b) non of the above
c) all the above d) only 3

9) Identify the country and the missile defence system

1) Iron dome 2) iron beam
3) David's sling 4) Arrow 5) patriot

a) Iron dome belongs to Israel
b) Iron beam belongs to China
c) Davis sling belongs to U K
d) All of them belong to Israel

10)Which of the following points of COP28 are capable of paradigm shift in climate change

1) Fast-tracking the energy transition and slashing emissions before 2030;
2) Transforming climate finance, by delivering on old promises and setting the framework for a new deal on finance;
3) Putting nature, people, lives, and livelihoods at the heart of climate action; and
4) Mobilizing for the most inclusive COP ever.

a) Only 1 b) non of the above
c) all the above d) only 3

11) Consider the following statements regarding CRISPR technology

1) CAS-9 (CRISPR-associated protein 9) is an enzyme. It uses a synthetic guide RNA to introduce a double-strand break at a specific location within a strand of DNA. It is a system used by bacterial cells to recognize and destroy viral DNA as a form of adaptive immunity.
2) an enzyme called Cas9. This acts as a pair of 'molecular scissors' that can cut the two strands of DNA at a specific location in the genome so that bits of DNA can then be added or removed.

a) Only statement one is true
b) Only statement two is true
c) None of them are true
d) Statement one and two are true

12) Consider the statements regarding mitochondrial DNA

1)They play an important role in the regulation of cellular metabolism, apoptosis and oxydative stress control.
2) Mitochondrial DNA is responsible for maternal inheritance, and a high mutation rate

a)Only statement one is true
b)Only statement two is true
c)None of them are true
d)Statements one and two are true

13) Consider the statements regarding dark matter, dark energy and matter

1. Dark matter, a component of the universe whose presence is observed from its gravitational attraction rather than its luminosity.
2. Dark matter makes up 30.1 percent of the matter- energy composition of the universe;
3. dark energy constitutes (69.4 percent) and
4. "ordinary" visible matter (0.5 percent)

a) Only statement 1 is true
b) Only statement 2 is true
c) Non of them are true
d) All the statements are true

14) Which of the following states of matter exists in lowest density

j) gas b) liquid c) plasma d) BEC

15) consider the following statements

1) the magnetic compass directs towards magnetic north of the earth
2) the magnetic compass directs towards magnetic south
3) the magnetic compass directs towards geographic north of the earth
4) the magnetic compass directs towards geographic south of the earth

a) only 2 b)only 2 & 3
c) only 4 d) only 1 & 4

16) Identify the right statement/statements regarding Wildlife (Protection) Act of 1972

1) "Forest" including "Wildlife" was then a State subject falling in Entry 20 List II of Seventh Schedule, Parliament had no power to make law on the same except as provided in Articles 249,250 and 252 of the constitution.
2) After the enactment of Jammu & Kashmir Reorganization Act, 2019 by the Parliament, the Jammu & Kashmir Wildlife (Protection) Act, 1978 was repealed was the Central Act, i.e; Wildlife Protection Act, 1972 became applicable to the Union Territory of Jammu & Kashmir.
3) The Act was amended subsequently in 1982, 1986, 1991 and 1993 to accommodate provision for its effective implementation.

a) Only 1 b) only 3
c) all the above d) only 1 & 2

17. Consider the objectives of NATIONAL FOREST POLICY 1988

1) Conserving the natural heritage of the country by preserving the remaining natural forests with the vast variety of flora and fauna
2) Checking soil erosion and denudation
3) Checking the extension of sand-dunes
4) Increasing the productivity of forests to meet essential national needs.

Which of the above objectives are part of NATIONAL FOREST POLICY 1988

a) Only 1 b) only 3
c) all the above d) only 1 & 2

18. which of the following are marine mammals

1) Narwhal 2) Beluga 3) Dugong
4) sea cow

a) Only 1 b) 2 & 3
c) 3 & 4 d) all the above

19) consider the statements regarding bio fertilizers

1) Azospirillum is a nitrogen-fixing bacteria that live around the roots of higher plants but do not develop an intimate relationship with plants
2. Phosphate solubilizing microorganisms such as Aspergillus, Bacillus, Pseudomonas, etc hydrolyze insoluble phosphorus compounds to the soluble form for uptake by plants
3. "Rhizobium is a soil bacteria that fixes atmospheric nitrogen once it finds a base inside the roots of the leguminous plants".

a) only 3 is correct b) only 2 is correct
c) only one is correct
d) all the statements are true

20) which of the following phylum has the highest species of animals

a) Echinodermata b) Arthropoda
c) Mollusca d) Annelida

ANSWERS

1. c	2. c	3. b	4. d	5. d
6. d	7. b	8. c	9. d	10. c
11. d	12. d	13. d	14. c	15. a
16. c	17. c	18. d	19. d	20. b